CP 10176 C
894.881 P98

పొద్దు పొడిచింది

12 79 3E

అద్దుమిల్లి పూర్ణచంద్రరావు



00440

Blank Page

I CP10176

పొద్దు పొడిచింది

కథల సంపుటి

రచయిత

అత్తునిల్లి పూర్ణచంద్రరావు

తొలిపలుకు

ఆంధ్రప్రదేశ్ హైకోర్టు జడ్జ్

జస్టిస్ ఆవుల సాంబశివరావు

పరిచయం

శ్రీ కొడవటిగంటి కుటుంబరావు

ముఖచిత్రం

గోపి

చిత్రాలంకరణ

చంద్ర

బాలి

ఇ. వి. రమణ

త్రిగుణ్

ప్రచురణ

అపూర్వ ప్రచురణలు

విజయవాడ - 520 010

0:441

పొద్దు పొడిచింది

కథల సంపుటి

తొలి ప్రచురణ :
జూన్ 1976

వెల :
అయిదు రూపాయలు

కాగితం సరఫర :
తాతినేని శ్రీహరిరావు

బ్లాక్‌మేకర్స్ :
కొడాలి మధుసూదనరావు
కరణం వీర్రాజు

ముద్రణ :



బైండింగ్
దీనదయాళు బైండింగ్ వర్క్స్

కృతజ్ఞతలు

నాకు మిత్రులు, సహచరులు, హితైషులు; నా రచనా వ్యాసంగానికి, అభ్యున్నతికి తోడ్పడుతున్నవారు పెక్కుమంది వున్నారు. వారిని పేరుపేరునా ఉదహరించబోగా ఆ సంఖ్య శతాధిక మయింది. అందుచేత, ఆ ప్రయత్నాన్ని ప్రస్తుతానికి విరమించుకొని వారందరికీ నా హార్దికాభినందనలను మాత్రమే తెలుపుకుంటున్నాను.

అయితే, ఈ పుస్తకం ఈ రూపంలో వెలువడడానికి దోహదకారులయిన కృష్ణాజిల్లా మంటాడకు చెందిన ప్రముఖులు, పత్రికా రచయిత శ్రీ పులి శ్రీరంగారావుకు ఇతర మిత్రబృందానికి ఈ సందర్భంగా కృతజ్ఞతలను చెప్పడం నా కనీస కర్తవ్యం.

అంతే కాదు. ఈ పుస్తకంలో నా పేరు కాక, మరి కొన్ని పేర్లు వున్నాయి. వారికి నా నమస్కృతులు

—రచయిత





మిత్రుడు, సహృదయుడు, సంస్కారి

హోలియో వ్యాధినివారణ నిపుణుడు

డాక్టరు తాళ్లూరి శివరామకృష్ణయ్యకు

ప్రేమాభిమానాలతో, కృతజ్ఞతాభినందనలతో

—రచయిత



Blank Page

ఈ కథల ప్రత్యేకత

సారస్వత న్యాయమూర్తి
శ్రీ ఆవుల సాంబశివరావు


శ్రీ అడ్డువిల్లి పూర్ణచంద్రరావు రాసిన ఈ కథల్లో జీవం వుంది. జీవితం వుంది. అది ఈ కథల ప్రత్యేకత.

చిన్న కథకు, నవలకు ప్రధానమైన తేడా వుంది.

నవల ఒక పెద్ద కథ ద్వారా జీవితాన్ని, సమాజాన్ని చిత్రిస్తే చిన్న కథ ఒక సంఘటనను మాత్రమే వస్తువుగా స్వీకరిస్తుంది. అందుచేత రచయితకు చిన్న కథలో స్వేచ్ఛ తక్కువ. చిన్న పరిధిలో తను చెప్పదలచుకొన్నదాన్ని చెప్పగలగాలి.

ప్రతిభ వుంటేకాని ఈ పని సాధ్యం కాదు, కథ రాణించదు.

శ్రీ పూర్ణచంద్రరావుకు ప్రతిభ చాలా వుంది. అది జీవితాన్ని వడకట్టినందువల్ల అయనకు సమకూరింది. సొంత జీవితాన్ని స్వహస్తాలతో నిర్మించుకున్నాడు. ఎన్నడూ నేల విడిచిన సాము ఎరగడు. అందుకనే ఇందులో ప్రతి కథలోను వాస్తవికత ప్రతిబింబిస్తుంది. మానవ నైజం విభిన్నరూపాలలో ద్యోతకమవుతుంది. వీటిని చిత్రించడానికి కావలసిన పదునైన భాష, శ్రీ పూర్ణచంద్రరావుకు వుంది. సన్నివేశానికి కుదిరే శైలి, చేవ, వాడిగల పదజాలం ఈ కథలకు అలంకారాలు.



అందుకనే అన్నాను-

ఈ కథల్లో జీవం వుందని.

చదవండి-మీకే తెలుస్తుంది.

కథకుని కథనం



శ్రీ కొడవటిగంటి కుటుంబరావు

ఆధునిక తెలుగు సారస్వతంలో కథానిక చాలా దశలు గడిచింది. గురజాడతో ప్రారంభమైన కథకులు నాలుగైదు తరాల వాళ్ళున్నారు. ఈ తెలుగు కథానికా సాహిత్యాన్ని పరిశీలించేవాళ్ళు ఏ కథ ఏ తరంవాళ్ళు రాసినదీ తేలికగా చెప్పగలుగుతారు.

కథల ఇతివృత్తాలలోనూ, శిల్పంలోనూ తేడాలు రావటం కేవలమూ కాల ప్రభావాన్నిబట్టేనని చెప్పటానికికూడా లేదు. కథకులు వట్టిపోతారు. ఆ సంగతి తెలుసుకోలేని కథకులు తాము పాత పద్ధతిలో నీరసంగా కథలు రాసుకుంటూపోయి, ప్రజల అనాదరణకు పాత్రులవుతారు.

కథకుడి ప్రతిభ దీపం కాంతిలాగా కొంతమేర మాత్రమే ప్రసరిస్తుంది. ప్రతిభలలో తేడాలు ఉండవచ్చు. అంచే ఏ కథకుడూ అనంతంగా ఉత్తమ రచనలు చెయ్యలేడు.

సాహిత్య చరిత్రలో ఒక దశలో కథానిక ఉచ్ఛలో ఉండవచ్చు మరొక దశలో క్షీణత ఏర్పడవచ్చు. అది పాఠకుల ప్రాప్తం. ఏ కాలంలో జీవించేవాళ్ళు ఆ కాలంలో వెలువడే ఉత్తమ రచనలతో తృప్తిపడాలి. అయితే మొత్తంమీద సాహిత్యం ముందుకే పోతుంది. ఎందుకంటే ఒక తరం రచయితలు వదిలేసినచోట మరో తరం రచయితలు అందుకుంటారు.

ఈ కథల సంపుటి ఒక కథకుడి సరికొత్త రచన. రచయిత పేరు నాకు ముందే పరిచయం. అయినా సరికొత్త కథకుడి రచనలను మాటీ కథకుడు పరిచయం చేయటంలో కొంత ఔచిత్యం ఉన్నాదనుకుంటాను.

౬

ఈ రచయితమీద పూర్వ, వర్తమాన కథకుల ప్రభావం ఏ మాత్రమూ ఉన్నట్టు నాకు తోచలేదు. కథల ఇతివృత్తాలూ, కథనమూకూడా రచయిత సొంతంగా కనిపిస్తాయి.

కొన్ని ఇతివృత్తాలు స్పష్టంగా జానపదాలు. ఉదాహరణకు "పొద్దు పొడిచింది", "విడిపోయిన మంచుతెరలు", "సంత", "వరలక్ష్మి పెళ్ళి", "కవిగారి కళ్యాణం"

అయితే ఇవి జానపద శైలిలో రాసినవి కావు.

మరికొన్ని కథలు సెంటిమెంటును ఆశ్రయించినవి. ఉదాహరణకు "ఒకరి కొకరు", "ఆకలి".

కొన్ని కథలలో జీవిత విమర్శ వున్నది- "జంతు ప్రదర్శనశాల", "విజయవాడ ఇంజినీరు", "విలేకరులు".

"ప్రమాదం", "సులోచన", "ఘటనాఘటనలు" లాటి కథలను వర్గీకరించటం నాకు సాధ్యం కాలేదు.

ఒక్కటి దాదాపు అన్ని కథలలోనూ కనిపిస్తుంది. ఈ కథకుడు కేవల వాస్తవికతకూ, కథలలోని భావాలు విశ్వసనీయంగా వుండేటట్టు చూడటానికీ శ్రమ పడలేదు. దాదాపు ప్రతి కథలోనూ నమ్మశక్యంగాని మలుపు ఒకటి కనిపిస్తుంది.

రచనా విధానం రేఖా చిత్రాలను స్ఫురింపజేస్తుంది. ఈ కథలను భావ చిత్రణలుగా రచయిత ఉద్దేశించినట్టు నాకు తోస్తుంది.

కథకుడుగా ఈ రచయిత పురోగతి పాఠకుల రియాక్షన్ పైన హెచ్చుగా ఆధారపడి ఉంటుంది.

మరొక కథకునిలోఖి

శ్రీ పూర్ణచంద్రరావుగారికి,

మీవి కథలు అనడం కంటె గల్పికలు అనడం న్యాయమను కుంటాను.

ఇతివృత్తాల విషయంలో, శిల్పం విషయంలో వైశాల్యంకన్న లోతు ఎక్కువని నాకు అనిపించింది.

రచనలో మీకున్న సంయమనానికి మిమ్మ్ల అభినందిస్తున్నాను. ఎక్కడా అతిగా చెప్పడ మనేది లేదు. చెప్పదలచుకున్నది అతి సూటిగా, కుదించి చెప్పారు. చేయి తిరిగిన కథకునికి వుండవలసిన మొదటి లక్షణం ఇది.


కొద్ది మాటలతో చురుకైన భావచిత్రాలను రచించారు.

"విడిపోయిన మంచుతెరలు", "సులోచన" "ప్రమాదం" నాకు బాగా నచ్చిన కథలు.

మద్రాసు, 17-6-'76 పాలగుమ్మి పద్మరాజు



7



పొద్దుపొడిచింది

బయట జరుగుతున్న పోట్లాటతో లోన నిద్రిస్తున్న సుబ్బారావు ఉలిక్కిపడి కనులు తెరిచాడు. కళ్ళు నులుముకున్నాడు.

బయట తల్లి అరిచే అరుపులతో లోన ఇతని మగత కాస్తా వదలిపోయింది. కనులను మరల రెండు చేతుల గుప్పిళ్ళతో నులుముకున్నాడు.

పాలు పోయించుకు వెళ్ళే మనిషితో అమ్మ పోట్లాడుతున్నది. పాలలో నీళ్లు కలుస్తున్నాయి కనుక రేటు తగ్గించివేస్తున్నానంటున్నాడు పాలు పోయించుకుపోయే మనిషి. థూ తెరి అంటూ అందరిమీద ఒట్లు పెడుతూనే శాపనార్థాలు పెడుతున్నది అమ్మ.

సుబ్బారావు విసుగ్గా ప్రక్కకు తిరిగి మంచం పట్టెమీద పెట్టివున్న బీడీ, అగ్గిపెట్టె తీసి వెలిగించుకున్నాడు.

కళ్లు మూసుకొని చీకటిలో ఆలోచిస్తున్నాడు సుబ్బారావు. నిదానంగా ప్రారంభమయిన ఆలోచనలు సూటిగా, పదునుగా పోతున్నాయి.

సుబ్బారావు కుటుంబం పెద్దది. తల్లి, తండ్రి, పెళ్ళికు వచ్చిన ఇద్దరు చెల్లెళ్ళు, ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న మరొక చెల్లాయి, గొడ్లను కాసుక వస్తున్న తమ్ముడు, ఇంటివద్దే ఖాళీగా ఉంటున్న మరొక తమ్ముడు, తను.

నాలుగెకరాల కొండ్ర లేకపోలేదు. ఎడ్లు, బండికూడా ఉన్నాయి.

సొంత పని లేని సమయాలలో కిరాయి తోలుకుంటాడు తండ్రి. లేదా 'బదులు' వెడతాడు.

స్కూల్ ఫైనల్ వరకు చదువు పెలిగించాడు సుబ్బారావు. ప్రస్తుతం అతను మూడు మైళ్ళ దూరాన ఉన్న పెద్ద పెట్టణంలో చిన్న ఉద్యోగం చేస్తున్నాడు.

అతని తూకం నెలకు రెండు వందల రూకలు.

ఉండేది పల్లెలో. నౌకరీ పట్టణంలో. మధ్య దూరం మూడు మైళ్లూ నడిచే వెడతాడు.

చద్ది తిని, టిఫిన్‌లో ఇంత వేడి అన్నం పెట్టించుకుపోతాడు. సాయం త్రానికి ఉసూరుమియాలా కాళ్ళీడ్చుకుంటూ ఇంటికి చేరతాడు. చేరి, దీర్ఘంగా నిశ్వ సిస్తాడు. హూఁ....

నెల రోజులు తిరిగేటప్పటికి రెండు వందల రూపాయలూ తీసుకవచ్చి తల్లి చేతిలో పెడతాడు.

ఆమె ఆ జీతాన్ని పెట్టిలో పెట్టి, వేరొక డబ్బాలోని డబ్బిరోసుంచి కొన్ని చిల్లర డబ్బులుతీసి లెక్కించి వెరసి నాలుగయిదు రూపాయలను అతని చేతిలో పెడుతుంది-గొణుక్కుంటు.

సుబ్బారావు అరగంటో ఆరు గంటలో బ్రతిమలాడగా మహా ఇస్తే ఒకటి రెండుపైసలు తక్కువగానే మరొక పావలో, అర్ధో అతని చేతిలోకి విసిరికొడుతుంది.

వాటిని బీడీలకు ఖర్చు పెట్టుకుంటాడు. అవి తన డబ్బులు, తన ఇష్టం!

ప్రస్తుతం అట్టి బీడీనే తగలేస్తున్నాడు సుబ్బారావు. కొత్తడబ్బులతో కొనిన సరికొత్త బీడీ. పొట్లగిత్త మార్కు బీడీ!

సుబ్బారావు తండ్రి సూరయ్య. అయన 'మారాజు'! తల్లి రత్తమ్మ. ఆవిడ 'మాతిమ్మ'! ఇది జనవాక్యం.

గ్రామంలో అంతా సుబ్బారావును ఫలాన చేలో రత్తమ్మ కొడుకు అంటారే కాని ఒక్కరూ సూరయ్య పేరు తలవరు.

అంతవరకు ఎందుకు - రత్తమ్మ భర్త సూరయ్య అంటారేకాని సూరయ్య భార్య రత్తమ్మ అని ఒక్కరు అనరు. పల్లెటూళ్ళో - అదంతే!

అది రత్తమ్మ పుట్టి, పెరిగి, మెట్టిన ఊరు. ఆ ఊర, ఆ ఇంట రత్తమ్మ శాసనమే శాసనం. ఆమె చెల్లుబడే చెల్లుబడి.

ఆమె కుటుంబాన్ని చూచి కాకపోయినా, నోటికి జడుస్తుంది ఊరూనాడు.

తాయారు సుబ్బారావు పెద్ద చెల్లెలు. రివటాలా వుండే ఈ పిల్లకు పెళ్ళీడు మించిపోతున్నది.

పుకార్లు పొంగిపోతున్నాయి. నోళ్ళు నొక్కుకుపోతున్నాయి.

గ్రామంలోని దగ్గిర సంబంధాలే రెండు మూడు వచ్చినా, నిర్మొహమాటంగా తిరగ్గొట్టివేసింది రత్తమ్మ.

ఓ మంచి సంబంధం సుబ్బారావుకుకూడా చూచి, ఇరువురి పెళ్ళిళ్ళు ఒకే సారి చేస్తే ఖర్చు కలిసి వస్తుందని రత్తమ్మ ఉద్దేశం.

అయితే, సుబ్బారావును ఎరిగినవారెవరు – ముఖ్యంగా రత్తమ్మ పేరు వినిన వారు మాత్రం – తమ కుమార్తెను ఇస్తామని ముందుకు రావడంలేదు.

అతను ఇంకా తల్లిచాటు బిడ్డడే! ఆ యమ్మ కొడుకు!

మొన్ననే తాయారును చూడ్డానికి ఎవరో వచ్చారు. సుబ్బారావు, తాయారు, వాళ్ళ చెల్లెళ్ళ బలహీనతలు, ఊసకాళ్ళు, దేబి ముఖాలు, పాలిపోయిన కనులు, కరిగిపోయి వున్న గుండెలను చూచి, ముక్కుపై వ్రేలిడుకొని వెళ్ళిపోయారు.

చాటుమాటున ఆడపిల్లలంతా వెక్కి వెక్కి ఏడ్చారు. కుళ్ళి కుళ్ళి రోదించారు.

రత్తమ్మ వాళ్ళను వీళ్ళను కలిపి ఏకగాటిన సంతకుతోలి శాపనార్థాలను చెరిగి పోసింది. సూరయ్య ఏమీ మాట్లాడలేదు. మాట్లాడడుకూడ!

పెక్కు సంబంధాలు తిరిగిపోవడంతో, ఆయన అసలు కుటుంబ విషయాలనే పట్టించుకోవడం విరమించుకున్నాడు.

ముఖం చెల్లక, గ్రామంతోనే ఎక్కువ సంబంధాలను పెట్టుకోవడం ఏనాడో మానివేశాడాయన. ఆయన మగమనిషి!

చిన్న కొడుకుతో అన్నం తెప్పించుకొంటూ, ఇంటి ముఖం చూడకుండా పొలంలోనే కాలక్షేపం చేయడం సాగించాడు సూరయ్య.

డొంకగట్టుమీద చిన్న పాక వేసుకొని, రాత్రుళ్ళుకూడా అక్కడే ముసుగును నిగడదన్నడం అలవాటు చేసుకున్నాడాయన.

* * * *

0c447

బీడీకి మరొక బీడీని ముట్టించడం మొట్టమొదటిసారిగా ఇప్పుడే చేశాడు సుబ్బారావు.

ఇది అతను చేసిన తొలి సాహసమేనని అనుకోవలసివుంటుంది. సాహస వీరుడయాడు సుబ్బారావు!

రోజుకు పది పైపల బీడీల కంటే ఎక్కువ కాల్చడానికి అతనికి అధికారం లేదు. అది రత్తమ్మ శాసనం.

కాగా, ఇంటివద్ద ఉన్నప్పుడు, కుతి తీర్చుకోవడానికని ఒకే బీడీని రెండు సార్లు అంటించేవాడు సుబ్బారావు.

అటువంటిది, ఒకేసారి వెంట వెంటనే బీడీ నిప్పుతో బీడీని ముట్టించుకొన్నాడు. ఇదే విశేషం!

ఇంకా పూర్తిగా తూరుపు తెలవారక ముందే రత్తమ్మగారి ఇంట రెండు అగ్గిపుల్లలు అయిపోవడంకూడా ఇదే మొదలు!

కొడుకువద్ద అగ్గిపెట్టె వున్నా, పొయ్యి రాజేయడానికి రోజూ పొరుగిళ్ళనుంచే పిడకమీద నిప్పు తెవడమో, గుడ్డ చుట్టకాని, నారపీచుకాని కాల్చుకు రావడమో రత్తమ్మకు రివాజు.

సుబ్బారావు మెదడు ఇప్పుడు స్పుత్నిక్‌వలె పనిచేస్తున్నది. అందుకు నిదర్శనం తగులబడుతున్న బీడీ. రెండవ బీడి!

తల్లి పొదుపు ఉద్యమం పరాకాష్ఠ నందుకొని అతనిని ఉక్కిరిబిక్కిరి చేసింది. చేస్తున్నది.

పట్టణంలో తోటి ఉద్యోగులు సాటివానిగా తనను పరిగణించడమే లేదు. పైగా అసహ్యించుకొంటున్నారు.

హేళనచేస్తున్నారు. ఉడికిలిస్తున్నారు.

ఇతరు లెవరో ఏదో అనుకుంటారని కాకపోయినా, ఇటీవల తనను తనే ఏవగించుకొంటున్నాడు సుబ్బారావు.

తన స్థితికి, తన గతికి తనకే ఏడుపు వస్తున్నది. మానసిక రోదన. మూగవేదన.

క్రితం రాత్రి గ్రామంలోని యువకులందరు గానుగచెట్టు కిందకు చేరి చెడుగుడు ఆడుతుంటే తనూ ఆడతానన్నాడు.

'కాళ్ళు రెండు కలిపి గిరగిర తిప్పి గిరాటేస్తే వెళ్ళి రత్తమ్మ ఇత్త ఒడిలో పడతావ్, నువ్వేం ఆడతావ్ బలిగుడి? పోయి, పెందరాళే పడుకుని పొద్దున్నే లేచి పట్నానికి నడువ్, చాలు!' అన్నాడు ఒక బావ వరసగాడు.

వాడు....వాడు. ఆ రాస్కెల్ ....

అవును. అతనన్నది నిజమే... తను....తను....

తన చెల్లెళ్ళ స్థితి మరీ అధ్వాన్నంగా వున్నది. పెళ్ళికానున్న యువతులయినా ఏ క్షణాన వారిలో జీవకళ కనపడదు.

చెల్లెళ్ళిద్దరూ హాయిగా, మనస్ఫూర్తిగా, స్వేచ్ఛగా, సహజంగా, సజీవంగా నవ్వడం తనెన్నడూ చూడనేలేదు. దేబెరిగొట్టు ముఖాలు!

అక్కడికీ ఒకనాడు చిన్నది అనవలసిన మాట కాస్తా అననే అన్నది- 'గాజులు తొడుక్కోరా!' అని!

రెండవ బీడీ అయిపోయింది. అప్పుడే అయిపోయింది.

చీచీ....మారాలి, ఇహ లాభంలేదు....

కాకులు కూస్తున్నాయి. కాకిగోల!

తాయారు మజ్జిగ చేస్తున్నది. అవి తమకు దక్కే మజ్జిగనీళ్ళు కావు.

చిన్నది కళాపి జల్లుతున్నది. కసిగా, తన ముఖానే పేడనీళ్ళు కొడుతున్నట్టున్నది.

అమ్మ రెండవ గేదె పాలు పితుకుతున్నది.

ఆ పాల రుచి తమకు తెలియదేం....

సుబ్బారావు లేవబోయి, ఆదివారం అని గుర్తుకువచ్చి, మళ్ళీ నిగడదన్నాడు ముసుగు పెట్టుకుంటూ.

ఇవ్వాళ ఆదివారం అని గుర్తుకు రాగానే నిన్న శనివారం అని, జీతం వచ్చిందని, అది మొత్తంగా అమ్మ చేతికి వెళ్ళిపోయిందనీ గురుతు వచ్చింది సుబ్బారావుకు.

గొణుక్కున్నాడు. సణుక్కున్నాడు! అంతవరకే!

కాని....కాని....

*　　*　　*　　*

పొద్దు పొడిచింది.

అప్పుడే బారెడెక్కింది.

తాయారు వచ్చి అన్నను పిలిచింది. అతను లేవలేదు.

దగ్గరగా వచ్చి ముసుగును లాగివేసింది. ఆశ్చర్యపోయింది.

కళ్ళు తెరుచుకునే వున్నాడు సుబ్బారావు!

అవును! అతను కళ్ళు తెరచాడు!

అతను ఇప్పుడు మనిషిగా, కొత్తమనిషిగా ఆలోచిస్తున్నాడు!


'తొండంగికోసుకు రమ్మంటాందిరా అమ్మా!' నీరసంగా సాగదీసింది తాయారు. దానిలాగే దాని గొంతుకంతా నీరసమే!

'అమ్మ' అనే శబ్దం వినగానే ఉలిక్కిపడింది సుబ్బారావు గుండె.

అయినా అతను కదల్లేదు మెదల్లేదు.

అలాగే చూస్తున్నాడు. ఇంటి కప్పును, ఇంటి వాసాలను లెక్కించ బోయాడు.

అతని మంచంకోటిమీద నిదానంగా కూర్చున్నది తాయారు. నిదానంగా అడిగింది:



'అన్నయ్యా! అమ్మను ఇవాళ పిండివంట ఏదయినా చేయమనవా....!'

పిండివంటే!

సుబ్బారావు తన దృష్టిని తాయారు ముఖంవైపుకు మరల్చాడు.

ఆమె బుగ్గలు పీక్కుపోయాయి. జుత్తుకు తైల సంస్కారమే లేదు.

చేతులు గోగుపూసలుగా తోచాయి. నుదురు ముడతలు పడివున్నది. కనులలో జీవంలేదు.

చేతులకు రెండే రెండు గాజులు. మెడలో పిచ్చ ముత్యాలహారం....

'హ్హా....!' అంటూ నిలువునా లేచాడు సుబ్బారావు

కచ్చిగా లేచాడు. కొత్తమనిషిగా లేచాడు.

కచ్చికతో పలుతోముకున్నాడు. తాటియాకుతో నాలుక గీసుకున్నాడు. పెద్ద ముంతలోని నీళ్ళతో ముఖం కడుక్కున్నాడు. సరాసరి వంటింటిలోకి వెళ్ళాడు.

అమ్మ అప్పుడే ఉడుకుతున్న అన్నాన్ని తెడ్డుతో కలియతిప్పుతున్నది.

అన్నం! అన్నం! పేడన్నం!

'ఆకలవుతున్నది అన్నం పెట్టవే....!' అడిగాడు పీటవేసుకు కూర్చుంటు, ఉట్టి వైపుకు చూస్తూ, దానిలోని పెద్ద చట్టి వైపుకు చూస్తూ.

'చద్దన్నం లేదు. ఉడుకుతోంది కనిపించడంలా? పొలం వెళ్ళి తొండంగి కోసుకురా పడ్డకి. ఈ లోగా బెండకాయ పచ్చడి కూడా చేసివుంచుతా. అప్పుడే తెల్లారింది.-లేచావూ....?' ప్రారంభించింది అమ్మ కర్కశకఠోరమైన ధ్వనితో....

ఆకలి వేస్తున్నది సుబ్బారావుకు.

రోజూ ప్రొద్దుటే చలిదన్నం తినే అలవాటు.

తల్లి జవాబుతో ఉసూరుమంటు లేచిపోయాడు.

అంతలో తాయారు మాట గుర్తుకు రాగా 'అమ్మా తినడానికి ఏమైనా చేయవూ?' అనడిగాడు చిన్నపిల్లవాడిలా.

'ఏం చేయాలి? నెత్తినొక రాయి పెట్టాలి. నీ దెవసం చేస్తాగాని, ముందు తొందంగి కోసుకురా. లేవ్వేరా ఇంకా....'

గబుక్కున లేచి తన గదిలోకి పెళ్ళాడు సుబ్బారావు.

ఇప్పటికి అతని ఆలోచనలు ఒక కొలిక్కి వచ్చాయి.

తన సొంత డబ్బులను జేబులో వేసుకొన్నాడు.

కొడవలి, మోపు, తడపలు, ములుగట్టి తీసికొని పైతుండువేసుకొని బయటకు కదిలాడు. దృష్టి బొమ్మలా కదిలాడు.

గుమ్మానికి ఆవలిగా నిలచి, తననే చూస్తున్న చెల్లెలు తాయారును చూచాడు. తల విదిలించుకున్నాడు.

వీధిలోపడి దీర్ఘంగా నిశ్వసించాడు సుబ్బారావు.

అది....తాయారు చూపు....

సరాసరి వెళ్ళి తూముకు ఎదురుగా వున్న కోటయ్య హోటల్లోకి దూరాడు.

ప్లేటు ఇడ్లీలు తిన్నాడు. ప్లేటంటే-రెండు....

పెసరట్టు వేయించుకొన్నాడు.

కాఫీ- స్ట్రాంగ్ కాఫీ - తాగాడు. వేడి వేడి కాఫీ....

'కోటయ్యన్నా! డజను ఇడ్లీలు. ఓ అరడజను పెసరట్లు ఇంటికి పంపు. మా తాయారు చేతికి ఇవ్వమను, అంటు మొత్తం బిల్లు చెల్లించాడు.

ఆ కోటయ్యన్న తెల్లబోయాడు. పళ్ళికిలించాడు.

'ఏవిరోయ్ సుబ్బారాయుడు! పొద్దు పొడిచిందే!' అన్నాడు. ప్రక్కగా కాఫీని ఆరపోసుకొంటున్న మీసాల మామ వరస ఆసామి.

తనలో తను గొణుక్కున్నాడు సుబ్బారావు. లోలోపలే గొణుక్కున్నాడు. పైకి ఏమీ అనలేకపోయాడు.

తొందంగి మోపు తీసుకువచ్చి దొడ్లోపడవేసి లోనికి వచ్చేటప్పటికి రత్తమ్మ రుసరుసలు, చెల్లెళ్ళ గుసగుసలు వినిపించాయి.

ఎవరితోనూ ఏమీ మాట్లాడకుండానే నాలుగు కడవల నీళ్ళతో స్నానంచేసి, పంచ కట్టుకుని, చొక్కా వేసుకుని, తుండు దులుపుకొని బుజాన వేసుకుంటూ వీధి లోకి వచ్చాడు సుబ్బారావు.

నారాయణదాసుగారి చావిట్లో 'యాట'ను వేశారని తెలిసి, అక్కడకు వెళ్ళాడు. 'ఉరే రంగడూ! మా యింట్లో రెండు పోగు లిచ్చిరారా!' అని మాంసం పంచేవానికి పురమాయించి, సదరు ఆసామీ నారాయణ బాబాయి చేతిలో చిల్లర పోశాడు.

ఆయన తెల్లబోయాడు.

వెంటనే కదలి, కొంచెం ఆవలగా, అరుగుమీద కబుర్లు చెప్పుకుంటున్న నలు గురు పెద్దల మధ్యకు వెళ్ళి కూర్చున్నాడు.

పెద్దల పెదాలు కదిలాయి. అవంతే!

అక్కడ కొంచెంసేపు పిచ్చాపాటి మాట్లాడి ఇంటికి బయలుదేరాడు.

ఇంటికి వచ్చేటప్పటికి, రత్తమ్మ రంగణ్ణి తిట్టిపోస్తున్నది. మాంసాన్ని తిరిగి తీసుకపొమ్మంటున్నది.

'అక్కడ పెట్టి పోరా' అని రంగణ్ణి కసురుకొని, మెదలకుండా లోనికి వెళ్ళి పోయాడు. మళ్ళా మాట్లాడకుండా వెళ్ళిపోయాడు.

ఆ మధ్యాహ్నం గాజులశెట్టి కేక వినిపించింది. తన చెల్లెళ్ళ ఊస చేతులు బోసిగా గుర్తుకువచ్చాయి.

వెంటనే చిన్న చెల్లెలిని పిలిచి గాజుల శెట్టిని కేకవేయించాడు.

గాజులశెట్టి మలారం దించుకున్నాడు. సుబ్బారావుకూడా అతని ప్రక్కనే కూర్చున్నాడు. చెల్లెళ్ళ నియమురిని ప్రక్క ప్రక్కనే హారోబెట్టుకున్నాడు.

ఖరీదుగల లేటెస్ట్ ఫ్యాషన్లు అనుకొంటున్న గాజులను నాణ్యంచేసి చెల్లెళ్ళ చేతులనిండా తొడిగించాడు.

అమ్మ చూస్తూవుండగానే ఆమె డబ్బీలోనించి డబ్బులు తెచ్చి చెల్లించాడు:

ఎంత తెగింపు: ఎంత....

రత్తమ్మ రక్కసిరూపం దాల్చింది. రూక్షణంగా చూసింది. నోరారా తిట్టి పోసింది.

తిట్టుకోనిచ్చాడు సుబ్బారావు.

మెదలకుండా ఆవలకు వెళ్ళిన సుబ్బారావు బీడీ ముట్టించుకోవడానికి బదులు సిగరెట్టును వెలిగించుకున్నాడు:

* * * *

మరునాడు సుబ్బారావు వీధిన పోతూవుంటే పేపర్లు ఇచ్చి పోతుండే కుర్ర వాడు ఎదురయాడు.

'రాజు! మా ఇంట్లోకూడా రోజూ పేపరు పడేసి పో. చూడు-కథల పత్రికలు కూడా ఏవైనా వుంటే ఇంట్లో పడేసిపోతూవుండు. మీ అయ్యగారితో మాట్లాడి చందా కడతాలే' అన్నాడు సుబ్బారావు

ఆ రోజునే సుబ్బారావు చేతి సంచి కొన్నాడు.

పట్టణం నుంచి వచ్చేటప్పుడు రోజూ దాని నిండా సరకులు పట్టుకురావడం ప్రారంభించాడు.

ఒక రోజున పళ్ళు, ఒకనాడు ఏవో చిరుతిళ్లు, మరొకనాడు టానిక్కులు, ఇంకొకనాడు పౌడర్లు, నూనె సీసాలు, రిబ్బన్లు, అద్దాలు.

వేరొకనాడు చెప్పులు-ఇలా వరుసగా ఒకొక్కటి ఇంట్లోకి దిగుమతి కావడం ప్రారంభమయింది.

చెల్లెళ్ళకు మంచి లంగాలు, ఓణీలు, జాకెట్లు, చీరలు, తమ్ముళ్ళకు రడీమేడ్ నిక్కర్లు, చొక్కాలు, తల్లికి ముతక చీరలు, తండ్రికి ఖద్దరు లాల్చీకూడా తెచ్చాడు.

లాల్చీ ముఖాన్ని ఎన్నడో తన పెళ్ళినాడు చూచిన సూరయ్య, కొడుకు ప్రయోజకు డవుతున్నాడని సంతోషించాడు.

ఆయన ఆల్ మకాం పొలంనుంచి ఇంటికి మార్చాడు.

తన తీరిక వేళలలో లోగడవలె ఇంట్లో కూర్చొనక, వెళ్ళి ఏ చెరువుగట్టునో, ఏ జమ్మిచెట్టుకిందో, ఏ అరుగుమీదో – నలుగురు ఎక్కడ వుంటే అక్కడకు వెళ్ళి కూర్చుంటున్నాడు సుబ్బారావు.

తన మాటలో, నడకలో, దుస్తులలోకూడా త్వరత్వరగా మార్పులను ప్రవేశ పెట్టాడు.

తనతోపాటు తన చెల్లెళ్ళుకూడా మారిపోతూవుండడం అతను గమనించకపోలేదు.

ఈ మార్పును, పరిణామాన్ని తలచుకొంటు, ఊహించుకొంటూ అతనే సబుడవుతుండేవాడు.

ఇది

ఇతరు లేమనుకుంటున్నారో....అనుకునేవాడు.

* * * *

నెల గడిచింది.

ఎప్పటిలా జీతం తీసుకవచ్చి తల్లి చేతికి ఇవ్వలేదు సుబ్బారావు. అసలు ఉంటేగా!

తల్లి తొందరించింది. ఎలా చెప్పవలేనా అని మొదట జంకినా నిలబెట్టి స్పష్టంగానే చెప్పాడు, కసిగా ఉద్రేకంగా; తెగబడి:

'జీతం అయిపోయింది. వచ్చే నెల జీతంకూడా నీ చేతికి రాదు. అసలు నా జీతాన్ని నీ చేతి కెందుకివ్వాలి? నేను సైకిల్ కొనుక్కోవాలి. గడియారం కొనాలి. నా ఖర్చులు పోను ఏ వైనా మిగిలితే చెల్లెళ్ళకు నగా నట్రా ఏమైనా చేయిస్తాన్లే. అంతే కాదు. ఇక నుంచి పేడను పిడకలు చేయడానికి వీల్లేదు. అది సరాసరి పెంటపోగు లోకిపోవలసిందే. పాలు, పెరుగు, మజ్జిగ, వెన్నా-ఏదీ అమ్మడానికి వీల్లేదివాళనుంచీ —ఇంట్లో ఖర్చుకావలసిందే. ఇంతకాలమూ మా మూలుగులను పీల్చావ్....'

'ఇంతమంది పిల్లలకు పెళ్ళిళ్ళు చేయాల్రా....' అంటూ ఏడుస్తూనే తిట్టిపోసింది రత్తమ్మ, మరేమీ చేయలేని బేలగా.

ఆమె కిప్పుడు ఈ లోకమే పాతాళానికి పర్లీకొట్టినట్టు అనిపించినది.

హఠాత్తుగా సంభవించిన ఈ తిరుగుబాటుకు తట్టుకోలేక విలవిల్లాడిపోయింది. నెత్తే నెత్తె బాదుకున్నది. మొత్తు కున్నది. కంటికి కడివెడుగా రోదించింది.

చివరకు, "నీ కెవతో మందు పెట్టిందిరో కొడకా....!" అంటూ ఆ ఎవ త్తెనో తిట్టబోయింది. కొడుకు గంభీరమైన కంఠం విని సాణువుగా అయిపోయింది.

"ఆపిక అంతటితో. చెల్లెళ్ళ పెళ్ళిళ్ళు అవీ నేనే చూసుకుంటా. ప్రతి దాంట్లోనూ నేనున్నానంటూ తయక్‌మంటు తయారవక, నోరు మూసుకొని ఒక మూల పడుండు. ఛాదస్తానికి పోయావో-చూడు!'

అంటూనే పైతుండును గట్టిగా దులిపి పైనవేసుకొని బయటకు వెళ్ళిపోయాడు సుబ్బారావు.

సుడిగాలిలా వెళ్ళిపోయాడు. తీవ్రంగా, దర్పంగా వెళ్ళిపోయాడు. కోపంగా, కసిగా వెళ్ళిపోయాడు.

* * * *


కొడుకు అటు పోగానే రత్తమ్మ ఇటు తన వేలువిడచిన తమ్ముడు భూషయ్య మీదకి పడుతూ లేస్తూ పోయింది.

జరిగిన దంతా చెప్పుకొని తమ్ముని ముందు చీదిపోసింది.

అంతా విని భూషయ్య నవ్వాడు.చుట్ట పొగ వదులుతూ అన్నాడు:

'పొద్దు పొడిచింది లే. వే యిక; చూడు రత్తక్కా-మా పెద్దది లేదూ-ననజ సుబ్బడికిచ్చి ముడేద్దాంగానీ, నువ్వు 'ఊ' అను, లగ్నం పెట్టిస్తా;'

★



విడిపోయిన మంచు తెరలు

వర్షం జోరున కురుస్తున్నది.

తడిసి ముప్పందుమయాడు వెంకాయమ్మగారి కూనయ్య.

కూనయ్య వర్షాన్ని లెక్కచేయడంలేదు. కుండ పోతగా వాన కురుస్తున్నదనే ధ్యాసే అసలు అతనికి వున్నట్టు లేదు.

అంత వానలోనూ అతని వళ్ళు చెమటతో తడుస్తున్నది.

ఉతికింది. మెతికింది.

తన నెత్తిన పిడుగు పడినట్టు, తన కనులు మెతికినట్టు ఉలికిపడినాడు కూనయ్య. ఉలికిపాటు....

తనకు అతి చేరువనే ఎవరో నిశ్చారుగా నిలచి వున్నట్టు తెల్లగా అస్పష్టంగా తోచి హఠాత్తుగా విలిచిపోయాడు. వళ్ళు ఒక్కసారిగా జలదరించింది.

తన ఎదుట – ఎట్టి ఎదుట – తనకోసమే ఎవరో నిలిచినట్టు తోచి నీలువెల్ల వణికిపోయాడు.

తన ఎదుట నుంచున్న ఆ వ్యక్తి తనను చూడగానే గబుక్కున కూర్చున్నట్టు, కూర్చుని, తనతో కలియబడి గుండెలలో పొడిచివేయడానికి బొడ్లోంచి చురికను తీస్తున్నట్టు అనిపించి కంపించిపోయాడు.

వెంటనే తన బొడ్లోని కత్తినికూడా బయటకు తీశాడు. ఇక లాభంలేదనుకొన్నాడు. అయిపోయిందనుకున్నాడు.

ఉరుము ఉరిమింది. మెఱుపు మెఱిసింది.

తళతళలాడింది కత్తి. సానపట్టిన కత్తి.

జంకుతూనే అడుగులో అడుగు వేసుకుంటూ ముందుకు వెళ్ళాడు.

ఎదుటి వ్యక్తి పాషాణమ్మలా కదలక, మెదలక అలాగే నిలిచి వుండడం చూసి అనుమానించాడు కూనయ్య. వంగి, కోపుగా చూశాడు.

తన కన్ను చెదరింది. అది మైలరాయి!

అప్పుడు గుర్తుకు వచ్చిందతనికి – ఈ మట్టిరోడ్డుమీద ఇక్కడొక మైలురాయి వుండాలని.

ఇక్కడే రోడ్డు దిగాలి. బోదెడూకి పాపయ్యగారి చేను పెద్దగట్టున నడవాలి.

అతని మనసు వలెనే చీకటి గుయ్యారం గీపెడుతున్నది.

ప్రకృతి బీభత్సంగా అతనిలోని అరాచకానికి చిహ్నంగా వున్నది.

అతనికి నాలు గడుగుల దూరంలో కప్ప మొత్తుకోవడం ప్రారంభించినది.

కప్పను పాము పట్టింది.

కాదు, కప్ప తన ప్రాణాన్నే కాపాడిన దనుకొన్నాడు. పామును ఆ కప్ప దొరక్కపోతే, అది తన పాదాన్ని లేక శీలమండను కాటందేది!

తన బోటన వ్రేలికి జానెడు బెత్తెడులోనే కప్పతో జరజరా పాకిపోయింది పాము. అతని శరీరం మరొకసారి జలదరించింది.

ముఖంమీది చెమట బిందువులను, వాన వినుకులను తుడుచుకున్నాడు. ఒక సారి కలియజూశాడు.

తన నెవరు పేన్నంటడం లేదుకదా....!

మనిషి మనసు భ్రాంతికి తేలిగ్గా లొంగిపోతుంది.

అర్ధరాత్రి అపరాత్రి అనక అతను చేలగట్ల వెంట తిరక్కపోలేదు. అయినా మున్నెన్నడు లేని భయం ఇప్పుడు ముంచుక వస్తున్నది.

దయ్యాలకు, భూతాలకు, పురుగు పుట్రలకు అతను జంకడు. కాని, ఇప్పుడు వాటినే తలచుకొని వణికిపోతున్నాడు.

అతని కన్ను చెదరడానికి కారణం అదే. భ్రాంతి. భయం.
అదో-అక్కడెవరో నిలిచి తన రాకను గమనిస్తున్నాడు. ఎవరది....?
గబుక్కున మోకాలిమీద కూర్చున్నాడు.
గుండె దిటవుపరచుకొని, తీక్షణంగా, మెల్లగా దొంగచూపు చూశాడు.
హ్హా....! శాంతమ్మ త్తగారి బీద చేలోని దృష్టి బొమ్మ!
కప్పలు మాండ్యూక్యోపనిషత్తును పఠిస్తున్నాయి. ఎలకోళ్ళు కూస్తున్నాయి.
పురిపిట్టలు పనలమీదుగా పరుగెడుతున్నాయి.
పరదపిట్టల దండు దగ్గరగా వచ్చి వంకర తిరిగి దూరంగా తప్పుకుపోయింది.
దూరంగా ఎక్కడో తీతువు తిడుతున్నది. తనను కాదుకదా ....!



అలికిడి అయినట్టుగాతోచి కించిత్ గాభరాగా వెనక్కు తిరిగాడు.
గుచ్చి నిలబెట్టి వున్న ఎండు తాటాకుమీద డేగ వాలింది.
దీర్ఘంగా నిశ్వసించిన కూనయ్య, ఇహ అసలు వెనక్కు తిరిగి చూడనే కూడదనుకున్నాడు. ముందుకు చకచకా, కోపంతో, కసిగా నడిచాడు.

* * * *

గ్రామీణ సంస్కృతికి, నాగరికతకు, మన స్తత్వానికి నేటి పారిశ్రామిక వ్యవస్థ పూత కొత్తల కలయిక అయినది.
ఈ కలయికవల్ల గ్రామ్య వ్యవస్థకు మేలుకంటే కీడే అధికంగా కలిగినదని పిస్తుంది- కూనయ్య వంటి కొందరిని చూచిన పిదప.
యుగసంధిలో సంభవించిన ఆర్థిక అసమానత, సంక్లిష్ట స్థితులతో త్వరితంగా బాగుపడవలెననే అతురత మనిషి మనఃచితనాన్ని, అతని మానవతను కుంచించి వైచినది.
మమత పవిత్రత మాసిపోగా, అది పైసగా, రూకగా మారిపోతున్నది
రాగరంజిత హృదయం రానురాను మటుమాయమయి పోతున్నది.
డబ్బు, డబ్బు! అస్తి, అస్తి!
సంపాదన, సంపాదన! నడమంత్రపు సిరి! స్యూరిచ్....

కుత్రిమ నాగరీకం మసిపూసిన మారేడు అయి, పల్లెపట్టులకు ప్రాకినది.

ఫలితంగా సహృదయత స్థానంలో స్వార్థం తిష్టవేసినది.

మమతకు బదులు మర్మం రాజ్యమేలినది. సౌహార్ద్రితకు మారు కాపట్యం చోటు చేసుకున్నది.

కూనయ్యకు పిత్రార్జితం ఇరవై ఎకరాల వరకు వున్నది.

ఎడ్లు, బండ్లు, గొడ్లు గోద, నౌకర్లు, చాకర్లు అన్నీ వున్నాయి, అందరు వున్నారు.

లేనిదల్లా తృప్తి మాత్రమే. కుటుంబానికి పెద్ద కూనయ్య.

భార్య, ఇద్దరు పిల్లలు, తమ్ముడు శేషయ్య అతని కుటుంబం.

శేషయ్య గ్రామంలోనే వున్న హైస్కూలులో స్కూల్ ఫైనల్ వరకు చదివి, అంతటితో చదువును మరి చాలించి, అన్నకు చేదోడు వాదోడుగా వుంటున్నాడు.

అన్న అతనికి దేవుడు.

శేషయ్యకు ఇంకా పెండ్లి కాలేదు కాని, ఓ కుర్రదానితో స్నేహం ఉన్నట్లు, రహస్యంగా వారు కాపురం కొనసాగిస్తున్నట్లు కూడా ఊరు వూరంతా చెప్పుకుంటూ వుంటుంది.

కూనయ్యకు పరిమిత కుటుంబం అవసరం అనిపించినది.

భార్య సుందరమ్మ, ఆమె తరపు ఆప్తబంధువర్గం కుటుంబ నియంత్రణ కోసం కూనయ్యకు వత్తిడి కలిగించారు.

ముఖ్యంగా భార్య సుందరమ్మ ఈ విషయంలో పట్టుదల వహించినది. కరాఖండిగా నిలచి నిలదీసింది. నెత్తిన నిళ్ళకుండ పెట్టుకుని మరీ శతపోరుతున్నది.

తన పైటకొంగున ఆమె భర్తను ముడివేసుకోగలిగింది. ఈ విషయంలో ఆమె జాణ. నెరజాణ.

భర్తను వేసక్టమీ చేయించుకోమని పదే పదే చెప్పడమేకాక, సత్యాగ్రహాలు, నిరసన దీక్షలు, అలగడాలు, కన్నీటితో తలగడాలు తడపడం నిత్యా చేస్తూనేవున్నది.

వాళ్ల పిల్ల ఏదో అంటున్నారని కాదు, భార్యాప్రోద్బలం అధికతరమయిన దనే కాదు, కూనయ్య సొంత బుట్టిలోకూడా ఈ ఆలోచన కదలి అతణ్ణి విచలితుని చేస్తున్నది.

ఆలోచనలో మార్పు.

ఇప్పటికే తనకు ఇరువురు పిల్లలు. ఉన్న ఆస్తి కొద్దిపాటి-ఇరవై ఎకరాలు మాత్రమే! అంతా కలిపితేనే బోడి ఇరవై ఎకరాలు ....

తమ్ముడు శేషయ్య పెళ్ళి చేసుకొని పెటాకులయ్యాడంటే పడెకరాలు చీలడం ఖాయం.

ఇహ, తనకు మిగిలేది ముష్టి పడెకరాలు!

తన కుటుంబానికి పడెకరాలేనా....? సొంతానికి....

ఈ పడెకరాలలో - దేవుడు మేలుచేసి - అమ్మకుండా వుంటే తన ఇద్దరు పిల్లలకు వాటాలు విభజించవచ్చేటప్పటికి చెరి అయిదెకరాలే మిగులుతాయి. కేవలం అయిదేసెకరాలు.

తన కొడుకులు తమ కొడుకులకు పంచవలసి వచ్చేటప్పటికి - పాపం శమించుగాక - చిప్పా కట్టా చేతి కొచ్చి....

అంతేకాదు. తనకు మరి పిల్లలు పుట్టరని ఎక్కడున్నది?

తన ముత్తాతలు నేతులు తాగారు. తాతలు పసిడి పళ్ళాలలో విందు భోజనా లారగించారు. తండ్రులు వెండి విస్తళ్ళలో భోంచేశారు.

తను తినవచ్చేటప్పటికి కంచు కంచాలే మిగిలాయి.

తన కొడుకులకు అవీ దక్కటట్టు లేదు....!

నేడు ఇరవై ఎకరాల ఆసామి అయిన కూనయ్య 'అమ్మా బువ్వ అయ్యా బువ్వ' అంటు ఎకరంనర చెక్కలను పంచుకుపోయే మనుమలను, ముదిమనుమలను ఊహించుకొన్నాడు.

ఈ ఊహతో కంపించిపోయాడు. తన మనుమలు....

వీల్లేదు. అలా జరగడానికి వీల్లేదు. ఆస్తి తరిగిపోవడానికి వీల్లేదు.

ఆస్తి పెరగాలి. పదింతలుగా పెరగాలి. కాని, కాని....

ఆస్తి తరిగిపోకుండా చేయడం ఎలా? పడెకరాలు తమ్ముడు పంచుకుపోవడం అనేది ఖాయం.

కొగా పోగా, తనకు మిగిలేది పడెకరాలే అనేది నిజం. పచ్చి నిజం.

కనుక, తను సంపాదించాలి. కనీసం ఇరవై ఎకరాల కైతుగానే అయినా మిగిలివుండాలి.

పోయే పడెకరాలను పూడ్చుకోవాలి. ఎలా?

ఆస్తిపాస్తులను పెంచాలి. ఎలా?

అది అతని జీవన సమస్య. భవిష్య జ్జీవన సమస్య.

దానిని ఇప్పుడే పరిష్కరించివేయాలి. తనే పరిష్కరించాలి. ఎలా?

ఏదయినా వ్యాపారం చేస్తే?

బస్సీకిపోయి, ఎవరి కాళ్ళో కడిగి, ఏ కంట్రాక్టో సంపాదించగలిగితే? లేక, అవిభక్తంగా వున్నపుడే ఏ చెఱువుకింది నాలు గెకరాలో తెగనమ్మి ఏ లారీయో కొని కథ నడిపిస్తే.

కాక, ఏ హోటల్‌లోనో, లాడ్జింగుతోనో భాగం కలిస్తే?

అదీ కాకుంటే....

ఈ విధమైన ఆలోచనలు కూనయ్య బుఱ్ఱకు తట్టకపోలేదు.

అయితే, అవన్నీ అర్థరహితాలుగా, గొంతెమ్మ కోర్కెలుగానే కనిపించాయి.

వ్యాపారాలు వెలగబెట్టే శక్తి సామర్థ్యాలు తనకు లేవనే విషయం కూనయ్యకు బాగా తెలుసు.

ఊరి పొలిమేర దాటితే, తన నెత్తిమీద నిలువెత్తు బంగారాన్ని వుంచినా తను పైసా విలువ చేయడనికూడా అతనికి బాగా తెలుసు. అతని విలువ అతనికి తెలుసు:

* * * *

భర్త ప్రయోజకత్వాన్ని సవాల్ చేస్తూ ఒక అర్థరాత్రి ఒక ఆలోచనను ఆయనగారి చెవిలో ఊదగలిగింది భార్య సుందరమ్మ.

భార్య సలహాకు కూనయ్య దిగ్భ్రాంతు డయ్యాడు. రిచ్చపోయాడు.

రిత్తపోయిన మనిషి-నీడలోకి జరిగిపోయాడు.

కొన్ని రాత్రుళ్ళు, మరికొన్ని అర్థరాత్రుళ్ళు గడవగా గడవగా భార్య సుందరమ్మ సలహా సముచితమయినదేనని అతని మనస్సు లోలోతులలో అనిపిస్తూ వచ్చింది.

అసమర్థుని మనసున అసూయ ప్రేళ్ళూనిననాడు ఏదీ అసహజం అనిపించదు.

ప్రేమ, మమత, అనురాగం, ఆప్యాయత - వీటినన్నింటిని పైసలతోనే భాగిస్తారు, పెచ్చవేస్తారు, తీసివేస్తారు, కూడతారు:

తనకు ఆస్తి కలిసేవరకు, తను స్థితిపరుడుగా నిలిచివుండిపోగలిగేంతవరకు వాటి గొంతులను అలా నొక్కిపట్టి వుంచడానికే అతను సమాయత్తుడయ్యాడు.

పైగా, సలహా ఇచ్చినందుకు, సులభ మార్గాన్ని కనుగొన్నందుకు అర్థాంగి సుందరమ్మను అభినందించాడు కూనయ్య.

అయితే, ఇలాంటి చవట మెచ్చుకోళ్ళకు, ముఖస్తుతులకు ఉబ్బి తబ్బిబ్బయే ఘటం కాదు అర్థాంగి సుందరమ్మ.

ఆమె సాక్షాత్తు వీరమ్మ కూతురు సుందరమ్మ. వీరమ్మ అంటే మగనితో కాళ్లు పట్టించుకుని వాడకట్టులో పగలే ఓవిటీలను వెలిగించిన ఆడది మరి!

అంతేకాదు. నిద్రపోతున్న మగని ముఖంమీద మరుగుతున్న ఆముదం కుండను బోర్లించిన వీరమ్మ ముద్దుల పట్టి సుందరమ్మ.

కోపం అంటే కోపమే.

సుందరమ్మ భర్తను రాచి రంపాన పెట్టింది. చివరకు శాసించగలిగింది.

ఇంతా చేసి, ఇందులో తన ప్రమేయంకాని, తన పాత్రకాని అసలు ఏమీ లేదన్నట్టుగానే వుండగలిగింది.

అదే ఆమె ప్రత్యేకత, గడసరితనం, ఆడదనం. ఆమె వీరమ్మ కూతురు!

ఆ వాన రాత్రి, అటకమీద దాచివుంచిన తాతలనాటి స్రూ-బరిశను తీశాడు కూనయ్య. దాని కర్రను ఊడగొట్టి, ఆ కర్రను చావిడిలోని ఉలవల అవలో కుక్కాడు.

బరిశను బాగా నూరి బొడ్లో పెట్టుకున్నాడు.

బయలుదేరాడు. వీరుడుగా బయలుదేరాడు. వీరబలి! వీరబలి!

* * * *

"కాదు అలివేలూ! నీకు ఒక్కనాటికీ అన్యాయం చేయను. అన్నయ్యతో రేపే చెబుతాను. మన పెళ్ళివిషయంలో అన్నయ్య తప్పకుండా అంగీకరిస్తాడు.

నీకింకా మా అన్నయ్య గుణం తెలియదు. ఆయన హృదయం నవనీతం. నేను ఏది చెప్పినా, ఏది అడిగినా ఇంతవరకు కాదనలేదు. ఇకపై అనడు. ఆయన తత్వం నాకు బాగాతెలుసు. అన్నయ్యకు నేనంటే ఉన్న ప్రేమ అలాంటిది. నా అభివృద్ధికి అన్నయ్య ఎంతగా తహతహలాడుతున్నాడనీ!

అమ్మా నాన్న ఆయనే అయి పెంచి పెద్దచేశాడు నన్ను. నా చర్మంతో చెప్పులు కుట్టించినా అన్నయ్య ఋణాన్ని తీర్చుకోలేను. నామీద ఈగ వాలనివ్వడు. మన పెండ్లి విషయంలోకూడా నే నడిగితే అన్నయ్య కాదనడు. కనుపించడు కాని, అన్నయ్య చాల సంస్కారం కలవాడు, ఆయనే స్వయంగా మనపై అక్షతలు చల్లి ఆశీర్వదించిన క్షణానకాని అది నీకు అర్థం కాదు.

ఇక మనం పేరే వుండిపోవలసివస్తుందేమో అంటావా- పేరుపడడం అనే సమస్య అటు ఏడు, ఇటు ఏడు తరాలుగా మా వంశంలోనే లేదు. నాకూ అన్నయ్యకూ మధ్య అంతరాలు, వేర్పాటూ లేవు, వుండవు!

హ్హా.... నా జీవితమే అన్నయ్యకోసం అలివేలూ....!"

చేను పెద్దగట్టుమీదగల పాక ప్రక్కకు వచ్చేటప్పటికి కూనయ్యకు వినిపించిన మాటలు ఇవి.

ఆ స్తిని దక్కించుకోవడానికి, పొలం కావలిలో వున్న తమ్ముని హతమార్చడానికి వచ్చిన అన్నకు వినిపించిన మాటలు ఇవి. కనుపించిన దృశ్యం ఇది:

కూనయ్య కుంగిపోయాడు. అతని రక్తం గడ్డకట్టుకపోయింది.

గుండె ఆగిపోయినట్టయింది. గాలి స్తంబించింది. మెఱుపు మెఱిసింది. ఉఱుము ఉఱిమింది. చేతిలోని బరిశె తళుక్కుమంది.

చురుక్కుమంది కూనయ్య గుండె.

చివుక్కుమంది అతని మనసు. అతనిలోని కొనఊపిరి కొట్టుమిట్టాడింది.

ఏ మారుమూలనో అణగిమణిగి దాగి పడివున్న మానవత మేల్కొన్నది. మమత చావలేదు.


'వాడు నా తమ్ముడు....వాడినా....'


గుండె గుబగుబలాడింది. తిరిగి వళ్లు జలదరించగా, నిలువెల్ల వణికిపోయాడు కూనయ్య.గబుక్కున వెనక్కు తిరుగుతూ, బరిశను బోదె బురదలోకి విసిరి వేశాడు.

మంచు తెరలుగా పడుతున్న వాన తుంపరలను చీల్చుకుంటూ వెనక్కు పరుగెత్తాడు కూనయ్య.

ఈల వేసింది పైరగాలి.

అంతలోనే తిరిగి వర్షం జోరుగా....





సంత

దిక్కు-మాలిన ఈ ప్రపంచంలో ఒక చెయ్యి.

దిక్కు-లేని ఆ చెయ్యి గట్టున గుబురు గుబురు చెట్లు.

చెట్ల నీడలలో గుడిసెలు. గుడిసెలలో మనుషులు.

మనుషులలో ఒకడు కేతిగాడు. కేతిగాడుకూడా మనిషే.

కేతిగాడు తాగాడు. తాగి తూలాడు. తూలుతూ పెళ్ళాన్ని తిట్టాడు. పట్టుకు కొట్టాడు. మళ్ళా కొట్టబోయాడు. అంతలోనే-

పందిపిల్లను పట్టుకోబోయాడు. అది అందకుంటే తనను తనే పట్టుకో బోయాడు. పడిపోబోయి, లేచేడు.

ఒకటి రెండు మూడు నాలుగు అయిదు-గురి పిల్లలను కసురుకున్నాడు.

అంతలోనే వారిని ముద్దిడుకున్నాడు. మురిసిపోయాడు.

మళ్ళీ పురుగు తొలిచింది. అందినవాళ్ళను అందినట్టు ఇద్దరు ముగ్గురిని పట్టుకొని చితక్కొట్టాడు.

సాలీ వచ్చింది. తుపుక్కున ఉమిశాడు. ఆ ఉమ్మి పైనే చతికిలపడినాడు.

చుట్ట పొగాకు కొన కసంత కసిక్కున కొరికాడు.

కేతిగాడి పెళ్ళాం కుర్రది. ఈ కుర్రది మరొక కూనను రెండు-మూడు మాసాలలో కనబోతున్నది.

ఈవిడ అతగాడికి మారు మనువు. పేరు నాగి.

దాదాపు నాగి ఈడుదే కూతురు ఉన్నది కేతిగాడికి. దాని పేరు సత్తి.

అది 'సత్తెమ్మ తల్లి' అంటాడు వాడు.

కేతిగాడికి నాగిపట్లగల ప్రేమ పట్టపగ్గాలు లేనిది.

ఆ ప్రేమకొద్ది అతగాడు పనిపాటులు, పిల్లలను సాకడం అంతా కూతురు సత్తినే పెట్టాడు.

'సత్తెమ్మతల్లి' ఇంకెడు చాకిరీ చేయగలదని వాడి నమ్మిక.

తను మాత్రం నవ్వుతు, కేరుతూ, నాగిని నవ్విస్తూ వుంటాడు. తన్నుతూ వుంటాడు. తన్ని, తరువాత దాని కాళ్ళ పట్టుకుంటూ వుంటాడు.

కేతిగాడి గుడిసె ప్రక్కన పందుల గుడిసె వున్నది. దానిని ఆనుకునే ఊతంగాడి గుడిసె ఉన్నది. ఊతంగాడు యువకుడు.

ఊతంగాడంటే సత్తికి పడదు.

తన మారుటి తల్లికి కడుపు చేసింది వాడే అని ఈ కుర్రదాని గుబ్బి.

పెద్ద గుబ్బి. గట్టి గుబ్బి.

ఊతంగాడు అంతటితో ఊరుకోలేదు. తనకూ కొన్నిసార్లు కన్ను గీలక్కపోలేదు. అయితే, తను అగ్గి. సత్తి అంటే ..

'ఏసుకుంటావా?' అన్నాడు కూర్చున్న కేతిగాడు, ఎదురుగా కుడేసిన గుమ్మడి పండులా కూర్చున్న భార్యతో.

ఏసుకునేది 'మందు'

భార్య నాగి నవ్వింది. గారపళ్ళను బయట పడవేసి మరీ నవ్వింది.

నవ్వి, కొంగ్రించి ప్రక్కకు ఉమిసింది.

ఆ ఉమ్మి వెళ్ళి పందిపిల్ల ముఖంమీద పడింది. అది చీదరించుకుంది. ఝుర్రరిస్తూ కేతిగాడి ప్రక్కగా పరుగెత్తింది.

దాని బెత్తెడు తోకను పట్టుకోబోయాడు కేతిగాడు. అది అందలేదు.

"అయ్యో.... నూకలు...." అడిగింది సత్తి.

అడుగుతూనే కూరకోసం ఆలోచిస్తూ దెబ్బుమీదకు చూసింది.

అక్కడికి ఇంకా గుడ్డి కొక్కెరలు చేడుకోనేలేదు. అది వాటికి వేళకాని వేళ. పక్షులకుకూడా సమయ సందర్భాలు వున్నాయి మరి।

కేతిగాడు ఒక్క ఊపుతో లేచాడు. నూక లడిగినందుకు తనమ్మ, తన్నడానికే తండ్రి లేచాడనుకున్నది పత్తి. పందుల గుడిసె పైపుకు గబుక్కున పరుగెత్తింది.

గబుక్కున పట్టుకున్నాడు సత్తి చేతిని ఊతంగాడు. అది చూచిన నాగి వచ్చే నవ్వును ఆపుకొనకపోలేదు.

కేతిగాడు ఇంత పొడవు వాసంగొట్టం తీసుకవచ్చాడు. మట్టిముంత కూడా తెచ్చాడు. ఒంచి, దాని నిండా పిచ్చసారా పోశాడు.

'యేసోక్కో....' అంటూ నాగిచేతికి అందిస్తూ తూలాడు. తూలుతూ దానిని తన నోటికే తాకించుకొన్నాడు.

గాలి జోరుగా వీచింది.

గాలి జోరుకు, చెట్టుకొమ్మమీద ఉన్న పిచ్చుకల జంటలో ఒకదానిమీద ఒకటి పడబోయి నవ్వుకున్నాయి.

నాగి నవ్వింది. కేతిగాడి తొడమీద ఛళ్ళున చరిచి మరీ నవ్వింది. పళ్ళికిలిస్తూ పెద్దగా నవ్వింది. ఆ పండ్లు ...

'సంత కెల్దాఁవా....।' అన్నది.

'ఓసోస్ది। మర్చానెహ్నా - యెల్దారి।' ఖాళీ బొంగును వెనక్కు విసురుతూ, నాగిమీదకు ఒరుగుతూ అన్నాడు కేతిగాడు।

నాగి పాదాల దగ్గర కూర్చున్న రెండేళ్ళ పిల్లడు సారావాసన భరించలేక కెవ్వుమన్నాడు. వాళ్ళిద్దరు నవ్వారు. వాడూ నవ్వాడు.

వాసం బొంగువెళ్ళి పందిపిల్ల నడుంమీద పడింది. అది గీఁ.... పెడుతూ ఊతంగాడి కాళ్ళ మధ్యగా పరుగెత్తింది.

ఊతంగాడు ఉలిక్కిపడి సత్తి జుత్తును పట్టుకోబోయేవాడల్లా ఆగాడు.

సత్తి పరుగెత్తింది నవ్వుతూ.

దాని నవ్వు వాడికి తెలుసు.

"బయల్దేరే సంతకి।" అన్నాడు సత్తివి చూస్తూ కేతిగాడు. అంటూనే పంది పిల్లను పట్టుకు చంకన పెట్టుకోవడానికి ప్రయత్నించాడు. అది మరలా అందలేదు. నవ్వుకున్నాడు.

'నే నెందుకొ? నే నీ డుంటాలే-పందులకాడ. అంతా పొండి' అన్నది సత్తి, పిన్నమ్మ ముఖంలోకి చూస్తూ, గుచ్చి గుచ్చి చూస్తూ.

పిన్నమ్మ అప్పటికే ఊతంగాడి కనులలోకి క్రైపుగా చూస్తున్నది. అయినా సత్తిమాట విన్నది.

'వొద్దులె-రారి!' అన్నది.

ముగ్గురు పిల్లలు, కేతిగాడు, సత్తి, నాగి సంతకు బయలుదేరారు.

'ఓరిగోరె ఊతంగ! రావేందిరా సంతకొ?' ఊతంగాడిని చూస్తూ వాడి గుడిసెకు ఎదురుగా వచ్చి అడిగాడు కేతిగాడు.

'....ద్దోదొ... వత్తన్న!' నాగి కనులలోకే చూస్తూ అన్నాడు ఊతంగాడు.

సంత జరిగే పెద్దగ్రామానికి చిన్న పాలెంలోంచి వెళ్ళాలి. పాలెం దాటి, చివరి ఇంటినికూడా దాటుతుండగా ఊతంగాడి కాళ్ళకు పొదుగుడు కోడి అడ్డు వచ్చింది.

'పెట్ట! పెట్ట!' అంది సత్తి ఉత్సాహంగా, ఊపుగ.

'పట్ట.... పట్ట....!'

ఊతంగాడు గిరగిర రెండు గిరికీలు కొట్టి ఎవరు చూడకుండ సుతారంగా ఆ కోడిని పట్టి చంకలో పెట్టుకొని, తుండు కప్పివేశాడు.

'దొంగ సచ్చినోడు!' మెచ్చుకున్నది నాగి, ఇకిలిస్తూ.

'ఓళ్! హుళ్ళ్....' ఊతంగాడు ఊళ వేశాడు.

* * * *

సంత సందడిగా వున్నది. ఎన్నడు లేనంత వత్తిడిగా వున్నది ఈ వారం. సంత ఇవ్వాళ సంతగా వున్నది. సరదాగా వున్నది.

చుట్టు ప్రక్కల పల్లెలనుంచి చాల సరకు దిగుమతయింది. సరకు అంతా రోడ్డుకు ఇరువైపుల రాసులు రాసులుగా వున్నది.

జనంకూడా విపరీతంగానే వున్నారు. ప్రొద్దు వాలుతున్న కొలది సంత వత్తిడి, రద్ది, గోల, బేరసారాలు ఎక్కువవుతున్నాయి.

దివాళాతీసిన ఒక కిళ్ళీ బడ్డీ వెనుక కేతిగాడి ముఠా కూర్చున్నది. ఈ వారపు సంత విశేషాల గురించి కొంతసేపు అంతా కలిసి ముచ్చటించుకొన్నారు.

కేతిగాడికి ఏమీ తోచడంలేదు. వాడికి ఎదురుగా-దూరంగా-సారా అంగడి కనుపిస్తున్నది. అదే దృష్టి. అదే లోకం.

'మందేసుకొందావా?' అడిగాడు ఊతంగాడు.

కేతిగాడు నాగిని చూశాడు. నాగి పళ్ళికిలించింది మళ్ళా.

'మరి దుడ్డో....!' సత్తి పైటతీసి, వేసుకుంటూ అన్నది నిదానంగా.

'దీన్నమ్మేద్దారి!' ఊతంగాడు చంకలోని కోడిని బయటకు తీశాడు. కోడిని చూడగానే అందరి కనులు మెరిశాయి.

'అది సీదిగా....' దానిని ఆశగా చూస్తూ, పైకిమాత్రం అలా అన్నాడు కేతిగాడు. దానిని అమ్మేకంటే, కోసుకుంటే....

'ఎహెత్! నాదీ కాదు నీదీ కాదు!' అరిచినట్టుగా అన్నాడు ఊతంగాడు. 'అందరిదీను!' అన్నాడు తిరిగి నాగి వంక చూస్తూ.

నాగి నవ్వింది. 'సరే!' అనబోయింది కాని, అనలేదు. దానికికూడా కొత్త ఆలోచన తట్టింది. అమ్మేకంటే, కాల్చి, 'కక్కలు' చేసుకొని 'మందు'లో నంజుకుంటే మా మజాగా వుంటుంది మరి!

ఆ మాటనే అది వాళ్ళతో చెప్పింది.

కేతిగాడు ఈసారి లొట్టలు వేసుకున్నాడు. అవునవు ననుకున్నాడు. అంతే, అంతే.... అయితే, వాడికి మరొక దిగులు పట్టుకుంది. మరి, 'మందు' ఎలా?

'కాదులే....!' అన్నాడు ఊతంగాడు. అని, ఏమాటా ఏమీ మరి చెప్పకనే కోడి రెక్కలను మెలిపెట్టి, దానిని చేతిమీద నిలబెట్టుకొని హుషారుగా జనంలో కలిసిపోయాడు.

'అమ్మోతాడు సచ్చినోడు!' అనుకున్నది నాగి, కసిక్కున ఊస్తూ.

కేతిగాడు అలా అనుకోలేదు. పైగా విసుక్కున్నాడు. వాడి దిగులు వాడిది.

ఎదురుగా సారా అంగడి వాడిని ఆహ్వానిస్తున్నది. తనెరిగిన కొందరు 'మందు' మిత్రులు అక్కడ చాలమంది గుమిగూడారు. తను ఎప్పుడు వెళ్ళి వారిలో కలుస్తానా అని వాడి ఆలోచన. ఎలా....?

హఠాత్తుగా, మెఱుపువలె వాడి బుర్ర తళుక్కున కదిలింది. రెండేళ్ళ కుర్రాడి మీదున ఫెళీఫెళీ రెండంటించాడు. పగిలిన చట్టిమూకుడును ఏరుకవచ్చి వాడి చేతికి అందించాడు.

'తోడి కెల్లవే....' అన్నాడు ఏడేళ్ళ పెద్దపిల్ల నుద్దేశించి.

'పొండి ఆడుక్కోరండి!' అంటూ కసరుకొన్నాడు అలవాటయిన భాషలో. 'బేగి రండి. నాల్రూపాలట్రండి!' అజ్ఞను జారీ చేశాడు గుడ్లురుముతూ కేతిగాడు.

సారా వాసన వాడి నాసికా పుటలనుంచి మెదడులోకి వచ్చి మత్తెక్కిస్తున్నది. తలను తాటిస్తున్నది. తల దిమ్మెక్కిపోతున్నది.

సంత జనం మధ్య ఆడుకోవడం ప్రారంభించారు పిల్లలు.

పిల్ల పేరు లొయ్య. దానికొక చిరిగిన నిక్కరు మాత్రమే వున్నది వంటి మీద. గొనుకూడా లేదు.

కుర్రడు రెండేళ్ళవాడే అయినా నాలుగేళ్ళ వాడుగా వుంటాడు. మంచి కండ పుష్టి కలవాడు. విశాలమైన పాలభాగం, పెడల్నాయిన నేత్రాలు, కోటేరు వంటి ముక్కు. ముఖానికి తగిన తల. తలకు తగిన జుత్తు. జుత్తుకు తగిన గిరజాలు, గిడసబారి పిడసబారిన ఒంకెలొంకెలు, ఉండలుండలు.

తీర్చిదిద్దినట్టు వున్న రూపురేఖలతో, తనలో ఏదో ప్రత్యేకత వున్నదని, దానిని గుర్తించమని ప్రపంచాన్ని సవాల్ చేస్తున్నట్టు వుంటాడు వాడు. వాడి పేరు గిసకతక్కుడు.

గిసకతక్కుడి చేతిలోని బొచ్చలో ఈసరికే మూడు-నాలుగు రూకల వరకు పైసలు పడినాయి.

*　　*　　*　　*

ఒక దంపతుల జంట సంతకు వచ్చారు. సొంత కారులో వచ్చారు. సంత చూడడానికి వచ్చారు. చిరునవ్వుతో వచ్చారు.

ఈ ఉభయులకు వివాహమయి ఇరువది వసంతాలు గడిచినా ఆమె కడుపు పండలేదు. ఒక్క సలుసు కలగలేదు.

తమ పెళ్ళి అయి రెండు దశాబ్దాలయినా వారి సుఖమయ సాంసారిక జీవితానికి చిహ్నంగా పిసరంత పిల్లా పీచూ ఎవరు లేక ఒకరి ముఖా లోకరు చూసుకొంటూ మొండిగా శిఖండులవలె బ్రతకడం వారికి దుర్భరంగా వున్నది.

నిరాశచెంది, విసుగు జనించి ఎవరినయినా దత్తు తీసుకోవలెనని వారు కృత నిశ్చయు లయారు.

అయితే, ఇక్కడొక పెద్ద చిక్కు వచ్చిపడింది. ఆయన తరపువాళ్ళు ఈమెకు నచ్చలేదు. ఈమె తరపు పిల్లలు ఆయనగారికి నచ్చలేదు. ఈ అవాంతరాన్నికూడా అధిగమించవలెనని వారుభయులు తిరిగి కృతనిశ్చయు లయారు.

జాతి, మత, కుల విభేదాలతో నిమిత్తం లేకుండా, ఏ తల్లి కన్న బిడ్డడయినా తమ అచ్చటా ముచ్చటా తీర్చే అనువయినవాడు దొరకితే చాలు, తమ వానిగా చేసికోవా లనుకున్నారు. అటువంటివానికొరకే చాల రోజులుగా వెదకుతున్నారు; ఈ రాకలో అదొక ఆంతర్యం.

దంపతుల దృష్టిని గిసకతక్కుడు ఆకర్షించాడు. వాడి రూపురేఖలు, వాడి చేష్టలు వారిని కవ్వించాయి. నవ్వించాయి.

వారి ముందే వాడు గుడ్డివాడయాడు. కుంటివాడయాడు. మూగవాడయాడు.

ఇది ఆ దంపతులను చకితులను చేసింది. వాడి కనుదోయి, కంఠస్వరంకూడా వారిని ముగ్ధుల చేశాయి. మురిసిపోయారు.

'ఏడినే పెంచుకోవాలి,' అనే భావన ఉభయులలోను దోబూచులాడింది.

ఇరువురు కనులతోనే సంభాషించుకున్నారు. వారి నేత్రాలు మెరిశాయి. ఏకాభిప్రాయానికి వచ్చారు. తమ తపస్సు ఫలించనున్నట్టు అనుభూతిని అనుభవించారు.

అదొక విచిత్రానుభూతి.

ఇది కేవలం యాధృచ్ఛికం. మానసికానందానికి సరిహద్దు.

'రేయ్ నీగ్రో!' పలకరించాడు పెద్దమనిషి.

ఆమె కొన్ని చక్కరకేళి అరటిపళ్ళను కొన్నది. 'నా చేతిలోవి ఏంవిత్రా గుడ్డాడా?' అన్నది గిసకతక్కడి కనుల ఎదుటగా వాటిని వుంచుతు.

'అరిటికాయ లరిటికాయలు!' అన్నాడు గిసకతక్కడు హుషారుగ, కనులు తెరిచి, వాటిని వాసన చూస్తూ.

దంపతు లిద్దరు ఫకాలున నవ్వారు. ఆ నవ్వుతో, తన తప్పును తెలుసుకొన్నట్టు సిగ్గిలుతూ గబుక్కున గట్టిగా కనులను మూసుకున్నాడు గిసకతక్కడు, పండ్లికిలిస్తూ.

'ముత్యాలపంటి పండ్లు': మురిసిపోయారు దంపతులు.

తెల్లబోతూ, చోద్యం చూస్తున్న పిల్ల చేతిలో రెండు పళ్లనుపెట్టి ఒక దానిని ప్రత్యేకంగా ఒలిచి గిసకతక్కడి నోటికి అందించిన డామె.

ఇంతలో కేతిగాడు ఊడిపడినాడు. వచ్చీ రావడమే ఫెడి ఫెడి చెరొకటి అంటించాడు.

మహా మంటగా వున్నాడు వాడు. 'మందు'....

'నాయాల్లారా-యెదా నేసుకుంటుండారా?' అంటూనే బొచ్చెలోని డబ్బులను అర చేతిలోకి బోర్లించుకొని, లెక్కించడం ప్రారంభించాడు. ఆశగా, ఆదుర్దాగా లెక్కిస్తున్నాడు.

'నీ పేరేవిటయ్యా?' అడిగాడు భర్త.

'కేతిగాడు. ఏం ...?' అన్నాడు తాగబోయే తీరులో.

'అవేం లెక్కించుకుంటావు- ఇవిగో రెండు వందల రూపాయలు. రెండు వందలు! వాణ్ణి మాతో వంపు!' అన్నాడు.

అంటూ రెండు వందల రూపాయల నోట్లను కేతిగాడి కనుల ముందు వుంచాడాయన.

రెండు వందలు! రెండు వందల రూపాయలు! ఒక్క సారిగా రెండు వందలు.

ఎంత సారా! ఎంతకాలం తాగితే తరుగును!

అంతే కాదు. మరి నాలుగు పండిపిల్లలను కొనవచ్చు. గుడిసెమీద కప్పడానికి రెల్లి గడ్డిని కొనవచ్చు....

ముఖ్యంగా సారా! నాటు సారా!....

వాటిని చూసి చూసి ఫకాలున నవ్వేశాడు. కోపం నటించాడు.

అతను చిన్నగా నవ్వాడు.

'వాడిని మేము అల్లారు ముద్దుగా, ప్రాణసమానంగా పెంచుకుంటాం!' అంటూ మళొక పచ్చ కాగితం తీసి మొత్తం అందించాడు. రెండు స్టాంప్ తెల్లటి కాగితాల చివరలో కేతిగాడి వ్రేలిముద్రలను వేయించుకున్నాడు.

కేతిగాడి పేరు, ఊరు, వాడి పెళ్ళాం పేరు వేరే రాసుకున్నాడు.

ఈపాటికే ఆమె గిసకతక్కణ్ణి కారులో తన ఒడిలో కూర్చోబెట్టుకున్నది.

ఒడిలో బిడ్డ. ఒడినిండా బిడ్డ....

ఆయన వచ్చి కారును కదల్చగానే తూలి ఆమె ఎదకు హత్తుకున్నాడు గిసకతక్కడు. వాటేసుకున్నాడు. ఏడ్చాడు.

ఆమే మాతృహృదయం ఆనంద పారవశ్యం చెందింది. వళ్ళు జలదరించింది.

వాడిని మరల మరల ముద్దాడింది. కారు కదిలింది.

ఊతంగాడు ఒగర్చుకుంటూ పరుగెత్తుక వచ్చాడు. ఇదంతా దూరంనుంచి వాడు చూస్తూనే వస్తున్నాడు. ఆలస్యంగా వచ్చాడు.

'ఎంత కాలం వొత్తయిరా యీ మూడొందలూ, దొంగ....'


తిడుతూ తూలుతూ పరుగెత్తుకు వచ్చిన ఊతంగాడి చంకలో కోడిపెట్ట లేదు.

కేతిగాడికి ఊతంగాడి కారుకూతలు వినిపించడంలేదు. వాటిని వాడసలు వినదల్చుకోలేదు. ఈడెవడహో....!

చేతిలోని మూడు పచ్చనోట్లను మార్చి మార్చి లెక్కించుకుంటూ చక చకా పెద్ద పెద్ద అంగలు వేశాడు కేతిగాడు.

కేతిగాడిని తన పొట్టలో దాచుకొన్నది సారా అంగడి ...

దిక్కుమాలిన ఈ ప్రపంచంలో....





సులోచన

ఆ రాత్రి ...

తుమ్మపూవు వంటి వెన్నెల రాత్రి.

విజయవాడ స్టేషనులో పెళ్ళికూతురువలె కదిలింది రైలు.

నా కంపార్టుమెంటులో ఒక్కడనే వున్నాను. ఏమీ తోచడంలేదు. నవల తీశాను. లోగడే సగంవరకు చదివాను. రైలును దిగేటప్పటికి మిగిలింది పూర్తిచేయాలి. చాల బావున్నది.

గుడ్డి పిల్ల జీవితంలోని భాగం.

చక్కగా వ్రాసింది రచయిత్రి.

రచయిత్రి కూడా గుడ్డిదే!

కథానాయిక గుడ్డిపిల్ల మనసు ఎక్స్-రేగా కనిపిస్తున్నది.

కథానాయిక గుడ్డిపిల్ల పేదది కాదు. రైల్లో అడుక్కునేదీ కాదు. లక్షాధికారి.

ఆమె జీవితం ప్రథమ దశలో తప్పటడుగు వేసింది. అది తప్పటడుగు అని అప్పుడామెకు తెలియదు.

ఆమె మోసపోతుంది. మనసు వికలమైపోతుంది. విరిగిపోతుంది.

మమత మాయమైపోతుంది. జడత్వం ఆవహిస్తుంది.

ఆ దశలోనే ఆమెకు అంధత్వం ప్రాప్తిస్తుంది.

తల్లి దండ్రులు, బంధువులు, స్నేహితులు, హితులు కళ్ళను బాగుచేయించుకో మంటారు.

ఆమె వినదు. ఆమె చూడదు.

ఈ మనుషులంటె ఆమెకు మంట, కోపం, అసహ్యం.

శాశ్వతంగా గుడ్డిదానిగానే వుండిపోతా నంటుంది.

మానసిక సౌందర్యాన్ని, మానవాతీతమైన సౌందర్యాన్ని వెతుక్కుంటా నంటుంది. అదొక తత్వం.

అంతవరకు వచ్చింది నవల.

ఆమె జీవితం....


రైలు ఆగింది. ఈ రైలు ఆగడం, కదలడం ఎక్కువ. నడవడం తక్కువ.

నా కంపార్ట్‌మెంటు తలుపు తెరుచుకొంది.

హమ్మయ్య! - ఎవరో వస్తున్నారు. వంటరితనం పోతుంది.

ఇరువురు మహిళామణులు వచ్చారు.

ఎవరయినా పురుషులు ఎక్కుతారేమో, వారితో కబుర్లు చెప్పుకుంటూ కాల క్షేపం చేయవచ్చు ననుకొన్న నాకు ఈ మహిళల ప్రవేశం ఆశాభంగాన్నే కలిగించింది. వీళ్ళతో ఎలా లోకాభిరామాయణం జరిపేది?



నాకు మాట్లాడడం సరదా.

ఇద్దరూ ఎదుటి సీటుమీద కూర్చున్నారు.

ఒకామె పడుచు, మరొకామె ప్రౌఢ.

పడుచు కనులకు నల్లద్దాల కళ్ళజోడు వున్నది.

నల్లద్దా లంటేనే అసహ్యం నాకు.

నవ నాగరికతకు చిహ్నంగా నల్ల కళ్ళద్దాలను, లిప్‌స్టిక్‌ను, నైలాన్ చీరలను ఎంచుతున్నారు.

తప్పతాగినవాడిలా కేక వేసింది రైలింజన్.

ప్రౌఢ లేచింది. తలుపు వరకు వెళ్ళింది.

'సులోచనా! జాగ్రత్త! ఏవైనా అవసరం అయితే ఎదురుగా అబ్బాయి వున్నారుగా-అడుగు, భయంలేదులే; వుంటానమ్మాయ్!' అరిచినట్టుగా మాటాడింది.

ప్రౌఢ మాట్లాడుతూనే దిగింది. బగుతూ నన్ను చూచింది.

రైలు కదిలింది.

పడుచుకు ఎదురుగా మగపురుగుని నేను వినా మరెవరులేరు. నా ముక్కూ ముఖం తెలియకపోయినా కలుపుగోలుగా నన్ను 'అబ్బాయి' అని ప్రౌఢ సంబోధించినందుకు ఆనందించాను. నాకు కావలసింది కలుపుగోలుతనమే.

పడుచు సర్దుకు కూర్చున్నది. అటు తిరిగి, కిటికీలోంచి బయటకు చూస్తున్నది.

ఆ ప్రౌఢ పరిచయం చేసిన పిదప ఈ పడుచు మర్యాదకయినా పలకరించ కుండా అటు తిరిగి కూర్చున్నందుకు మనస్సు చివుక్కుమన్నది.

నవల పుటలు తెరచాను. చదవబుద్ధి కావడంలేదు. మూసివేశాను.

'సులోచనగారూ!' అన్నాను నిదానంగ.

నా పిలుపుతో ఆమె ఉలిక్కిపడినట్టనిపించింది. తిరిగి చూసింది.

నా ముఖంలో ఏ భాగాన్ని ఆమె చూస్తున్నదో, ఏ భావాన్ని చదువుతున్నదో తెలియండలేదు.

నల్ల కళ్ళద్దాల ఫలితం అది.

తదేకంగా నన్ను చూస్తున్నదేకాని ఏమీ మాట్లాడడంలేదు.

అలా ఆమె చూస్తూ వుండడం నాకే కొంచెం ఇబ్బందిగా అనిపించింది.

మర్యాదకయినా ఆమె 'ఏవిటండీ!' అనయినా అనలేదు.

ఆమెను ఎందుకు పలుకరించానో నిజానికి నాకూ అర్థం కాలేదు. ఏమీ తోచక పిలిచి వుంటాను.

పిలిచిన పిదప ఆమె పలుకరించినా లేకపోయినా, సమాధానంగా నన్ను చూస్తూనే వున్నది కనుక, నేనే తిరిగి ఏదో ఒకటి అనాలి. తప్పదు.

'ఎంతవరకండీ....!'

'ఇందుపలండీ!'

మెత్తగా, మార్దవంగా వున్నది ఆమె గొంతు,

శ్రావ్యత, సౌమ్యత తొణికిసలాడుతున్నది ఆ స్వనంలో.

'మీరు?' నిదానంగా, సుకుమారంగా ప్రశ్నించినది.

'గుడివాడ' అన్నాను క్లుప్తంగ.

అని, ఆమెను పరిశీలించడం ప్రారంభించాను.

రెండు పదులకు ఇంచుమించుగా వుంటుంది వయసు.

తొణుకు బెణుకు లెరుగని నిండుకుండగా గంభీరంగా పొందికగా కూర్చున్నది. అంగసౌష్టవం చక్కగా అమరికగా వున్నది. పుట్టుకగల పిల్ల. చామనచాయ. చదువు, సంస్కారం కొరత కనిపించడంలేదు.

ఆడంబరం లేదు. సహజ సౌందర్యం కొట్టవచ్చినట్టు కనుపిస్తున్నది.

నీడపట్టున పెరిగిన పెద్దింటి పడుచు అనుకుంటా.

కుత్రిమతను కొనితెచ్చుకోవడానికి ఆమె ప్రయత్నించకపోవడం ఆనందాన్ని కలిగిస్తున్నది.

ఆ నల్లద్దాల కళ్ళజోడునుకూడా తీసివేస్తే ...

వెన్నెల విరియకాస్తున్నది. వెన్నెలలో ప్రకృతి పులకరిస్తున్నది, హృదంత రాళను పలకరిస్తున్నది.

టెలిఫోన్ తీగలమీద పిట్టలు బారులు బారులుగా కూర్చుని కునికిపాట్లు పడుతున్నాయి.

పొలాలలో అక్కడక్కడ అప్పుడప్పుడు తెల్లటి కొంగలు ఎగురుతున్నాయి. పండిన వరిపైరు ఒరిగిపోతున్నది.

పైరగాలి హాయిగా వున్నది.

ప్రకృతి ప్రసాదించే పరమాద్భుత సౌందర్య సోయగాలను కనులు వుండే కాంచలేరు కొందరు.

వెన్నెల వైచిత్రిని నల్లకళ్ళద్దాలలోనుంచి ఏమి చూడగలుగుతున్నది ఈ సులోచన?

'కనులు వుండీ చూడలేని వాళ్ళంటే పరమ అసహ్యం నాకు' అన్నాను సులోచనను ఉద్దేశించి వెక్కిరింతగ, ఆమె ముఖం ఎలా మారుతుందో అని చూస్తూ.

'నాకూను!' సులోచన తక్కున అన్నది.

అంత చపలన, అంత చొరవగా అలా అంటుందని అనుకోని నేను ఆశ్చర్య పోయాను. అప్రతిభుడ నయాను.

ఒకవేళ, నా మాట సూటిగా ఆమెకు తగిలినదేమో అనుకున్నాను.

ఆమె మానసికంగా కదలినట్టు ఆ శబ్దం ధ్వనించినది.

నా ముఖంలోకే చూస్తున్నది. ఏమనుకొంటున్నట్టు?

'పండు వెన్నెలలోనుంచి, పైరులమీదగా, మందంగా, చల్లగా ఎంతహాయిగా వీస్తున్నది గాలి!'

ఆమెనే చూస్తూ పైకి అనుకొన్నాను.

ఆమె మరల ఏదో మాట చటుక్కున అంటుందనుకొని, అది వినడానికి సర్వ సన్నద్ధంగా వున్నాను.

ఆమె ఏమీ అనలేదు.

'మీకు అభ్యంతరం లేకుంటే-రాత్రుళ్ళకూడా ఆ నల్లకళ్ళద్దాలను....'

ఉచితానుచితాలనుకూడా గమనించకుండా అంటున్న నా మాటలను ఆమె జవాబుతో మధ్యలోనే మింగివేయవలసివచ్చినది.

'క్షమించాలి - నా వ్యక్తిగత అభిరుచుల గురించి మీరింత చొరవతో మాట్లాడ్డం .. '

ఆపై పదం ఆమె పలకకపోయినా, నాకు తెలుసు.

'ఓ మనిషీ! కనీసమైన సభ్యతకూడా నీకు అలవడలేదా?' అని నిలదీస్తున్నది.

ఆ మాట మార్దవంగానే అనినా, కష్ట మనిపించింది. బాధపడినాను.

ఆమె సంస్కారం ముందు తప్పక తలవంచవలసి వచ్చినది.

నిజమే! ఆమె మాటకు నేను బాధపడినటుగానే నేననిన మాటకు ఆమె ఎంత బాధపడిందో!

అయితే, ఆమె నన్ను అపార్థం చేసికోలేదుకదా! అది నేను భరించలేను!

మరేమీ మాట్లాడలేక, నోరు మూసుకొని నవల పుటలను తిరగ తిప్పాను.

తోచడంలేదు. కొన్ని క్షణాలు రైలు శబ్దం వినా నిశ్శబ్దమే అలముకొన్నది. శూన్యం ఆవరించినది.

నేను మళ్ళీ మాట్లాడకపోవడంతో ఏమనుకున్నదో ఏమో, 'మీకు చలిగా లంటే ఇష్టమనుకుంటా!' అన్నది.

ఆమె అలా అనిన తరువాతకాని నాకు తెలియలేదు - రైలువేగం హెచ్చుతున్నకొలది చల్లగాలికి బదులు చలిగాలే దూసుక వస్తున్నదని.

సాలోచనగా నన్ను పరికిస్తూనే వున్నది సులోచన.

ఏమి మాట్లాడడానికీ అశక్తుడనయాను.

'చలికి చస్తున్నాను! మీకు అభ్యంతరం లేకుంటె, దయచేసి ఆ కిటికీలను వేసివేస్తారా?'

మారు మాట్లాడకుండా కిటికీ తలుపులను మూసివేశాను. ఫాన్‌ను కూడా ఆఫ్ చేశాను.

ఆమె ముఖంలోకి మరల చూశాను.

గాలి స్పర్శ ఆగిపోగానే 'థాంక్స్!' అంటూ చిరునవ్వునవ్వింది.

ఇంతవరకు కనులకు కప్పివున్న వల్లద్దాలను తనంతతానుగా తొలిగించినది!

'క్షమించండి-ఇందాక మీ మనస్సుకు కష్టం కలిగించినట్టున్నాను. ఎదుటివారి అభిరుచులను మన్నించడం మాకూ తెలుసు!' అని క్షణం ఆగి, తనే మళ్ళీ 'బిజినెస్ పై వెడుతున్నారా?' అనడిగింది.

మధురమయిన ఆ కలుపుగోలుతనం నా విసుగును పోగొట్టింది.

అవును. సహృదయత అందరికీ వుంటుంది. దానిని అపార్థం చేసుకొనకుండా వుండాలి, అంతే.

ఆమెకు నాపై కోపంలేదు. సద్భావమే వున్నది. అదే కావాలి నాకు.

'కాదు. బిజినెస్ కిందే వెడుతున్నా!' అన్నాను ఆమె నేత్రాంచలాలనే చూస్తూ, చిలునవ్వు నవ్వుతూ, చిన్నగా.

ఆమె కూడా చిరునగవుతోనే నన్నవలోకిస్తున్నది.

కాని, అలా ఏక దీక్షగా, అదేపనిగా, అలాగే చూస్తున్నదేవిటి? సిగ్గువేయడం లేదూ?

ఒక స్త్రీ ఒక పురుషుని అలా....

నాకే సిగ్గనిపించి, నేనే తల తిప్పుకున్నాను.

అయితే, సువిశాలమైన ఆమె సుందర నీలి నేత్రాంచలాలనుంచి చూపును మరల్చుకోలేకపోతున్నాను.

ఆమె కాటుక కనులు అంత అందంగా వున్నాయి.

నా వలెనే సృష్టికర్తకూడా సౌందర్యోపాసి, రసోన్మాది.

కనుకనే అంచక్కటి కనులను సృష్టించగలిగాడు.

అవును - అంత సేపుగా ఆమె నేత్రాలనే చూస్తువున్నా సిగ్గులదేమి?

పైగా, తనూ అలాగే చూస్తున్నది, తదేకంగా, రెప్ప వాల్చకుండ.

'మీ నేత్రాలను చూస్తూంటే, మహాకవులు వర్ణించిన....'

'అప్సరసాంగనలు గుర్తుకు వస్తున్నారు!'

ఆ ఛెణుకుతో ఇద్దరమూ నవ్వాము. నవ్వుతున్న ఆమె నేత్రాలు మరీ అందంగా కనుపించాయి.

రైలు, స్టేషన్‌లో ఆగింది. మరల కదిలింది. దాని నడక విచిత్రంగా ధ్వనిస్తున్నది.

ఇద్దరిమధ్య నిశబ్దం అలుముకొన్నది. భరించలేని నిశ్శబ్దం!

క్షణంలో సగంలో ఆమె ముఖంలో గాంభీర్యం ఉట్టివడింది. పెదిమలు విరచింది.

ముఖంలోని తేజస్సు, ఓజస్సు పోయి చైతన్యరహితమయింది. మ్లాన మయింది.

పున్నమి జాబిలివంటి ఆమె ముఖంలో అమావాస్య అలముకొన్నది.

వెన్నెలలో చీకటి దోబూచులాడింది.

ఏ సంఘటన ఆమెను అంతగా కదల్చినదో అర్థం కావడంలేదు.

ఏ మాట ఆమెను అంతగా వేధించింది?

నన్ను అపార్థం చేసుకొన్నదా? బాధించానా?

అంతటి కోమలమయిన మనస్సును అంతగా కలవరపరచినది ఏదిటి?

నల్ల కళ్ళజోడుతో తిరిగి నయనాలను కప్పివైచినది.

అది చూస్తూకూడా నోరు మెదపలేకపోయాను. పెదాలను కదల్చలేకపోయాను.

నవల పుటలను తెరచి మనస్సును కేంద్రీకరించడానికి యత్నించాను.

విలక్షణ వ్యక్తిత్వంకల ఆ గుడ్డిపిల్ల మనస్తత్వంతో పరిచయం చేసుకోవడానికి పంక్తులలో వెతకుతున్నాను .....

* * * *

'ఇది ఇందుపల్లేనాండీ?' రైలు వేగం తగ్గగానే అడిగింది.

'అనుకుంటాను!' అన్నాను, ఇంతసేపటికి నోరు మెదిపినందుకు ఆనందిస్తూ, నల్లద్దాలలోకి చూపును మరల్చుతూ.

ఈ పలకరింపుతో ఆమెకు నామీద కోపం రాలేదని మాత్రం గ్రహించగలిగాను.

తీయందనాల ఆ స్వనంలో మార్పు లేదు!

'నేనిక్కడ దిగిపోతాను.పోయేప్పుడు మీకొక మాట చెబుదామనుకొంటున్నాను.

నాకు పెండ్లయింది. బిడ్డకూడా. దురదృష్టవశాత్తు నా భర్త నన్ను త్యజించారు. నాకు వున్న ఆస్తిపాస్తులు నాకు కాని, నా శ్రీవారికి కాని సుఖాన్ని కలిగించలేక పోతున్నాయి....


ఇంతా ఎందుకు చెబుతున్నానంటే, ఇందాకటినుంచి మీ మాటలనుబట్టి, ఊహలనుబట్టి మీరు సహృదయులు, సౌందర్యోపాసకులు అయి వుంటారనుకొంటున్నాను.

మీరంతా బాహ్య సౌందర్యానికే పరవశు లవుతారు కాని, అంతర్గత సౌందర్యం గురించి అసలు ఆతోజించరేం?

మనలో రానురాను మానసిక సౌందర్య పిపాస కొరవడుతున్నది. ఈ స్వాప్నిక, ఆడంబర సౌందర్యాన్ని మించిన దేదో మనిషిలో వుంటుంది. దానికోసం వెతకండి.... నేనేదో అంటున్నాను... క్షమించండి, నమస్తే....!'

అంటూనే లేచి తలుపు వరకువెళ్ళింది.

నిదానంగా, ఎటో చూస్తూ వెళ్ళింది.



ఆమె పెదాలు వణికాయి.

చెక్కిళ్ళు కెంపెక్కాయి.

మాట తడబడింది.

మనసు జలదరించింది.

ఆమెలో హఠాత్తుగా వచ్చిన ఈ మార్పుకు కారణం ఏమయివుంటుందో తెలియడం లేదు.

అంతలోనే రైలు ఆగడంతో ఆమె దిగబోయి, రైలు ఊపుకు, కునికిపాటు వచ్చినట్టు తూలింది.

ప్రక్కనే కూర్చునివున్న నేను వెంటనే లేచి, ఆమె చేతిని పట్టుకొని, వెను వెంటనే వదిలివేశాను.

ఆమె నిదానంగా రైలు దిగింది.

దిగుతూనే, కృతజ్ఞతగా మళ్ళీ నన్ను చూస్తూ అన్నది....'థాంక్యు వెరిమచ్!'

యథాస్థానంలోకి వచ్చి కూర్చుని వళ్ళు విరుచుకున్నాను.

ఆమె చివరి ముక్కకు రిత్తవోయిన నేను, కిటికీలోంచి ఆమెనే చూస్తున్నాను.

పాలేరు కాబోలు ఒకతను-

లాంతరును చేతపట్టుకొని, ఆమెకు చేరువగా నడుస్తున్నాడు.

ముందు అతను, వెనుక ఆమె, స్టేషన్ ఆవరణ బయట వేచివున్న రెండెడ్ల సవారీ బండివద్దకు వెడుతున్నారు.

రైలు ఇంజన్ రోదించింది.

ఉస్సురంటూ, ఆమెనే తలచుకొంటూ, తిరిగి పుస్తకంలోకి దృష్టిని పోనిచ్చాను.

ఇహ ఒక్కడినే. మళ్ళీ ఒంటరిని....

బాధాకరమయిన విచిత్రానుభూతి హృదయంలో ద్రవించినది.

ఆమె చివరిమాటలు, అప్పటి ఆమె విషణ్ణవదనం మనస్సును కకావికలం చేస్తున్నాయి.

మళ్ళీ పుటలను తెరిచాను.

సానుభూతికి నోచుకోలేని గుడిపిల ....

* * * *

రైలు కదలబోతుండగా, ఆజానుబాహుడయిన రైతుయువకుడు హఠాత్తుగా పెట్టెలోకి దూసుక వచ్చాడు.

'చి చీ....సాపిష్టి ముఖం ఎదురయింది. వెడుతున్నపని అవుతుందో, అవదో,' అని తనకు తనే బిగ్గరగా తిట్టుకున్నాడు, వస్తూనే.

'ఎవరండీ,' పలకరింపుగా, నవ్వుతూ అడిగాను.


'అదేలెండి–నా మాజీ పెళ్ళాం. గుడ్డిముండ. సులోచన. అసలు ఈ ఆడవాళ్ళున్నారు చూశారూ, మాష్టారూ....'


అతనేదో చెబుతున్నాడు.

నా మనస్సు సులోచన వెంట పరుగెడుతున్నది.

సులోచన....గుడ్డిపిల్ల ....

నవలలో గుడ్డిపిల్ల ....





వరలక్ష్మి పెళ్ళి

అతను ప్రేమించాడు. అతని పేరు విష్ణువర్ధనరావు.

తన తల్లిని, చెల్లెళ్ళను, తమ్ముళ్ళను, పొలాన్ని ప్రేమించాడు విష్ణువర్ధనరావు.

చెల్లెళ్ళు ఇద్దరు. ఒకతె పెళ్ళికి ఎదిగి కూర్చున్నది. తమ్ముళ్ళు ముగ్గురు. చదువుతున్నారు. తను చదివిస్తున్నాడు.

వీళ్ళకు తనే తండ్రి. తనే ప్రాణం. వీళ్ళ భవిష్యత్తుకూడా తన చేతులలోనే వున్నది.

తన భవిష్యత్తుకూడా తన చేతులలోనే వున్నది.

తనకు వున్నది పదెకరాల కొండ్ర. అయితేనేం–నీక్షేపంలాంటి మాగాణి. ఈ నేలతల్లి తన కుటుంబానికి ఆధారం.

తను భూమి పుత్రుడు; అందుకే నేలను నమ్ముకున్నాడు, దానిని ప్రేమిస్తున్నది.

అతనొక అమ్మాయిని కూడా ప్రేమించాడు.

ఆమె తన మేనకోడలే. చదువుసంధ్యలు అంతగా లేవు. అయితేనేం–సంస్కార వంతురాలు. కుందనపు బొమ్మ.

తనన్నా, తన కుటుంబం అన్నా 'పడి చస్తుంది.'

ఇంతకూ; ప్రేమంటే ఏమిటి? ప్రేమించడం అంటే ఏమిటి? తనకు తెలీయవు.

ఒకానొక రోజున ఆమె తన ఇంటికి వచ్చినపుడు-వస్తున్నపుడే-వరండా ముందే ఎదురై-తనను చూసి, పమిటె సర్దుకుంటూ ప్రక్కకు తొలుగుతూ లోనికి వెళ్ళబోతున్న ఆమెను చూస్తూనే సూటిగా అనేశాడు; "ఏమే లక్ష్మి, నన్ను పెళ్ళి చేసుకుంటావా?" అని.

ఆమె పేరు వరలక్ష్మి. వరలక్ష్మి క్షణకాలంపాటు నిలిచిపోయింది.

ఈ మగమనిషికి మాటలు వచ్చునని, మనసు వున్నదని ఆమెకు ఇప్పుడే తెలిసింది. తెలియగానే ఆమె మనసు గుబగుబ లాడింది.

అధరాలు కదులాడాయి.

"ఛీ, పో" అంది.

"ఛీ పో" అంటే ఏమిటో తనకు తెలియక వెళ్ళిపోవడానికి కదిలాడు.

వరలక్ష్మి కూడ కదిలింది.

పమిటను నిండుగా కప్పుకుంటూ, లోన్నించి వస్తున్న మేనత్తను చూస్తూ, గాభరాపడి, చకచకా "నాన్న నడుగు" అని చెబుతూనే లోనికి వెళ్ళిపోయింది.

"నాన్న నడుగు" అన్నప్పుడు కాని, ఆమె అనిన "ఛీ-పో" అర్థం అతనికి అతని దృష్టిలో తెలిసిరాలేదు.

ఆమె తన మేనకోడలే కావచ్చు కాని, తన మేనమామ అంతస్తువేరు, తన స్థితిగతులు వేరు.

తన మేనమామ మధ్యతరగతికి చెందినవాడే అయినా, ఇటీవల విపరీతంగా పెరిగిపోయాడు.

'అప్పర్ మిడిల్ క్లాస్' స్టేజిని కూడా దాటిపోయిన 'న్యూ రిచ్'.

ఆ స్థిపాస్తులతోపాటు పలుకుబడిని కూడా పెంచుకున్నాడు. కాదు. ఆ స్థిపాస్తులతోపాటు పలుకుబడి కూడా దానంతట అదే పెరిగింది.

ఏ విషయంలోకూడా ఆయనతో తను సరిపోల్చుకోలేడు.

అటువంటిది, ఆయన కూతురిని తను పెళ్ళిచేసికోమని అడగడం-తనదే తప్పు. ఈ విషయాన్నే ఆమె స్పష్టంగా 'ఛీ-పో' గా తేల్చి చెప్పింది;

'నీ అంతస్తు ఏమిటి? నా అంతస్తు ఏమిటి?' అనే ప్రశ్నను ఆమె విసరింది అనుకున్నాడు.

పైగా, ఈ విషయాన్నే ఆమె తండ్రి దగ్గర ప్రస్తావిస్తే ఆయన తన తడాఖా తేలుస్తాడు సుమా అని హెచ్చరించింది కూడానని అతను అనుకున్నాడు.

మనిషి కృంగిపోయాడు. తనలో తను కుంచించుకపోయాడు.

కాని, ఎంత ఆలోజించుకున్నా తను తన మేనకోడలికి ఎలా 'తగనివాడో' తేలి చావడం లేదు.

అయితే, తను వరలక్ష్మిని అపార్థం చేసికొన్నట్టు తరువాతకాని తెలిసిరాలేదు.

* * * *

"అత్తయ్యా! మూగబావయ్యకు పెళ్లి చెయ్యవా?' లోనికి వెళ్ళబోతూ వరండా గుమ్మంలోనే ఎదురయిన మేనత్తను తపిమని అడిగేసింది వరలక్ష్మి.

మితభాషి విష్ణువర్ధనరావుకు వరలక్ష్మి పెట్టిన 'నిక్ నేమ్' మూగబావయ్య.

మేనత్త తృళ్ళిపడింది. తెల్లబోయింది. చిన్నబుచ్చుకుంది.

ఇవి కనుపించకుండా చిన్నగా నవ్వింది. లోనికి దారితీసింది.

తన తమ్ముడు, కూతురి పెళ్ళి ప్రయత్నాలలో వున్నట్టు, సంబంధాలకోసం తిరుగుతున్నట్టు, ఒకటి రెండు సంబంధాలు ఆయని నచ్చినట్టు, ఈ మాఘమాసంలోనే ఎలా అయినా సరే దానికి మూడు ముళ్ళూ వేయించవలె ననే కృతనిశ్చయంతో అత గాడు వున్నట్టు ఆమెకు తెలుసు.

"ఈ పిల్లకుమాత్రం తెలియదా?" అనుకున్నది.

తనను పరిహసిస్తున్నదేమో ననుకున్నది.

కాని, ఈ పిల్ల మనసు తనకు తెలియదా అని సరిపెట్టుకున్నది.

చెట్టంతవాడు తన కొడుకు మండగా మేనరికాన్ని కాదని తన తమ్ముడు బయట సంబంధాలకు ఎందుకు వెడుతున్నాడో ఆమెకు పూర్తిగా తెలుసు.

ఆస్తిపాస్తులు, అంతస్తులే ముఖ్యమనుకున్నవారికి బంధుత్వాలు గుర్తువుండవు. మమతానురాగాలను మరచిపోతారు.

రూకతోనే మనిషిని తూస్తారు.

తన తమ్ముడు ఆ పనే చేస్తున్నాడని ఆమె అనుకున్నది.

అతని దారికి అడ్డుగా తాము నిలవకూడదనే అనుకున్నది.

ఉభయులకు కావలసిన గ్రామపెద్దలు ఇద్దరు ముగ్గురు మేనరికపు సంబంధాన్ని గట్టిపరచుకోవడం మంచిదని సూచన ప్రాయంగా ఉభయులవద్ద ప్రస్తావనలు తెచ్చారు.

ఉభయులు మౌనముద్ర దాల్చడంతో మధ్య తమకెందుకొచ్చిన గొడవలే అనే ధోరణితో ఆ పెద్దలు మిన్నకున్నారు.

వీరికి ఉభయులు కావలసినవారు. ఉభయులకు వీరు తమవారే. ఆ మాటకు వస్తే ఈ ఉభయులలోను విరోధ భావా లేమీ లేవు.

ఒక్క ఈ పెళ్ళి విషయంలోనే....

"పెళ్ళంటే మాట్లాడ్డు, బి. ఏ. చదివాడు – ఉద్యోగం చూసుకోరా, పొలం పనులు మేం చూసుకుంటాం అంటే – తమ్ముళ్ళను చదివిస్తూ వాడు వ్యవ సాయం చూస్తున్నాడు. నా మాట వినేవారెవరు? ఏంటో...." సణుక్కుంటున్నట్టు మాట్లాడింది మేనత్త.

మేనత్త నిరాశపడినట్టు గమనించింది వరలక్ష్మి.

నిరాశకు కారణం తనకు తెలుసు....

"సంబంధాలు వస్తున్నాయా?" యాదృచ్ఛికంగా అడిగింది వరలక్ష్మి.

"గంతకు తగ్గ బొంత దొరక్కపోతుందా? మాకేమైనా మడిమాన్యా లున్నాయా? లకారా లున్నాయా...?" దీర్ఘంగా నిట్టూరుస్తూ అన్నది మేనత్త.

మేనత్త నిట్టూర్పుకు కారణం తనకు తెలుసు ...

"బావయ్యను నువ్వు చేసుకుంటావంటే?" హఠాత్తుగా ఉత్సుకతతో అడిగింది మేనత్త.

తన మేనత్త హఠాత్తుగా తన నిలా అడిగివేస్తుందని వరలక్ష్మి ఊహించు కోలేదు.

బిత్తరపోయింది. గుండె దడదడలాడింది.

ఆయినా తమాయించుకుంది. "ఛీ_ పో!" అంది.

అని, వెంటనే "నాన్న నడుగు" అంది. అంటూనే కదిలింది.

కదులుతూనే నుదుటికి పడుతున్న చెమటను పమిటకొంగుతో తుడుచుకున్నది.

"ఆడపిల్ల తండ్రి వాడు నన్ను అడగాలేకాని, నే నెందు కడుగుతానే?" అన్నది మేనత్త తన తమ్ముడిని వుద్దేశించి.

నేలచూపులు చూసుకుంటూ వంటింట్లోకి వెళ్ళిపోయింది వరలక్ష్మి.

మేనత్త అలా అన్నదేకాని, ఆమె మనసు మనస్సులో లేదు.

అభిజాత్యం అన్నిటా పనికిరాదు!

ఇవ్వాళ తన తమ్ముడు 'మన లక్ష్మిని మీ ఇంటి కోడలుగా తీసుకెళ్ళవే అక్కా' అనే స్థితిలో వున్నాడా? తాము అతని స్థాయిలో ఉన్నామా?

అలా అడిగేవాడే అయితే బయట సంబంధాలకోసం ఎందుకు చూస్తాడు? అను కున్నదామె.

లోలోన ఎక్కడో కొద్దికొద్దిగా కదులుతున్న ఆశతో ఆమె, తనే అడిగి లేదని పించుకుంటే పోతుందని అనుకున్నది.

తనకు ఆశ లేదు. అయినా....

మేనమామ అంటే అది 'పడిచస్తుంది.'

తనకు ఈ సంబంధం ఎలాగూ కానిదేననే నమ్మకంతోనే కాబోలు తన కొడుకు పెళ్ళి ఊసే ఎత్తడంలేదు.

తన కొడుకు మనసులోకూడా మేనకోడలే వున్నది.

కాని, కాని....

చాల రోజుల తరువాత బిరువు గుండెలతో ఆమె తమ్ముని గుమ్మం తొక్కింది.

బిరువు గుండెలతోనే చాల తొందరగా బయటపడి, తడబడుతూ ఇంటికి వచ్చింది.

వరండాలో గుమ్మం ముందు కూర్చున్న వరలక్ష్మితో "అడిగానే" అనేసి చకాచకా లోనికి వెళ్ళిపోయింది.

* * * *

వరలక్ష్మి పెళ్ళి వైభవోపేతంగా జరిగిపోతున్నది.

విడిదింటి నుంచి వియ్యాలవారి ఇంటివరకు ఆ వీధి వీధి అంతా మెర్క్యూరీ లైట్ల వెలుగులో విరిసిపోతున్నది. బల్బుల తోరణాలతో వెన్నెల వెల వెల పోతున్నది.

జనం కిటకిటలాడిపోతున్నారు.

షడ్రసోపేతంగా విందులు ఒకవైపున జరిగిపోతున్నాయి.

"పెళ్ళంటే ఇదే" అన్నాడొక వృద్ధ త్రేన్చుతు.

"అవును. ఈ ఖర్చుతో వంద కుటుంబాలు వందేళ్ళు హాయిగా బతుకుతాయి" అన్నాడొక కుర్రకారు.

తన వెనుకనే దూరంగా నుంచున్న మేన త్తను ఓరగా చూసింది వరలక్ష్మి.

మేన త్త చురునవ్వింది. ఆ చిరునగవు లోతులను వెతకింది వరలక్ష్మి.

వరుడు అమెరికాలో పెద్ద డిగ్రీ తీసికొని వచ్చినవాడు. బొంబాయిలోని ఒక పెద్ద పరిశ్రమలో పని చేస్తున్నాడు. కట్నంగా వచ్చే డబ్బుతో మద్రాసులో సొంతంగా పరిశ్రమను వెలకొల్పవలెననే ఆలోచనలో వున్నారు.

సూత్రధారణ సమయం వచ్చింది.

కాబోయే మామగారు ఒక వైపున, తండ్రి మరొక వైపున వరలక్ష్మి ఎదుట నిలిచారు.

కాబోయే మామగారు తన ప్రక్కనేవున్న తనకు కావలసినవాని చెవి కొరికాడు.

చెవి కొరికించుకున్న పెద్దమనిషి వియ్యంకుని వద్దకు వచ్చి ఆయన చెవిలో దానిని ఊదాడు.

ఆయన తన ప్రక్కనే వున్న వేరొక కావలసిన వ్యక్తి భుజం తట్టాడు.

ఆ వ్యక్తి తన జేబులోంచి పెద్ద ఫర్సును, రెండు బ్యాంకుల చెక్కులను బయటకు తీస్తూ కానున్న మామగారి ప్రక్కకు వెళ్ళి నిలిచి ఆయన చేతులలో వుంచాడు.

ఆయనతోనే తిరిగి వచ్చిన పెద్దమనిషి వాటిని అందుకొని, ఫర్సును తెరచి, చెక్కులను చూసుకోబోయే మామగారి చెవిలో ఊదాడు.

కాబోయే మామగారు కనులు చిట్లించారు, నొసలు విరిచారు.

"స్టాప్ దిస్ నాన్‌సెన్స్" దాదాపు అరిచినట్టుగా అన్నారు.

పెద్ద మనిషి భజంత్రీలవాళ్ళకు సైగ చేశాడు. వాళ్ళు తమ వాయిద్యాలకు విశ్రాంతి నిచ్చారు.

"మీరు నాకు చెప్పిందేమిటి? చేసిందేమిటి?" నిలదీసి అడిగాడు ఎదురుగా వున్న వియ్యంకుని కాబోయే మామగారు.

"ప్రస్తుతం నా దగ్గర అంతవరకే క్యాష్ వుంది. బ్యాంకుల వుద్యోగులు నమ్మి చేస్తున్నారని మీకూ తెలుసుగా-డ్రా చేయడానికి వీల్లేకపోయింది. అవిగో సంతకం పెట్టిన చెక్కులు - ఆ ఎమౌంట్ లెక్క పెట్టలేదా?"

ఇంకా ఏదో మాట్లాడబోయాడు వరలక్ష్మి తండ్రి.

"నాలిగ్గీసుకోవడానికా ఈ చెక్కులు ? అసలక్కడ క్యాష్ వుందో లేదో ఎవడికి తెలుసు?" మండిపడినాడు కాబోయే మామగారు.

"ఏజంట్లకు ఫోన్లు చేయండి కావాలంటే. నేనూ ప్రయత్నించా- అంత మొత్తం నగదు ఒక్కసారిగా బయట దొరకలా...."

ఇంకా ఏదో చెప్పుకుపోతున్నాడు వరలక్ష్మి తండ్రి.

ఇందాకటి నుంచి చూస్తున్న పెళ్ళికొడుకు పెదవి విప్పాడు:

"డాడీ! ఫియట్ ఏది?"

"ఆర్డరిచ్చాం. త్వరలోనే వస్తుంది."

వరలక్ష్మి తండ్రి గొంతులో మార్పు వచ్చింది.

"యూ ఆర్ చీటింగ్ మి!" పెళ్ళికొడుకు కసిరినట్టు అన్నాడు.

వరలక్ష్మి మేనత్త మెల్లిగా తమ్ముడి దగ్గరకు వచ్చింది. "పోనీ, పొలం దస్తా వేజులు ఇవ్వరాదు!" అంది.

"అవీ బ్యాంకిలోనే వున్నాయి-" గొణిగినట్టు అన్నాడు వరలక్ష్మి తండ్రి.

"పోనీ, మా దస్తావేజులు తెస్తాన్లే అగు!" అంటు కదలబోయింది మేనత్త.

"ఎందుకు? నాలిగ్గీసుకోనా" మళ్ళీ అరిచాడు కాబోయే మామగారు.

"ఇంతోటి బోడి సంబంధాలు మావాడికి దొరక్కకాదు. కో అంటే కోటి మంది దిగొస్తారు. ఏదో కాళ్ళా వేళ్ళాపడి బ్రతిమలాడారుకదా అని కట్నం తక్కువైనా ఒప్పుకుంటే మమ్మల్ని మొత్తంగానే ముంచేయాలని చూస్తారా?"

కాబోయే మామగారి ప్రక్కనే వున్న పెద్దమనిషి గొంతు విప్పాడు.

వరలక్ష్మి తండ్రి ప్రక్కనే నుంచున్న వ్యక్తి నడుంకట్టును తలగుడ్డగా చేస్తూ గావంచ పంచె చెంగును దోపుకుంటూ ముందుకు కదలబోయాడు.

"జరిగింది చాల్లే, ఇంకా...." వరలక్ష్మి తండ్రి ఆయనను వారించాడు.

"అత్తయ్యా!" మెల్లిగా పిలిచింది వరలక్ష్మి.

కన్నీటిని తుడుచుకుంటూ వరలక్ష్మికి చేరువగా వచ్చింది మేనత్త.

ఈపాటికి పెళ్ళి కొడుకు చేతిలో నలిగిపోతున్న మంగళసూత్రాన్ని ఒక్కగుంజు గుంజుకొని ఒక్క ఉదుటున లేచింది వరలక్ష్మి.

"నాన్నా, రా!" అంటూ కళ్యాణ మంటపంనుంచి కదిలింది వరలక్ష్మి.

* * * *

ప్రకృతి స్తంభించింది.

తుమ్మపూవు వంటి వెన్నెల విరియకాస్తున్నా విష్ణువర్ధనరావు మనసునిండా కారు చీకట్లు కమ్ముకున్నాయి.

గుండె నెవరో పిండుతున్నట్టు బాధపడుతున్నాడు.

తనదైన సొంత సొత్తును ఎవరో ఎత్తుకపోతున్నట్టు తనలో తనే రోదిస్తున్నాడు.

విష్ణువర్ధనరావు తన ఇంటి వరండా ముందు వేప చెట్టుకింద మంచంమీద వడుకుని అదే ధ్యాసగా శూన్యంలోకి చూస్తున్నాడు.

అక్కడ నక్షత్రాలు వున్నా అతనికి శూన్యమే కనిపిస్తున్నది.

సున్నితమైన ప్రేలు తన చెక్కిలిమీద కదిలేవరకు తన కనులు వర్షిస్తున్నాయనే విషయాన్నే అతను గమనించలేదు.

విష్ణువర్ధనరావు ఉలికిపడి లేచి కూర్చున్నాడు. వెంటనే నుంచున్నాడు.

"బావయ్యా! ఈ సూత్రాన్ని ముడేయ్!"

తన కేదో అధికారం సంక్రమించినట్టు ఆజ్ఞాపిస్తున్న ధోరణిలో అంటూ మంగళసూత్రాన్ని విష్ణువర్ధనరావు కనుల ముందు వుంచింది వరలక్ష్మి.

తనేదో కలగంటున్నట్టు తోచింది విష్ణువర్ధనరావుకు.

బేలగా తల్లిని, బిడియంగా మేనమామను చూశాడు.

"అట్టా చూస్తావేరా. నేను చేసింది తప్పు, నా కూతురు చేసింది రైటు. మవ్వు మేనల్లుడవే కాదు, అల్లుడివి. సూత్రధారణ చేసెయ్!" అన్నాడు వరలక్ష్మి తండ్రి బొంగురుగ.

అంటూనే కూతురు చేతిలోని సూత్రాన్ని తీసికొని అల్లునికి అందించాడు.


ఆశ్చర్యపోతూ విష్ణువర్ధనరావు తల్లి ముఖంలోకి చూశాడు.

సాలోచనగా తలూపింది తల్లి.

వెంటనే మేనకోడలి మెడలో మూడు ముళ్ళు వేసివేశాడు విష్ణువర్ధనరావు.

ముందు వధూవరులు, వెనుక అక్కా తమ్ముళ్ళు పెళ్ళి పందిరివైపుకు కదిలారు.

ప్రకృతి ఇపుడు పరవశించిపోతున్నది.



ప్రమాదం



కలెక్టరు కారు దూసుకపోతున్నది.

మచిలీపట్నం – హైదరాబాద్ హైవేమీద కలెక్టర్ 'ఎంబాసిడర్' అరవై కిలోమీటర్ల వేగంతో వెళ్ళిపోతున్నది.

కారు సూర్యాపేటను దాటింది.

ముందుకే చూస్తూ వెనుక కూర్చున్న కలెక్టరు ఆదేశం మేరకు ఒక చిన్నపల్లె వద్ద కారు ఆగిపోయింది.

రోడ్డు మీద గుంపు, రోడ్డు ప్రక్కన గుంపు.

కొందరు పల్లెనుంచి ఇంకా పరుగు పరుగున వస్తున్నారు.

పోలీసుల జీప్, వ్యాన్ రోడ్డు ప్రక్కగా నిలిచి వున్నాయి.

పోలీసులు జనాన్ని పర్తుతున్నారు, కసరుతున్నారు.

కొందరు పోలీసులు వచ్చే పోయే బస్సులు,లారీలు, కార్ల ట్రాఫిక్ జామ్ కాకుండా చూస్తున్నారు.

గుంపు తమలో తాము మాట్లాడుకుంటున్నారు. గొణుక్కుంటున్నారు. సణుక్కుంటున్నారు. తిట్టుకుంటున్నారు.

మూలుగుతున్నారు. ముక్కుతున్నారు. చీదుతున్నారు.

కొందరు నోటికి, ముక్కుకు పైతుళ్ళ కొసలను, పమిట చెంగులను అడ్డు పెట్టుకుంటున్నారు.

పోలీస్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్, సబ్-ఇన్‌స్పెక్టరు రోడ్డు ప్రక్క గుంపులో నుంచి రోడ్డుమీదకు వచ్చారు.

ఈపాటికే డ్రయివరు కారునుంచి దిగి,వెనుక డోర్ తెరచి నిలిచాడు నమ్రతగా.

కలెక్టరు కారునుంచి కాలు కింద పెట్టాడు.

కారునుంచి దిగుతున్న కలెక్టరును హఠాత్తుగా చూడగానే పోలీసు ఉద్యోగులు తెల్లబోయారు. తడబడినారు.

సెల్యూట్ కొట్టారు.

చిరునవ్వుతూ విష్ చేశాడు కలెక్టరు పూర్తిగా దిగి. ఏమిటి అన్నట్టు నొసలతోనే ప్రశ్నించాడు.

కలెక్టరుకు కించిత్ చిరాకుగా వున్నది. హైదరాబాద్‌కు త్వరగా వెళ్ళాలి.

మధ్యలో కారుకు బ్రేక్ పడవలసి వచ్చింది.

"యాక్సిడెంట్ సర్!" టోపీని సర్దుకుంటూ సర్కిల్ అన్నాడు.

"రాత్రి జరిగింది సార్. ఏ లారీయో, బస్సో, కారో ఏదోకాని మొత్తానికి గుద్దేసిందండి కుర్రాణ్ణి. చచ్చిపోయాడండి. మెగడు బ్రెటకు వచ్చేసిందండి.

దొండపండులాంటి కుర్రాడండి, దొరబాబులా వున్నాడండి. వయస్సు ఇరవై మూడు - ఇరవై అయిదు సంవత్సరాల మధ్య వుండవచ్చునండి.

సైకిల్‌మీద వెడుతుండగా యాక్సిడెంట్ జరిగిందండి. సైకిల్ ఒక పక్కకి, కుర్రాడొక పక్కకి పడిపోయారండి. కుర్రాడకి వళ్ళంతా గాయాలేనండి.

గిలగిలా తన్నుకు చచ్చిపోయి వుంటాడండి. అంతా నెత్తురు మడుగేనండి...."

సబ్-ఇన్‌స్పెక్టర్ చకచకా చెప్పుకుపోతూ చేరుమాలుతో నుదుటి చెమటను తుడుచుకుంటూ తక్కున ఆగిపోయాడు.

"మాకు ఇంతకు ముందే తెలిసింది సార్. ఎంక్వయిరీ ప్రారంభించాం సార్. ఫొటోలు తీయిస్తున్నాం సార్, పెర్ల గుర్తులు, నెత్తురు మరకలు, సైకిల్ పడివున్న తీరు, శవం దొర్లి పడిన పద్ధతుల ననుసరించి చూస్తే రాత్రి యాక్సిడెంటు చేసింది లోడ్ వేసుకున్న లారీ అని, అది విజయవాడ వైపుకు వెళ్ళి వుంటుందని అనుకుంటున్నాం సార్.

క్వార్టర్స్‌కు వెళ్ళగానే అన్ని పోలీస్ స్టేషన్‌లకు, చెక్‌పోస్టులకు ఇన్‌ఫర్‌మేషన్ పంపి పూర్తిగా ఎంక్వయిరీ చేస్తాం సార్"

సర్కిల్ ఇన్‌స్పెక్టర్ చెప్పుకుపోతున్నాడు.

"శవాన్ని గుర్తించడానికి ఇంత వరకు ఎవరు రాలేదు సార్. ఈ పల్లెకు చెందిన యువకుడు మాత్రం కాదు సార్. ఎవరయినదీ మొత్తానికి తేల్చుకోకుండా వుండం సార్; యువకుణ్ణి చూస్తుంటే జాలివేస్తుంది సార్"

"ఎంక్వయిరీ ఇప్పుడే ప్రారంభించాం సార్"

"ప్రొసీడ్" కలెక్టరు టైమ్ చూసుకుంటూ అన్నాడు.

"ఎస్సర్!" సర్కిల్ టోపీ సర్దుకున్నాడు.

"క్విక్" కలెక్టరు గుంపును చూస్తూ అన్నాడు.

"ఎస్సర్...."

"శవాన్ని ఒక్కసారి చూస్తారా సార్!" సర్కిల్ ఆసక్తిగా అడుగుతూ అడుగు కదిలాడు.

"నోనో. టైమ్ లేదు. టూ లేట్" అంటూనే డోర్ వైపుకు కదిలాడు కలెక్టరు. కదులుతూనే కాలు కారు లోపలికి పెట్టాడు.

"ఒక్కసారి చూడండి సార్....!"

"నో స్టేజ్ ....నో టైం.."

అంతవరకు దానినే అంటిపెట్టుకుని వున్న డ్రయివరు డోర్‌ను వేసి ముందుకు వెళ్ళి తన సీట్లో కూర్చున్నాడు.

"స్టార్ట్" ఉత్తర్వు చేశాడు కలెక్టరు.

"శవాన్ని ఏం చేయమంటారు సార్? వాసన కొడుతున్నది సార్."

"తీయించేయండి - పోనివ్-....బై"

కారు కదలగానే పోలీసు అధికార్లు సెల్యూట్ కొట్టారు.

కలెక్టరు చిరునవ్వుతూ విష్ చేశాడు.

కారు కదిలింది.

కారు వెనుక కుర్రకారు పరుగెత్తబోయి, పోలీసులను చూస్తూ ఆగిపోయారు.

పోలీసు ఉద్యోగులు గుంపు వైపుకు నడిచారు.

పోలీసులు గుంపును చెదరగొడుతున్నారు.

ఈపాటికే రాబిందు ఒకటి వచ్చి ప్రక్కనే వున్న చెట్టు కొమ్మమీద వాలి కిందకి పైకి చూస్తున్నది.

* * * *

కలెక్టరు తమ రెసిడెన్సియల్ బంగళా ముందు లాన్స్‌లో కుర్చీలో కూర్చుని శూన్యంలోకి చూస్తున్నాడు. చూస్తూ ఆలోచిస్తున్నాడు.

ఎటో ఆలోచిస్తూ, ఎటో చూస్తున్నాడు.

కలెక్టరు కుర్చీ చుట్టూ మరి నాలుగు కుర్చీలు వున్నాయి. అయిదు కుర్చీల లోను కలెక్టరు కుర్చీ కలెక్టరు కుర్చీవలెనే కనిపిస్తున్నది. చూస్తూ చూస్తూ మరొక రెవరు దానిలో కూర్చోలేరు.

మధ్యలో టీపాయ్ వున్నది. టీపాయ్ మీద ఒకటి రెండు పేపర్లు వున్నాయి. పేపర్లు లేవబోతున్నాయి కాని, గాలి చాలక లేవలేకపోతున్నాయి.

ప్రకృతి స్తంభించినట్లు వున్నది.

ప్రకృతి ఎలావున్నది కలెక్టరుకు అంతుబట్టడంలేదు.

తను విన్నది.... తను విన్నది....

ఆయన మనసు, మనసులో ముసురుకుంటున్న ఆలోచనలు శూన్యంగా వున్నాయి.

శూన్య మనస్కుడు శూన్యంలోకి చూస్తున్నాడు.

అంతా శూన్యం. జగమంతా శూన్యం.

"గుడీవినింగ్ సర్!"

కలెక్టరు ఉలిక్కిపడినాడు. భారంగా కనులు తిప్పాడు.

కనులు తిప్పుతూనే లేచాడు.

ఎదురుగా జిల్లా పోలీసు సూపరింటెండెంట్, సర్కిల్ ఇన్‌స్పెక్టరు, సబ్-ఇన్‌స్పెక్టర్లు. ఒక సబ్ చేతిలో చేతి సంచి.

"వెరీ గుడీవినింగ్. రండి రండి, కూర్చోండి. చూడనే లేదు. సారీ, ప్లీజ్, టేక్ యువర్ సీట్స్" అంటూనే ఎస్.పి.కి షేక్‌హాండ్ చేస్తూ కూర్చున్నాడు.

ఎస్. పి. టోపీ సర్దుకుంటు కూర్చున్నాడు.

మిగిలిన వారు కూర్చోలేదు. కలెక్టరు వారినీ కూర్చోమన్నాడు.

ఈసారి ఎస్. పి. కూడా సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌కు కుర్చీ చూపాడు. సర్కిల్ సబ్‌ఇన్‌స్పెక్టర్‌కు కుర్చీ చూపుతూ కూర్చున్నాడు.

సబ్‌ఇన్‌స్పెక్టర్లుకూడా కూర్చున్న పిదప కలెక్టరు బంట్రోతుని పిలిచి "చాయ్" చెప్పాడు.

"చెప్పండి, ఏవిటి?" అన్నాడు యధాలాపంగా కలెక్టరు.

పోలీసు అధికారులు మౌనం నహించారు.

గాలి మౌనవ్రతం పూనింది. నిస్తబ్ధత.

పోలీసు అధికారులు ఒకరి ముఖా లొకరు చూసుకున్నారు.

అందరు కలెక్టరు ముఖంలోకి చూశారు.

ఆయన ముఖం అలిసిపోయినట్టు కనిపించింది.

ముడతలలో చిరుచెమట కనిపిస్తున్నది.

"మీరు చాల అలసిపోయారు" ఎస్. పి. మెల్లిగా అన్నాడు.

కలెక్టరు చిరునవ్వాడు. ఆ నవ్వులో జీవం లేదు.

ఆయనలోకూడా వున్నట్టు లేదు. ఆయన మనసులో....

"యాక్సిడెంట్ కేసు దర్యాప్తులో కొంచెం ముందుకు వెళ్ళాం సర్" ఎస్. పి. మెల్లిగా సంభాషణకు ఉపక్రమించాడు.

"ఏం యాక్సిడెంటు?" కలెక్టరు ప్రశ్నించాడు.

"సూర్యాపేట సమీపాన రోడ్డుమీద జరిగిన యాక్సిడెంట్ సర్. తమరు హైదరాబాద్ వెడుతూ మొన్న...."

సర్కిల్ మాటను మధ్యలోనే తుంచాడు కలెక్టరు:

"ఎస్. యస్. ఎవరా యువకుడు?"

"శవాన్ని....పోస్ట్‌మర్టం చేయించాం. హాస్పిటల్ హెడ్‌క్వార్టర్స్‌లో భద్ర పరిచాం సర్." సబ్‌ఇన్‌స్పెక్టరు కదులుతూ అన్నాడు.

"ఆ యువకుడికి సైకిల్ తొక్కడం సర్దా సార్. అప్పుడప్పుడు సైకిల్ పోటీ లలోకూడా పాల్గొంటూ వుంటాడు సార్.

ఆ రోజున హైదరాబాద్‌లో అద్దె సైకిల్ తీసుకున్నాడు. సైకిల్‌మీద నల్ల గొండ వెళ్ళి ఇంత టైమ్‌లో రాగలనని హైదరాబాద్‌లో పందెం వేశాడు.

బయలుదేరి ఈప్రమాదంలో ప్రాణాలను కోల్పోయాడు సర్...."

ఎస్. పి. చెప్పడం ఆపాడు. జేబురుమాల తీసి ముఖం తుడుచుకున్నాడు.

తుడుచుకుంటూ కలెక్టరు కనులలోకి చూశాడు.

ఆ కనులు శూన్యంలో దేనికోసమో అన్వేషిస్తున్నాయి.శూన్య ధృక్కులు.

తను విన్నది.... తను విన్నది....

ఎస్.పి. సర్కిల్ ముఖంలోకి చూశాడు. ఆయన కొద్దిగా కదిలి కూర్చున్నాడు.

విదానంగా పెదవి కదిల్చాడు:

"హైదరాబాద్‌లో ఆ సైకిల్‌షాపు ఆసామినుంచి ఎంక్వయిరీ మొదలెట్టాం సర్. యువకుని పేరు తెలిసింది. అతని ఇంటి ఫోన్ నెంబరు తెలిసింది. అతను ఎవరైనదీ తెలిసింది సార్...."

సర్కిల్ ఒక్క క్షణం ఆగి, టోపీ సర్దుకుంటూ మళ్ళీ అన్నాడు: "యువకుడు నల్లగొండ నివాసి సర్. అతను గళ్ళ పై జామా, లాల్చీ ధరిస్తాడు సర్. అతని ఫోన్ నెంబర్.... మీదే సార్. అతని పేరు జగన్మోహనరావు.

అతని తండ్రి జిల్లా కలెక్టరుగారు. అతని బిట్టలు - ఇవిగో...."

అంటూ ఒక సబ్-ఇన్స్పెక్టరు తన చేతిసంచిలోని నెత్తురు దుస్తులను టీపాయ్ మీద పెడుతూ ఒకసారి కలెక్టరు ముఖంలోకి చూశాడు. తృప్తిపడినాడు.

ఎస్. పి. తన అధికార్లను చూశాడు. వాళ్ళు తడబడుతూ లేచారు....

కలెక్టరు ....



జంతు ప్రదర్శనశాల

ఈ నగరం నాకు కొత్త.

నాకే కాదు. ఈ నగరానికి వచ్చేవారందరికీ ఇది కొత్తదే.

ఇది నగరం. మహానగరం. నవనాగరికాన్ని పులుముకొన్న నాజూకు నగరం.

ఈ కొత్త నగరం ఒక కొత్త ప్రపంచం వంటిది.

ఈ నగరం నిమిషాలపై నడుస్తుంది.

ప్రపంచం ముంచుకుపోతున్నట్టు, తన వేనుకనే అణ్వాయుధ మేదో ప్రేలిపోయినట్టు, ఆ క్షణం వినా అసలు మరొక్క క్షణం లేనేలేనట్టు ఇక్కడి మనిషి హడావుడి పడిపోతుంటాడు.

ఈ నగరం నవ్వుతున్నదో, ఏడుస్తున్నదో తెలీదు. ఇక్కడ నవ్వూ ఏడుపూ జేబురుమాలు చాటునే వుంటాయి.

ఇక్కడి నాగరికత మనిషి నితారుగా నిలచి ఊపిరి పీల్చుకోవడానికి వ్యవధి నివ్వదు. ప్రక్కవాడు చస్తున్నా ఎవడు పట్టించుకోడు.

నాలుగు రోజులుగా నగర వీథులను తుడుస్తున్న నా పైజమా చెంగుకు కోపం వచ్చింది. పాదానికి కాలికి మధ్య మడతపడింది.

పడిపోబోయి, పదడుగులు ముందుకు వెళ్ళి నిలవగలిగాను.

జానెడు బెత్తెడు పైజమా ముక్క ఉక్రోషంతో ఉడికిపోతూ ఊడిపోయి, దుమ్ముకొట్టుకుంటుపోయి, పులివిస్తరితో కుస్తీపడుతున్న కుక్క ముట్టెమీద పడింది.

కుక్కకు కోపం వచ్చింది. అందునా వీథి కుక్కేమో-ఇట్టే కోపం వచ్చింది.

తన జన్మహక్కును నేనేదో అపహరించబోతున్నా ననుకొన్నది.

బస్తీ కుక్కలకు తమ హక్కుల విషయం బాగా తెలుసు.

బయ్యో.... మంటూ ఒక్క ఉదుటున ముందుకు గెంతుక వచ్చింది.

దాని పళ్ళను, కోపాన్ని, కసిని, ఆకారాన్ని చూసి, అది నన్ను తప్పక చీల్చి చెండాడుతుం దనుకొన్నాను. కాని, ఏమనుకొన్నదో ఏమో, వచ్చినంత వేగం గానూ వెనుక కాళ్ళ బలంమీద ఆగిపోయి, తల వంచుకొని వెనక్కు వెళ్ళిపోయింది.

తను బస్తీ కుక్కనని అది బుజువుపరచుకొన్నది.

ఆది కిరుస్తుందనే భయంతో కెవ్వున అరవబోయి, పిదప నవ్వబోయి, కొక్కెర తగిలిన కోడిపుంజువలె నీరసంగా మెడ తిప్పుకున్నాను.

ఎదురుగా కనిపించింది తాటికాయలంత అక్షరాలతో బోర్డు :

"జంతు ప్రదర్శనశాల"

బోర్డును చూస్తూ ఫక్కున నవ్వాలనుకున్నాను. కడుపులో ప్రేవులు మడత పడినట్టు నొప్పి గుండెపైకి తన్నింది. నవ్వే యత్నం నీరుగారిపోయింది.

విచిత్రమయిన ఈ కొత్త ప్రపంచంలో ఈ బోర్డు వింతగానే వున్నది.

జంతువుకు అనువాదమయిన మనిషి జంతువును విడిగా ఒకచోట వుంచి ప్రదర్శించడం అధునాతన నాగరికతా లక్షణమా ?

జంతువుతోపాటు మనిషినికూడా బోనులో వుంచి ప్రదర్శించితే....!

చిత్రకారుని అసంపూర్ణ ఇంద్రధనుస్సువలె వున్న ఆ బోర్డు మీదినించి కిందికి మళ్ళింది నా చూపు. వాడిచూపులవంటి నా చూపులు ఒక వ్యక్తిమీద నిలిచాయి.

దృష్టిబొమ్మవలె, పురాతత్వ పరిశోధకునివలె గేటు ప్రక్కనే వున్నాడతను.

ఒక చేత తుపాకి, ఒక చేత కాలుతున్న బీడీ.

వగలాడిలా పొగలారిపోతున్న ఆ బీడీని చూస్తుంటే ఒక దమ్ము పడితే బాగుండు ననిపించింది. జేబులు తడుముకున్నాను. ఒక్క బీడీముక్కా లేదు.

పట్కారులవంటి పళ్ళమధ్య బీడీని బిగించుకొని నన్ను పిలుస్తున్నా డతను. నన్నేనా పిలచేది? నా వెనుక వున్న మరెవరి నయినానే మోనని వెనక్కు-చూశాను.

పులివి స్తళ్ళను పిచ్చిపిచ్చిగా చించి పారవేస్తున్నది గజ్జికుక్క. అది వినా మరెవరు లేరు నా వెనుక. కనుక, నన్నేనన్నమాట! తిరిగి ఇటు తిరిగా.

అతను చేతిని ఊపుతూనే వున్నాడు! అలా రూఢి చేసుకున్న పిదప, బీడీ ఇస్తాడో, గేటు ముందు నిలచినందుకు బొమికలు విరగదన్నుతాడో అనుకొంటూ జంకుతూనే వెళ్ళాను. బిత్తరబోతూ వెళ్ళాను.

ఒకసారి గట్టిగా, ఘాటుగా బీడీ దమ్ములాగి, బీడీని చిరిగిన బూటు మడం కింద వేసి తొక్కుతూ పొగతోపాటు ఆవలించాడు.

ఆవలిస్తూ చిటికవేశాడు. చిటిక వేస్తూ తుపాకిని బుజం మార్చాడు.

* * * *

బిక్కు-బిక్కుమంటూ బిత్తరపోతున్న నన్ను చూస్తూ- మీసం మెలివేసుకొంటూ 'మన నామధేయం బెయ్యది?' అన్నాడు.

తెల్లబోయాను. అయినా, పేరు చెప్పాను.

'నిరుద్యోగివై నీల్గు చుంటివా?' అడిగాడు నన్నే ఎగాదిగా, ఏకదీక్షగా, వక్రగతిన ఓరగా చూస్తూ. ఔనన్నట్టు తల తిప్పాను.

'అబ్బురంబుగాదు అబ్బాయి! ఈ పుణ్యభూమిలో ఉద్యోగాన్వేషణా చిత్తులై దారి తెలియనిఁ బ్రవరులం బోలు యువకుల ననేకులఁ జూచితి. ఏ యాశ్రమమున నుంటివి-గృహస్థాశ్రమమునా, బ్రహ్మచర్యా శ్రమంబునా?'

చెప్పాను.

'తలంచితి దలంచితి. ధూమపానము సేతువా?' అంటూనే బీడీని అందించాడు.

మారు మాట్లాడకుండా తీసుకున్నాను, అతనే వెలిగించాడు.

ఇతనెవరు? పగటి వేషధారా? పిచ్చాసుపత్రినుంచి పారిపోయి వచ్చినవాడా? సి. ఐ. డి. యా? లేక వింత మృగమా?

అతనిని చదవడానికి ప్రయత్నిస్తుండగానే, 'అస్మద్రాజాస్థానంబున యుద్యోగంబు నిప్పించెద, కడుంగడు జాగరూకుండవై జేసికొందువా?' అని అడిగాడు ప్రశ్నార్థకం గుర్తు పెదాలతో.

ఆకాశం తిరిగి తిరిగి విరిగి విరిగి నా నెత్తినే పడిందా అనిపించినది, 'ఉద్యోగం చేస్తావా?' అని ఎదుటి వ్యక్తి నన్నడిగేటప్పటికి.

ఇది కలా, ఇంద్రజాలమా, హేళనా అనిపించింది.

అది ఏదయినా కాని, ఉద్యోగం కోసమే తిరుగుతున్న నన్ను, నిరుద్యోగానికి బ్రాండ్‌మార్క్ అయిన నన్ను ఒక వ్యక్తి 'ఉద్యోగం చేస్తావా?' అని అడిగేటప్పటికి నా వళ్ళు జలదరించింది.

'బాబూ! ఇదుగో నా డిగ్రి. మీ పాదాల ముందు వుంచుతున్నాను. మీరే మయినా చేయండి, చేయించండి. మీదే భారం. నాకు మాత్రం....'

ఏదో ఏదో అనబోయాను. ఏమీ అనలేకపోయాను.

గుండె బరువెక్కింది. గొంతు పూడిపోయినది.

దశాబ్దాల దుఃఖస్రవంతి కట్టలు త్రెంచుకు ప్రవహించింది.

'ఊరడిల్లు మూర్ఖడిల్లము వత్సా! నీ దుఃఖాబుధి నా గుండియలఁ గరగించు చున్నయది. నీకున్ యుద్యోగంబు వేయించెద, రమ్ము నా వెంబడి....!' అంటూనే నా దండిచేతిని గట్టిగా పట్టుకొని చకచకా లోనికి లాక్కుపోయాడు.

మేము లోనికి వెడుతుండగా, మా దారికి ఇరువైపులవున్న బోనులలోని జంతువులు నవ్వుకోవడం నా కంటపడింది.

అవును. జంతువులకుకూడా విచారం, సంతోషం అనే అనుభూతులు వుంటా యిగా మరి!

లోనికి_ బంగళాలోకి తీసుకువెళ్లాడు. అధికారికి పరిచయం చేశాడు. వెంటనే నా కర్మకు నన్ను వదలి తన దారిన తను వెళ్ళిపోయాడు!

* * * *

అధికారి మాట సప్తస్వరాన్వితం.

"మంచిని. మీకు ఉద్యోగం కావాలా? వినండి. ఉదయం సాయం సమయా లలో ఉచితంగా భోజనం పెడతాం. జీతం నెలకు రెండు వందల రూపాయలు, వారం వారం బట్వాడా. వారానికి ఏదోఒకరోజున సెలవు, శని, ఆదివారంలో మాత్రం సెలవలు పుండవు. ఏ కించిత్ పొరపాట్లు జరిగితే కాల్చి అవతల పారేస్తాము. అడిగే వారుండరు ఏమంటారు?"

"చిత్తం! అంగీకరిస్తున్నాను." అన్నాను వెంటనే.

ఉద్యోగం అంటూ ఒకటి దొరికిందసలు. అది చాలు నాకు అనుకున్నాను. ఉబ్బి తబ్బిబ్బయాను. ఈ విషయాన్ని వెంటనే ఇంటికి తెలియచేయాలి.

అధికారి నా ముందు ఒక ఫారం వుంచాడు. కలం చేతికి అందిస్తూ సంతకం పెట్టవలసిన చోటును చూపాడు.

"సంతకం పెట్టు. ఇదుగో అడ్వాన్స్. రేపు ఉదయం ఆ రింటికి డ్యూటీలో ఉండాలి." అన్నాడు. డబ్బును తీసి నా ముందు పెడుతూ.

"నా ఉద్యోగం ఏమిటో, దాని హోదా ఏమిటో, చేయవలసిన...."

"పనేమి లేదు. సంతకం పెట్టి ఈ డబ్బు తీసికోండి. రేపు గంటన్నర ముందుగా వస్తే, ఇప్పుడు మిమ్ము తీసుకువచ్చినవారే మీకు నటనను నేర్పుతారు.

అయన గొప్ప పౌరాణిక, జానపద, చారిత్రక, సాంఘిక నటుడు.

మీరు రోజుకు ఎనిమిది గంటలపాటు ఈ జంతు ప్రదర్శనశాలలో బోనులోని భల్లూకమైపోవాలి...." అంటూనే సిగరెట్ ఆఫర్ చేశాడు.

సిగరెట్‌ను కాల్చి ఎన్నిరో జులయింది; అడ్వాన్సు నా చేతి వ్రేళ్ళను తాకింది.

ఇకపై నేను పగటిపూట భల్లూకాన్ని....

అవును. తప్పదు. ఏదో ఒకటి చేయవలసిందే.

కూటికోసం కోటి విద్యలు....

ఘట్టిగా, ఘాటుగా నాలుగు దమ్ములు-సిగరెట్ లాగాను. అడ్వాన్స్ అందు కొన్నాను. ఇన్ని రూకలు చూసి ఎంత కాలమయింది....

సంతకం పెట్టేశాను.

ఇకపై నేను భల్లూకాన్ని. జంతువును. మనిషిని కాను.

మనిషితత్వంగల జంతు జీవిని....

తరువాత తరువాత తెలుసుకొన్నాను-ఈ జంతు ప్రదర్శనశాలలోని జంతు వులు అన్నీ నిరుద్యోగులయిన మనుషులే....

ఈ నగరంలో....



కవిగారి కళ్యాణం

ఒక వూరు. వూళ్ళో బ్రహ్మచారి. బ్రహ్మచారి పేరు కవిగారు.

కవిగారి అసలు పేరు బహుశః ఆయనకూడా మరచిపోయే వుంటాడు. కవిగారి పేరు కవిగారే!

ఒకొక్కరికి ఆ విధంగా పేరు పడిపోతుంది పల్లెటూళ్ళలో. ఏ పేరయినా సరే ఒకసారి పెట్టడం అంటూ జరిగిన తరువాత ఆ పేరు మరి మాయడం అనేది పల్లెటూళ్ళ చరిత్రలో ఎక్కడ లేదు.

ఎల్లమ్మ భర్త పుల్లయ్య అంటే అతను ఎంత గ్రంథసాంగు డయినా, ఏ చరిత్రకారుడు వ్రాసినా అతగాని నామధేయం ఎల్లమ్మ భర్త పుల్లయ్యే.

ఎల్లమ్మ చనిపోయినా అతను ఎల్లమ్మ భర్త పుల్లయ్యే.

బ్రహ్మచారి కవిత్వం వ్రాస్తాడు కనుక సదరు వ్రాయసగాడు కవిగారయాడు.

కవిగారు కమనీయమయిన గాయకుడు కూడాను. కథలను—హరికథలను—చెప్పడంలో ఆయనకు ఆయనే సాటి!

బ్రహ్మచారి భాగవతారు భాగవత కథాకాలక్షేపం కొరకు పదామడల దూరం నుంచి కూడా దేవుని పెళ్ళికి అందరు పెద్దలే అయిన కార్యక్రమ నిర్వాహకులు ఈ 'భాగవత పంచానన'ను వెతుక్కుంటూ వస్తారు.

కవిగారు సకాలానికి సరదాగా వెళ్ళి సలక్షణంగా కథాగాన మొనర్చి, కంట్రాక్టు నాలుగు రాళ్లే కాక మెచ్చుకోళ్ళు, దుశ్శాలువలు, కీంకిణులు, బిరుదావళులు వగైరాలను మూట కట్టుకు మోసుకు తెచ్చుకుంటాడు.

కవిగారి కథలన్నీ స్వీయ రచనలే. రుక్మిణి కళ్యాణం, సుభద్ర పరిణయం, సీతా రామ జననం – అదిగాగల వెన్నో శతాధికంగా వ్రాసిపారవేశాడు. వాటినే మార్చి మార్చి మరల మరల మధురంగా, సుమధురంగా చెప్పుకుంటూపోతాడు.

బ్రహ్మచారి మేధావి. అంతకన్న మిన్న అయన సహృదయుడు. సరళ స్వభావి.

పెద్దలలో పెద్ద, పిన్నలలో పిన్న, యువకులలో యువకుడు. ఆబాల గోపాలం మన్ననలను, మందహాసాలను పొంది గ్రామం తలలో నాలుకగా ఆయన రూపొందాడు.

కవిగా ఆయన రాణించినా, భాగవతారుగా ఓరుదావళులు, సన్మానాతుల నెన్నో పొందినా పుట్టు దరిద్రుడుగానే మిగిలిపోయాడు.

దరిద్రుడి పెళ్ళికి వడగళ్ళ వాన పడుతుందేమో అని భయంపడి పెండ్లి ప్రస్తావననే పైకి వెళ్ళగక్కడం లేదు. బ్రహ్మచారి.

పెండ్లి చేసుకొనవలెననే కోర్కె ఒకవిధంగా అతనిలో నిదురపోయింది.

అది నిరాశకు, విరక్తికి మరొక రూపం.

దారిద్ర్యానికి ప్రత్యక్ష ఫలితం.

"ఏం కవిగారు! బ్రహ్మచారి ముదిరినా బెండకాయ ముదిరినా చిక్కే!" అన్నాడు ఒక మట్టమధ్యాహ్నంవేళ ఆ వూరి మునసబుగారు.

ఆ వేళ క్రోసెడు దూరాన వున్న ఓ కుగ్రామానికి వెళ్ళి, అప్పటికి ఏదో సంభావనం తెచ్చుకుంటున్నాడు కవిగారు.

ఆ ఏటి ఒడ్డున, ఆ మామిడి తోపువద్ద మునసబుగారు కనిపించాడు. అలా తళలించాడు.

మునసబుగారు గ్రామ పెద్దలకు పెద్ద. స్థితిపరుడు. భోళామనిషి. కార్యవాది. గ్రామంలో-ఆమాటకొస్తే ఆ పరగణాలో-ఆయన ఎంత చెబితే అంతే.

మునసబుగారి పెత్తనంలో ఆ చుట్టు ప్రక్కల గ్రామీణులు కోర్టుల కెక్కడం దాదాపు మరచిపోయారు.

ఎటువంటి తగాయిదాల నయినా మునసబుగారే తీర్చివేస్తాడు. ఆయన తీర్పుకు మరి ధోకా లేదు. ఉభయ పక్షాలకు ఆయన మధ్యవర్తే.

ఆయన మాటే మాట. అంత నిష్పక్షపాతి. వ్యవహారదక్షుడు ఆయన మరి!

"పెద్దలు పట్టీపట్టనట్టు వూరుకుంటే మరి చిక్కే!" చమత్కరించాడు కవిగారు.

"ఆఁ . హ్హాఁ....!" అనుకొన్నాడు మునసబుగారు.

మునసబుగారికి కవిగారి పట్ల అభిమానం వున్నది.

కవిగారు తెలివితేటలు కలవాడేనని ఆయన గట్టి నమ్మకం. వృద్ధిలోకి రావల్లసిన వాడని దీవన.

తనకు పనేమీ లేనపుడు కవిగారిని ఇంటికి పిలిపించుకొంటాడు మునసబు గారు. కచేరి చావడి వద్దకు కూడా పిలిపించి పది మంది పెద్దల ముందు పురాణాల గురించిన గోష్టి నడుపుతాడు.

పది పద్యాలను పది రాగాలలో పది భాణీలలో పది రకాలుగా పాడిస్తాడు.

చింత చెట్టుకింద, చెఱువు గట్టుమీద, గుడివద్ద - అన్ని చోట్ల అందరు కవి గారితో గోష్ఠులను కొనసాగిస్తుంటారు.

కవిగారు తమ కలుపుగోలుతనంతో ఊరందరిలో ఒకరయ్యాడు.

ఆయన 'ప్రజల కవి'. ఊరకవి.

మాఖిడి తోపులోనుంచి ఊరువైపుకు బయలుదేరారు కవిగారు, మునసబుగారు.

పాపర పొదలను, కాలువ గట్టును దాటేంతవరకు ఇరువురు మౌనంగా, ముభావంగానే వున్నారు.

'మీ కళ్ళ ముందు పుట్టి, మీ కన్నుల ముందే పెరిగినవాడిని. నాకు అండదండలుగా తమరు, తమబోటి మన వూరిపెద్దలు వినా నాకు 'నా' అనేవారు మరెవరు లేరనే విషయం మీకు తెలియని సంగతి కాదుకదా? ఊళ్ళో ఒక్కొగానొక్క కవిగాణ్ణి. మీ అందరి ఆదరాభిమానాలతో బ్రతుకుతున్న వాడిని.

ననొక్క ఇంటివాడిని చేయడంతో పెద్దలు ఏమరచారు...'

మునసబుగారు కవిగారి ముఖంల్లోకి చూశాడు. నిశితంగా చూశాడు.

ఆయన నిమ్మకాయ మీసాలు నవ్వాయి.

కవిత లల్లడంలో కవిగారివలెనే పెళ్ళిళ్ళను చేయించడంలో మునసబుగారూ పేరందినవాడు.

'ఇహ నీ జన్మలో పెళ్ళి కాదు' అనుకొనిన యువతీ యువకులకు తన ఎరుకలోనే మునసబుగారు పూనుకొని పెండ్లయిన దనిపించిన విషయం కవిగారికి తెలుసు.

మునసబుగారు స్వయంగా నాలుగు అక్షతలు వధూవరుల శిరసులమీద విదల్చితే చాలు, ఆ దంపతుల దాంపత్య జీవనానికి జీవితాంతం మరి తిరుగు వుండదని ఆ వూళ్ళో నమ్మిక. గట్టి నమ్మిక.

'పెళ్ళి కావాలా కవిగార్కూ?' అడిగాడు వ్యవ్యతూ మునసబుగారు. అంటూ చిటికెన వ్రేలితో మీసం మెలిపెట్టుకున్నాడు.

'నవ్వులాటకాదు బాబాయిగారూ నేననడం! ఏదో గంతకు తగిన బొంత అన్నట్టు, ఎవరో ఒకరిని కట్టుకొనకుంటే బండి నడిచేట్టు లేదు. ఇంత వండి వార్చడానికి.... 'అంటూనే కవిగారు సిగ్గిలిపోయాడు.

పెండ్లి ఎప్పుడు, పప్పన్నం ఎప్పుడు పెడతావు అంటూ పెక్కుమంది ప్రశ్నించేవారే కాని, హూనుకుని, తనకు పెండ్లయిన దనిపించేవారు ఒక్కరూ లేరు. తను ఏకాకి.... తనకు తెలిసినవారు పట్టించుకోరు.

'ఊఁ....!' అన్నాడు మునసబుగారు నిదానంగ.

ఈపాటికి ఊరు రానే వచ్చింది.

మునసబుగారి నోటివెంట ఆ 'ఊఁ!'శబ్దం ధ్వనిస్తేనేచాలుఅనుకొన్నాడు కవిగారు.

కవిగారి నేత్రాలు సంతోషాతిరేకంతో కెంపెక్కాయి. పెదాలు వణికాయి.

హుషారు హెచ్చింది. గుండె తేలికపడింది.

మునసబుగారు తలచుకొంటే చాలు- తన కళ్యాణం జరిగినట్టే లెక్క. ఆయన మాటంటే చాలు, అది మాటే.

దిలాసా చిక్కిన కవిగారికి ఖులాసా వచ్చింది.

ప్రేళ్ళను కదలిస్తూ కూనిరాగం తీయబోయి, అంతలోనే ప్రక్కన మునసబు గారు వున్నట్టు గుర్తించి ఆ ప్రయత్నాన్ని విరమించుకున్నాడు.

'ఎంతోకాలంనుంచి తమ చెవిన ఈ మాటను వేయవలె ననుకొంటునే వున్నాను. సిగ్గుపడుతున్నాను. పెద్దలు- తెలియనిదేఁ వున్నది ? ఈ విషయంలో ఇహ పూర్తి బాధ్యత మీదే.

పట్టించుకొనే వారే లేరు నాకు. నా బ్రతుకు ఎడారిగానే వుండిపోయింది.

ఏదో- మీ చేతిమీదుగా నాలుగు అక్షతలు వేయించి ఒకింటివాణ్ణి చేస్తే....'

ఆందోళనగ, ఆదుర్దాగ, ఆర్ద్రంగా అనివేశాడు కవిగారు.


అని, ఆకాశం వైపుకు చూశాడు.

మునసబుగారు నవ్వాడు. మళ్ళి చిరునవ్వాడు.

ఈసారి కవిగారుకూడా నవ్వాడు.

పిల్లకాలువ నవ్వింది. పచ్చగడ్డి నవ్వింది.

నవ్విన నాపచేను పండింది !



* * *

మునసబుగారు మరునాడు మాయమయ్యాడు. ఏమయిపోయాడో, ఎప్పుడు ఎక్కడకు ఎందుకు వెళ్లాడో ఎవరికీ తెలియదు.

ఎవరికీ చెప్పలేదు. ఇంట్లోనూ చెప్పలేదు.

చెరువు గట్టున గుడ్డల మూటతో ఎదురయిన చాకలి రామితో మాత్రం తను వూరుకు వెడుతున్నట్టు ఇంటివద్ద చెప్పమని చెప్పాడు.

రామి రాత్రికి కాని చెప్పలేదు. చేతిలో గొడుగు మాత్రమే వున్నదట.

మరునాటి సాయంత్రానికి సుడిగాలిలా వచ్చాడు.

వచ్చీరావడమే ఇంటికయినా వెళ్ళకుండా చెట్టుకింద కూర్చుని గ్రామంలోని మిగిలిన పదిమంది పెద్దలకు కబుర్లు పంపాడు

ఎల్లమ్మ భర్త పుల్లయ్యగారి వాముల దొడ్లో అప్పటి కప్పుడే- సంధ్య చీకటి మాసిపోయిని పిదప- పెద్ద తలలు పదీ గుసగుసలాడుకున్నాయి.

కొంతసేపటికి అక్కడికి కవిగారిని కూడా ఉరుకులు పరుగులమీద ఉన్నవాడిని వున్నట్టే రావించారు.

తను ఎందుకు మాయమయింది, ఊరు విడచి వూరుకువెళ్లి ఏమి చేసుకవచ్చింది అక్కడ అందరికి వివరించాడు మునసబుగారు.

ఈ విషయంలో తన స్వీయాభిప్రాయాన్ని కూడా వివరించి, కర్తవ్యాన్ని నిర్దేశిస్తూ విపులీకరించాడు.

కావలసిన కార్యాన్ని గంధర్వులే తీర్చే కథను ఆసాంతం విని, చెవులు రిక్కించి, తల పంకించి, నొసలు ఎగుశవేసి, కనులు చిట్లించి మునసబుగారి అభిప్రాయాన్ని అందరు ఏకగ్రీవంగా బలపరచారు.

'సై' అంటే 'సరె!' అన్నారు.

ఊళ్ళోని పెద్దతలలు పదీ 'ఊ' కొడితే, ఇంక ఎదురేముంటుంది?

కవిగారి గుండె గుబగుబలాడింది. ఆశలతో నవనవలాడింది.

పొడారిన ప్రేమ పొంగి ఉప్పొంగినది. అనురాగం అందల మెక్కింది.

ఆవేశం కూనిరాగం తీసింది. చేతి వ్రేళ్ళు లయ కదిలాయి.

వయసు పెటపెటలాడింది.

ఆ రాత్రికి రాత్రే ఆబాలగోపాలానికి తను చేయబోయే పనిని బహిరంగ రహస్యం చేశాడు మునసబుగారు. తన మాటను కాదనరనే విశ్వాసం ఆయనకు పూర్తిగా వున్నది.

గ్రామంపట్ల ఆపాటి విశ్వాసం ఆయనకు లేకుంటే అసలు కథను ఇంతదూరం రావిచ్చేవాడే కాదు!

మునసబుగారు చేయదలచుకున్నది విని బిట్టతలలు 'ఔరా!' అన్నాయి.

నీలాటిరేవు 'వహ్వా!' అంది.

యువకులు 'ముసలాడి పట్టు మరి !' అనుకొన్నారు.

పిల్లలు 'భలే భలే' మన్నారు.

ఎవరు ఎన్ని విధాల వ్యాఖ్యానించుకొనినా బహిరంగ రహస్యం రహస్యంగానే వుండిపోయింది.

అందరు తనకు వినా మరెవరికీ ఈ పరమ రహస్యం తెలియదనే అనుకున్నారు.

తన విషయంలో ఇంత కట్టుదిట్టంగా కట్టడి ఏర్పడడం చూసిన కథానాయకుడు కవిగారే ముక్కుమీద వ్రేలిడుకున్నాడు !

మునసబుగారు వెళ్ళింది తోటలోని తవిటయ్యగారి ఇంటికి.

తవిటయ్యగారు ఫలానా వూరు మోతుబరులలో ఒకరు. నిక్షేపంవంటి మాగాణి గడ్డ ఓ పాతికెకరాలు, పది మామిడి తోటలు, మరింత మెట్టసాగు వున్నది.

రొక్కం నాలుగయిదు లకారాలకు మించే వుండి వుండవచ్చునని ఆ గ్రామీణ ఆర్థికవేత్తల నిశ్చితాభిప్రాయం.

తవిటయ్య మాటకారి. మంచి వ్యవహర్త.

చుట్టుప్రక్కల గ్రామాలలో 'మంచి మధ్యవర్తి'గా గణుతికెక్కి, కీర్తి ప్రతిష్టలను భుజస్కందాల మీదనే మోసుకుంటున్నవాడు.

చుట్టూ పదిమంది ఏ క్షణాన వుంటూ వుంటూనే వుంటారు. పాలాల పను లన్నిటిని స్వయంగా పర్యవేక్షిస్తుంటాడు.

ఆయన కనుసన్నలను తప్పుకొని పచ్చగడ్డి పిలకకూడా పోదు.

ఆయనకు వారసులుగా, వంశాంకురంగా లేకలేక కలిగిన 'అల్లారి పట్టి' ఒక్కగా నొక్క కూతురు మాత్రమే వున్నది.

కూతురయినా, కొడుకయినా ఆమెగానే ఆయన అపురూపంగా పెంచాడు.

ఆకూన పేరంకట నాగలక్ష్మి ప్రసూనాంబ నామధేయురాలు. అయిదవ తరగతి వరకు ఊర బడిలోనే చదివింది. వ్యక్తురా లయాక ఇంటివద్దనే తెలుగు, ఆంగ్లం, సంగీతం చెప్పించుకొన్నది.

చక్కటి వర్చస్సుతో చకచకా పెరిగి-పెళ్ళికి ఎదిగి కూర్చున్నది.

తవిటయ్యగారికి బంధుకోటి తక్కువ లేదు. బంధువులలో ఎవరితోను వియ్యమందడానికి ఆయన సిద్ధంగా లేరు.

కాటివద్ద గుంటనక్కలవలె తన ఆస్తికోసం వారంతా వేచివున్నారని ఆయన దృఢాభిప్రాయం. కనుక, చుట్టపక్కాలలోకాక, దూరపు బంధుత్వాన్ని ఏర్పరచుకోవలెననే సంకల్పంతో ఆయనవున్నాడు.

ఆరేడు నెలలక్రితం ఒకసారి రాచకార్యంపై పట్టణం వెళ్ళాడు తవిటయ్య.

అక్కడికే అదే కార్యార్థం వచ్చాడు మునసబుగారు.

పొగాకు పొయద్వారా ఇరువురికి పరిచయం అయింది. పరిచయం పరిఢవిల్లినది.

ఆ పవలు, ఆ రాత్రికూడా ఒకరిని ఒకరు విడవకుండా ఒక కంచంలో తిని, ఒక్క మంచంపై పడుకొన్నంతగా కాలక్షేపించారు. ఆత్మీయతను పంచుకొన్నారు.

ఒకరి వూరు పరిస్థితులను ఒకరు, ఒకరి స్థితిగతులను ఒకరు, ఒకరి గౌరవాన్ని ఒకరు వందిమాగధులద్వారా క్రోలుచుకొన్నారు.

ఒకరిని ఒకరు అర్థం చేసికొన్నారు.

ఆ సందర్భంగానే తవిటయ్యగారు తనకు ఒక్కగానొక్క ముద్దులపట్టి వున్నట్టు, గుణవంతుడు, స్థితిపరుడు అయిన వరుడు కావలెనన్నట్టు మునసబుగారికి సూచనప్రాయంగా అందించాడు.

అటువంటి సంబంధం ఏదయినా తెలియవస్తే తనను దాటిపోనీయనన్నట్టు మునసబుగారిచేత చేతిలో చేయి వేయించుకున్నాడు తవిటయ్యగారు.

'మీరు మరచిపోరు కదా, మరి!' అని మునసబును హెచ్చరించాడు తవిటయ్య తుది వీడ్కోలులో, డ్రైవరి పొగాకు పాయ పంపకంతో.

అదుగో- ఆ మాటను పట్టుకొని- ఇప్పుడు అక్కడకు వెళ్ళివచ్చాడు మునసబుగారు. కవిగారి గురించి తవిటయ్యగారికి చెప్పాడు.

-ఈ సంబంధం-తవిటయ్యగారికి చాలాచాలా నచ్చింది.

పిల్లతో ఫలహారం ఇప్పించాడు మునసబుగారికి తవిటయ్యగారు-

పిల్లను చూసి, కవిగారిని తలచుకొని దీర్ఘంగా నిశ్వసించాడు.

ఆ మూడవనాడే పిల్లవాడిని చూడడానికి పిల్ల తాలూకువారిని బయలుదేర దీయించేట్టుచేసి స్వస్థలికి వచ్చాడు మునసబుగారు.

* * * *

అనుకున్నట్టే, కవిగారిని చూడడానికి మూడవనాడు నలుగురు పెద్దలతోసహా తవిటయ్యగారు స్వయంగా రానేవచ్చాడు.

గ్రామంలోకి వేంచేస్తూనే, చెరువుగట్టుమీద గుడ్డల మూటతో ఎదురయిన చాకలి రామిని నిలవేసి, ఫలానా కవిగారు ఎలాంటివాడని అడిగాడు ఒక పెళ్ళిపెద్ద.

'మా కవిగోరి యిసయవా అండి! యెందుకడుగుతార్లే! అంతుందా-కట్టుకు పోతాడా? పిల్లకి బీచ్చం పెట్టడంతే నమ్మండి- చొట్టి పిసినిగొట్టు! ఔనూ, ఆయన గోరితో మీకేంది పని బాబుగోరూ?' అడిగింది అమాయకంగా చాకలి రామి.

'ఏం లేదు ఏం లేదు, వెళ్ళు వెళ్ళు!' అంటూ ముండుకు కదిలాడు తవిటయ్యగారు. రామి ప్రత్యుత్తరంతో ఆయన కనులు మెరిశాయి.

కుర్రవాడు పొదుపుగాడని తేల్చుకున్నా డాయన:

'మంచి శకునం!' గొణిగాడు ఒక పెద్ద.

ఊళ్లోకి ప్రవేశించగానే ఆలమందను తోలుకుపోతూ నలుగురు గొడ్లకాపరులు ఎదురయ్యారు. వాళ్ళనుకూడా కదిపి చూదాం అనుకున్నారు పెద్దలు.

'ఎవరివయ్యా ఇవి?' వారిలో ఒకరిని ఒక పెద్ద అడగనే అడిగాడు ఆలమందను చూపిస్తూ.

'మా ధొరవోరియ్యుండె!' తక్కున జవాబిచ్చాడు ఒక కాపరి.

'బావుంది నీ జవాబు! మీ దొరగా రెవరయ్యా!' అడిగాడు వేరొకతనిని ఇంకొక పెద్ద.

'ధొరవారుండి! తెల్దేటండి! ఇంకెవరు, కవిగోరు!' అన్నాడతను సగర్వంగా మీసాలను దువ్వుకొంటూ.

'సరి సరి!' అని అందరు ముందుకు కదిలారు.

తవిటయ్యగారు మరొకసారి, ఇంకొకసారి, వేరొకసారి వెనక్కి తిరిగి ఆలమందను చూశాడు. అది కనిపెట్టిన ఒక పెద్ద చమత్కరించాడు:

'ఇంకేం చూస్తావులే రాఁవయ్య బవ! నక్కతోకను తొక్కి వచ్చావులే ఒకటి రెండేళ్ళాగినా నీవంటి నావంటి మోతుబరుల్ని నలుగురిని నిలబెట్టి కొనివేసే అల్లుడినే సంపాదిస్తున్నావులే!'

తవిటయ్యగారి నొసలు నిలువెత్తున లేచి నిలచాయి.

ఊరు మధ్య పెద్దవీధిలో సుగాలీ తండా ఎదురయింది. వాళ్ళనెత్తిన గోతం మూటలు వున్నాయి.

వాళ్ళలో పెద్దగా కనుపించే బొద్దుమనిషిని పిలిచి, 'ఏఁవిటి ఈ మూటలలోవి? ఎక్కడనుంచి మీరు?' అని ప్రశ్నించాడు మరొక పెద్ద, నిదానంగా, రహస్యం ఏదో వెలికితీస్తున్న ధోరణిగ.

'దొరగోరి గాదెకాడినుంచి బాబూ! దొరవోరి పొలాలు కాపలాకాసే వోళ్ళం. తిండిగింజలు కొలిపించుకు పోతుండఁవ్' అంటూనే ఆ సుగాలి పొన్నుకర్రను మూటకు మోపెడుతూ కదలబోయాడు.

'ఎవరు మీ దొరగారు?' ఆదుర్దాగా అడిగాడు తవిటయ్యగారే ఈసారి.

'ఇంకేరు బాబూ– మా పాల్దేఁవుడు– మా కామందోరు– కవిగోరు!' అన్నాడు మరొక లంబాడీ, సగర్వంగ, పెద్దగా.

పెళ్లి పెద్దలు నలుగురు కనులతోనే పలుకరించుకున్నారు.

ఒకరి చెవులు ఒకరు కొరుక్కున్నారు. గుసగుస లాడుకున్నారు.

గ్రామకచేరి చావడి వద్దకు వచ్చేటప్పటికి మునసబుగారు ఎదురయ్యాడు.

ఆయనతో పదిమంది పెద్దలు!

'రండి రండి! తమరి రాకకోసమే ఎదురు చూస్తున్నాం!' అంటూ స్వాగతించారు ఈ పెద్దలు ఆ పెద్దలను.

'ప్రథమం— కవిగారి లోగిలికి వెడదామా, చావిడి దగ్గరకు వెళ్ళి పహదేవ సంతతిని చూసివద్దామా?' అడిగాడు నమ్రతగా మునసబుగారు.

'అక్కర్లేదు. చూశాం. పదండి— వియ్యాలవారింటికే' అన్నాడు ఒక పెళ్లి పెద్ద— తమను స్వాగతించడానికి వచ్చిన పెద్ద లందరి హుందాతనాన్ని పరిశీలిస్తూ.

అంతా కలిసి కవిగారి ఇంటికి వచ్చారు.

అప్పటికే వాళ్లూ వీళ్ళూ అంతా కలిసి రెండు పాతికలకుపైగా అయారు.

కవిగారిది ఒక ఇల్లు అనేకంటె ఒక లోగిలి, ఒక దేవిడి, ఒక కోట అనవలసి వుంటుందని పెళ్ళి పెద్దలు తమలో తాము వ్యాఖ్యానించుకున్నారు.

ఆకోటవంటి దివాణంముందు పెద్దపెద్ద కుప్పలవంటి పురులు నాలుగు వున్నాయి.

ఇవికాక అపరాల బస్తాలు లోగిలినిండా మేటలుపేసి వున్నాయి.

ఎదురుగా రెండు పొగాకు బ్యారన్‌లు.

ఇంటివద్ద కవిగారు ఎదురయాడు.

ప్రథమ వీక్షణంతోనే కవిగారు పెళ్ళి పెద్దల నలుగురి దృష్టిలోను, తవిటయ్య గారి హృదయ కుహరంలోను తిష్ఠవేశాడు— స్వరద్రూపంతో, వాక్చాతురితో.

'దయచేయండి, దయచేయండి! అయిదుగురేనా వచ్చింది? అయిదు గుడిసె బండ్లనిండా అయినా వస్తారేమో అనుకొన్నాను— మా మునసబు చెప్పినదానిని బట్టి. ఏమయ్యా మునసబూ—ఏరీ? స్వారీ బళ్ళేవీ రాలేదే? సరి సరి! మా ఫలహారాలూ అవీ దండుగయిపోయా యనుకోండి! ఎంత నష్టం!'

కవిగారి వినయం, కలిమి, ఆప్యాయత, హుందాతనానికి అచ్చెరువందారు అందరు— మునసబుగారితోసహా!

'రండి. విశ్రాంతి తీసుకోండి. చౌదరిగారూ, రెడ్డిగారూ, నాయుడమ్మగారూ— లేవండి మరి! అయ్యా మీరూ లేవండి, మీరూను— మా వియ్యాలవారితోపాటు కాళ్ళు కడగాలి, చేయి తుడవాలి.

'పోలిగా, వెంకన్నా, రాముడూ— ఎక్కడ చచ్చారురా— దారి చూపించండి. తుళ్ళ కట్ట వూడదీశారా?' హడావుడి చేశాడు కవిగారు.

ఉపాహారానంతరం ఒకరి కొకరు పరిచయంచుకున్నారు:

మునసబుగారు, పెద్దలు, తవిటయ్యగారు, ఆయన పెద్దలు ఇష్టాగోష్ఠిగా ప్రత్యేక గోష్ఠిజరిపారు,

మాటా మంతీ ముచ్చటిగా కొనసాగిపోయాయి.

సాయంత్రం పెళ్ళి పెద్దలు వెళ్ళిపోయేటప్పుడు వారిని సాగనంపడానికి గ్రామ పెద్దలందరు సమాయాత్తు లయారు.

అంతా చెయివు కట్టి ఎక్కిన తరువాత వలెవాటుఐను, తలగుడ్డలను సరిచేసి కుంటూ ఓ క్షణం నిలిచాడు.

"ఇందాక మీరు కవిగారి భూమి, పుట్ర ప్రస్తావన తెచ్చారు కదూ! ఇదిగో చూడండి - ఈ తూర్పున-అదుగో ఆ చూపు అనేమేర ఈ చెయివు కింది మాగాణి సాగంతా కవిగారిదే. చెయివుకూడా వారి సొంతమే!" అంటూ చేతి కర్రతో అటూ ఇటూ రెండు డోపులు డోస్తూ చూపాడు మునసబుగారు. రెండవ చేతిని నుదుటి మీద ఎదుటి పొద్దుకు అడ్డు పెట్టుకుంటూ.

"అక్కర్లేదు. ఇందాక అలా అడిగినందుకే నాలుక కొరుక్కున్నాను!" అన్నాడట్లు మునసబుగారి చెవిలో తవిటయ్యగారు- ఆయన దక్షణంగా తిరిగి ఇంకా ధేనినో తన గొడుగు కర్రతో చూపబోతుండగ.

* * * *

అంగరంగ వైభవంగా కవిగారి కళ్యాణం అయినది.

కవిగారి వైభవాన్ని, వైభోగాన్ని, మాంధాతను మెచ్చుకుంటూ, ఊరూ-నాడూ వేనోళ్ళ పొగడుతూ పెండ్లికి తరలివెళ్ళి పిల్లను తీసుకుని ఇంచక్కా వచ్చివేశారు.

ఆయన స్వగ్రామంలో- కవిగారి కార్య-పూరిపాక ముందు పాదం మోపవలసి వచ్చింది.

"ఇక్కడ నించున్నా రేవిటి? ఇదేవైనా కవిగారి గురువుగారి ఇల్లా?" అడిగారు పిల్లతోపాటు వచ్చిన పెద్దలు- ఉత్సుకతతో.

"కాదు. ఇదే కవిగారి కంచుకోట!" అన్నాడు కవిగారి తరపు పెద్ద ఒకరు.

"మొన్న మేమొచ్చినప్పుడు చూచిన లోగిలి...."

"అది మాది!" అంటూ ముందుకు వచ్చాడు పెద్దిరెడ్డి పెద్దరెడ్డిగారు.

"ఆ ధాన్యం, అపరాలూ అవీ మావివేలే!" అన్నాడు వెంటనే, ఆ ప్రక్కనే వున్న నాయుడమ్మగారు.

"ఆవులన్నీ మావేలే!" అన్నాడు నగుళ్ళోరి పెద్దగారు.

"కవిగారు కప్పుకున్న బింగరు జరీ సరిగంచు పట్టుకుచ్చుల కండువా నాకు నా పెళ్ళిలో అత్తగారు పెట్టింది!" అంటూనే ఒక కాపు యువకుడు కవిగారి వలెవాటును కాస్తా ఊడబెరుక్కుపోయాడు.

"మొన్న మీరు తిన్న పండ్లన్ని పీరు సాయిబుగారి వంతు విరాళం!"

'ఆ పొగాకు, విస్తళ్ళ పేరయ్య శ్రేష్టిగారి విరాళం.'

ఇంత పచ్చి మోసం జరుగుతుందని ఆ పెళ్ళి పెద్దలు కలలోకూడా వూహించుకొని వుండరు. వాళ్ళ గాలిమేడలన్నీ కూలిపోయాయి.

దానితో వాళ్ళు కస్సుమన్నారు. గ్రామస్తులు బుస్సుమన్నారు.

పరిస్థితి విషమించే సూచనలు కనుపించగా, నిదానంగా పెళ్ళికూతురు ముందుకు వచ్చాడు మునసబుగారు.

"అమ్మాయి! నా పేరు కర్ణాటి మల్లయ్య చౌదరి. ఈవూరు మాజీ మునసబుని. ఈ పెళ్ళి చేయించిన సూత్రధారుణ్ణి నేనే.

చదువూ సంస్కారంగల పెద్దింటి పిల్లవు. ఆలోజించు.

మేము నిజంగానే వేయి అబద్దాలాడాం. కవిగారి కళ్యాణం కావించాం.

కవిగారు మేలిమి బంగారం. ఎందునా ఆయనకు వంక లేదు. మా గ్రామం అంతా కవిగారి వెనుక వుంది. ఆయన ఉత్తముడు. జగ మెరిగిన బ్రాహ్మణుడు.

అయితే, వెనుక ఎవ్వరూ లేరు ఒంటరి.

ఆయనకు సరస్వతీ కటాక్షమే వున్నది కాని లక్ష్మీకటాక్షం కరవయింది. ఆయన కళ్యాణంతో ఆయన కటిక దారిద్ర్యంకూడా తొలగవలెననే వుద్దేశంతోనే ఇంత నాటకం ఆడాం. సాక్షాత్తు లక్ష్మీ దేవి వయిన నీవే కదలి వచ్చావు.

నీవు తెలివిగలదానవు. ఆలోజించుకో "

పై తుండుతో కనులను ఒత్తుకున్నాడు మునసబుగారు.

కవిగారి భార్య ఆలోజించింది. ఆమె లక్ష్మీ.

ఆమె నేత్రాంచలులలో తేజస్సు ఓలలాడింది. భర్త కనులలోకి చూసింది.

అవి కన్నీటితో జలక మాడుతున్నాయి! లక్ష్మీ చిరునవ్వింది.

కవిగారి పాదం బొటన వ్రేలిని తొక్కింది. చేతి చిటికెన వ్రేలిని మెలివేసుకుని ఆ చిన్న పూరింటి గుమ్మంలోనుంచి లోనికి అడుగు పెట్టింది!

ఒక వూరు....





ఒక రాత్రి కథ

రాము పన్నెండేళ్ళవాడు. మహా వుంటే ఒకటి రెండు నెలలు అటు ఇటుగ వుండవచ్చునేమో.

కించిత్ బొద్దుగ, ఛలాకీగ వుంటాడు. నడకా అంతే.

పైగా మాటకారి. నిర్మొహమాటి.

ఆ రోజులలో – రాము నాకు పరిచయ మయిన రోజులలో – నేనొక సర్కస్ కంపెనీలో నౌకరిని. రౌతును.

నేను ఏకాకిని. 'నా' అనేవారు ఎవరు లేరు. ఇప్పుడూ లేరు....

మా సర్కస్‌లో గుట్టం గింగిరాలు కొట్టినట్టు జీవితం చుట్టు పరిభ్రమించి ఎక్కడ బయలుదేరానో అక్కడికే తిరిగి చేరుకుంటుండేవాడిని.

బ్రతుకే సర్కస్ అయింది.

మా సర్కస్ కంపెనీ ఆ నగరానికి వచ్చి అయిదు రోజు లయింది.

మా కార్యక్రమం ప్రకారం ఇంకా రెండు వారాల వరకు మా కంపెనీ ఆ నగరంలోనే వుంటుంది.

ఆ రోజున - అయిదవనాడే అనుకుంటాను- రాము నాకు పరిచయ మయాడు.

సర్కస్ గుడారానికి వెనుక భాగంలో నా స్వారీ గుఱ్ఱానికి మాలిష్ చేసి కొంటున్నాను. రాము అక్కడ ప్రత్యక్ష మయాడు నవ్వుతు.

కంచె దాటి, మా అధీన ఆవరణంలోకి రావడానికి సాధారణంగా ఎవరు సాహసించరు, వీలు వుండదు.

సర్కస్ గుడారాలలోకే కాదు, మేము మకాం వున్న ఆ నిశాల ప్రాంగణంలోకి అయినా సరే మెయిన్ గేటులోనుంచి రావలసిందే. అక్కడ పగటిపూటకూడా గూర్ఖా కాపలా వుంటుంది.

మరి రాము లోనికి ఎలా రాగలిగాడు?

"ఏయ్....ఎవర్నువ్? ఎలా వచ్చావ్? ఎవర్రానిచ్చారు?" కేకలు వేశాను.

నా అరుపుతో రాము కొంచెం జంకినట్టే వున్నాడు. అక్కడే- నాకు పదడుగుల దూరంలో- నిలచిపోయాడు.

ప్రధమంలో జంకినట్లు బిక్క ముఖం వేసినా, అంతలోనే తేరుకున్నాడు. ఒక్కసారి చుట్టు కలియచూశాడు, చుట్టు ప్రక్కల మరెవరు లేరు.

అది కనిపెట్టినట్టు- భయాన్ని అణచుకొంటున్నట్టు- చిరునవ్వు నవ్వాడు.

అతని స్థూల స్వరూపాన్ని, జంకు గొంకులు లేని ఆ చిరునగవును చూచి ఆశ్చర్యపోయాను.

అయినా, అధికారయుతంగా "ఏయ్, ఇటురా!" అని అరచాను బిగ్గరగ.

కదిలీ కదలనట్టు మెదలకుండా ముందుకు వచ్చాడు.

పిల్లడు చూడ ముచ్చటగా వున్నాడు. ధైర్య సాహసాలు కలవాడుగా కనిపిస్తున్నాడు. ముఖంలో ఏదో ఆకర్షణ.

అతనిని చూస్తున్నకొలది నాలో ఏదో ఆత్మీయత, ఆర్ద్రత పొడసూపుతున్నది. సంస్కారం లేని జుత్తు, అతుకుల నిక్కరు, జీరాడే చొక్కాయి, వంటిమీద దుమ్ము. దారిద్ర్యం కొట్టవచ్చినట్టు కనుపిస్తున్నది.

"నమస్తే, నేను రాముణ్ణి" అన్నాడు.

తనకు తానుగా సగర్వంగా పరిచయించుకున్నాడు.

"మీరు గుఱ్ఱంమీద స్వారీ చేస్తుంటే భలేగా వుంటుందిలే, నేను రోజూ చూస్తున్నానుగా" అన్నాడు ఫోజా పెడుతు.

కుర్రనిలోని కలుపుగోలుతనం నన్నాకర్షించింది. దానిని పైకి కనుపించనీయక, "ఎటునుంచి వచ్చావిక్కడికి?" ఆడిగాను నొసలు విరుస్తూ.

"అటుగా!" అంటూ వ్రేలితో చూపాడు.

కంచెకు కుక్కలు, పందులు ఏర్పరచిన కంత వంటి దొకటున్నది త్రోవవలె. దానిలోనుంచి దూరి వచ్చాడు.

అయితే, ఎందుకు వచ్చినట్టు? దొంగతనానికి కాదు కదా!

దుస్తులనుబట్టి చూస్తే పిల్ల దొంగ వలెనే కనుపిస్తున్నాడు. కాని, మాట తీరు, ముఖ వర్చస్సునుబట్టి చూస్తే అలా అనిపించడంలేదు. కాని....

'మీ స్వారీ రోజూ చూస్తున్నాను.' అన్నాడు మళ్ళీ రాము.

'ఏనుగుల కంటె, ఎలుగుబంటుల కంటె, సైకిళ్ళకంటే మీ గుట్టం దొడ్డు భలేగ వుంటుందిలే!' యాక్షన్ చేశాడు హుషారుగ.

అదీ నిజమే. ఒకొక్కరికి ఒకొక్క ఫీట్ నచ్చుతుంది. అందరికీ అన్నీ నచ్చవు. కాని, ఈ రాము సెన్నేదో ఉబ్బించడంలేదు కదా!

'అలాగా! అయితే రోజూ సర్కస్ చూస్తున్నానన్నమాట!' అన్నాను, చిరునవ్వుతూనే, ప్రోత్సాహకరంగ.

'ఆఁవ్! మీ స్వారీ చూడ్డానికే రోజూ టికెట్ కొనుక్కొని వస్తున్నాను.' అన్నాడు చేరువకు వస్తూ.

ఒకటి రెండు సార్లు మాట్లాడేటప్పటికే నేనంటే అదివరకు వున్న భయం అతనికి పోయినట్టుగా వున్నది!

'ఏం చదువుతున్నావ్?' అడిగాను కుతూహలంగ.

'ఏం చదవడంలేదు!' చాల తేలికగా తక్కున అన్నాడు.

'మీ ఇల్లెక్కడ?'

'ఈ వీధి దాటి, పెద్ద బజారుకు వెళ్ళి, అక్కడనుంచి గుడివద్దకు వెళ్ళి, దాని వెనుక ఎడంవైపు సందు తిరిగి....'

'మీ నాన్న పేరేవిటి?'

'ఏమో నా కేం తెలుసు?' అన్నాడు తక్కున. ఆశ్చర్యపోయాను.

"మా అమ్మకు తెలుసేమో!" అన్నాడు వెంటనే, ఎంతో చనువు వున్నట్టు.

జవాబు అయితే వెంటనే ఇచ్చాడే కాని, ఆ జవాబు చెప్పేప్పుడు అతని ముఖం గంభీరాకృతిని దాల్చినట్టు కనిపించింది.

"ఏఁవిటో...! ప్రతి ఒక్కరు మీ నాన్న పేరేవిటని అడుగుతారు. నాకు చాల మంది నాన్న లున్నారు. మా ఇంటికి వచ్చిన వారి నెందరినీ చూపిస్తూ "అడుగో మీ అయ్యొచ్చాడు. చద్ది అడుక్కొని పోయి ఆడుకో." అంటుంది మా అమ్మ.

వాళ్ళ పేర్లు మాత్రం ఒక్కరూ చెప్పరు. అడగ్గానే డబ్బులు మాత్రం ఇచ్చేస్తారు. అడిగినా చెప్పరు.... నేను సర్కస్‌కి వచ్చేస్తాను...."

రాము చెప్పుకుపోతున్నాడు. అవేమీ వినిపించుకోవడంలేదు. రాము చెప్పిన మొదటి మాటే నన్ను విచలించింది.

చాలామంది నాన్నలు ఉండడ మేమిటి?

"మీ అమ్మ పేరు?" అడిగాను క్షణం ఆగి.

"హూన్, తెలియదేంటీ, అందరికి తెలుసు, నీలవేణి," అన్నాడు ఏదో విచిత్రాన్ని వివరించి చెబుతున్నంత గొప్పగ.

నీలవేణి, నీలవేణి ...

ఎక్కడో. ఎప్పుడో పేరు వినినగుర్తు.

నా ఆలోచనలను తెంచివేస్తూ అడిగాడు రాము: "సార్, పది పైసలు కావాలి, ఇవ్వరూ? ఇవ్వాళ నలభై పైసలే దొరికాయి. మీ టికెట్టేమో అర్ధ రూపాయిగా."

ఈ అడగడంతో రామును పరిశీలనగా చూశాను.

ఎంత చూసినా రాము అరం కావడమే లేదు.

ఇంతలో సర్కస్ రింగ్ మాష్టర్ ఇటే రావడం కనిపించినది.

వెంటనే నా పేంట్ జేబులో చేయి పెట్టాను. పది పైసల బిళ్ళ కాబోలు వ్రేళ్ళకు చిక్కింది.

ఆ నాణాన్ని రాము అరచేతిలో పెడుతూ 'వెళ్ళిపో రామూ, వెళ్ళిపో, రింగ్ మాష్టర్ వస్తున్నాడు' అన్నాను గాభరాగా-నిదానంగానే అయినా దాదాపు అరచినట్టుగా.

రాము దానిని అందుకొని పరుగెడుతూ, వెనక్కు వెనక్కు తిరిగి బిత్తర బిత్తరగా చూస్తూ కంచె దాటాడు ఆతురతగ.

* * * *

ఒక్కొక్క మనిషి ఒక్కొక్క విచిత్ర జీవితానికి ప్రతిబింబం.

నాది ఒక రకమయిన జీవితం. మా మానేజరుది ఒకవిధమయిన బ్రతుకు. మా రింగ్ మాష్టర్‌ది వేరొక రకం జీవితం. రింగ్ గరల్ రిమ్మీది ఒక రకం జీవితం.

రాము తల్లి నీలవేణి ఒక రకం....

రింగ్ మాష్టర్ రామును చూశాడు. పారిపోతున్న అతనిని చూస్తూ నవ్వుడి గాడు: "ఎవడాడు?"

"వా డెవడో నాకు తెలియదు. పేరు మాత్రం రాము అట."

నా జవాబుతో రింగ్ మాష్టర్ కనుబొమలు ముడతలు పడినాయి.

మరి, నేను మాత్రం అంతకంటె ఇంకేం చెప్పను?

రింగ్‌మాష్టర్ ముక్కోపి. మొరటి. ఆయన తత్వం నాకు బాగా తెలుసు. నే నిచ్చిన జవాబు మరీ కఠినంగా వుంటే కమ్మీతో రెండు ఉతికినా ఉతుకుతాడు. నా నౌకరీ అలాంటిది.

నేను బానిసను, అతను ప్రభువు.

"వాడి కిక్కడేం పని? ఎవర్రానిచ్చారు? ఎప్పుడొచ్చాడు? ఎందుకొచ్చాడు? ఎటు వచ్చాడు? ఏమిటీ మాట్లాడుతున్నావ్?"

ఇదీ వరస. నే ననుకొన్నట్టే ఊపిరి పీల్చుకోనీయకుండా అడగడం ప్రారంభించాడు.

జవాబు గట్టిగా, కఠినంగా చెబితేనేకాని- అది మరొక విధంగా పరిణమించినా- ఆ ఘోరణి కట్టువడదు. మేఁమేఁ అంటు నీళ్ళు నమిలితే మరింత రెచ్చిపోతాడు.

"ఎందుకు వచ్చాడో నాకు తెలియదు. వచ్చాడు. ఎలా వచ్చాడోకూడా తెలీదు, వచ్చాడు. ఎప్పుడు వచ్చాడో అసలు తెలియదు. నా గుట్టానికి మాలిష్ చేస్తూ తలెత్తేప్పటికి అదుగో అక్కడున్నాడు. తెలిసిందాండి- అక్కడ! పలకరించాను. మాట్లాడలేదు. రెట్టించి, గద్దించి అడిగాను. తన పేరు చెప్పాడు. తండ్రిపే రడిగాను. తెలియదన్నాడు. తల్లి పేరడిగాను. నీలవేణి అన్నాడు. ఇంతలో మీరు రావడం చూచి పారిపోయాడు. అదుగో- అటుగా పారిపోయాడు. మీరు చూశారుగా- అటు! అయ్యా, అదీ జరిగింది!"

నా జవాబుతో రింగ్‌మాష్టర్ ముఖం ముడతలు పడడం పోయి ఫాలభాగం మీద ఆశ్చర్యార్థకా లనేకం ఆవిర్భవించసాగాయి.

టిన్నులోనుంచి సిగరెట్ తీసుకొని కాల్చి ఘాటుగా రెండు దమ్ములు లాగాడు, రెండు క్షణాలపాటు తిరిగి నిలిచి, బొజ్జ నిమురుకున్నాడు. మీసం మెలిపెట్టుకున్నాడు. నన్ను చూశాడు.

"తల్లి పేరేఁవి టన్నాడు?"

"నీలవేణి"

"నీలవేణి?"

"నీలవేణి!"

"హూఁ..! వాడు మళ్ళీ వస్తే పట్టి నాకు అప్పగించు." హుకుం జారీచేసి

వెళ్ళిపోయాడు. మనిషిలోని అంత కోపం ఇంతలోనే ఏమయిందో తెలీదు.

నా జవాబు ధోరణికి తగ్గాడో, నీలవేణి పేరు విని నెమ్మదించాడో అర్థం కాలేదు. రామును పట్టివ్వాలట. ఏం చేస్తాట్ట? కట్టి కొట్టి కొరతవేస్తాడా?

ఒట్టి కరోక్కటకపు ముండాకొడుకు. అంత పని చేసినా చేస్తాడుకూడాను.

రాము! ఎంత అందంగా వుంటాడు! ఎంత తీయగా మాట్లాడుతాడు!

అయినా- అతని జీర్ణవస్త్రాలు, మట్టిగొట్టుకున్న దేహం, అతణ్ణి 'వాడు' గానే వుంచుతున్నాయి.

రాము నిరుపేద అని, నిర్భాగ్యుడని తెలుస్తూనే వున్నది. అయినా రోజు ఏదో ఒక విధంగా సర్కస్ చూస్తున్నాట్ట.

దీనిని బట్టి రాము గాలి తిరుగుళ్ళకు పూర్తిగా అలవాటయాడనే అనుకోవచ్చు. తండ్రి ఎవరోకూడా తెలియదట.

ఎంత భయానకమైన జీవితం!

సరిగా నా దారినే బయలుదేరా డన్నమాట....!

ఆ చిన్న హృదయం ఎవరి అనురాగానికి నోచుకొనక పసితనంనుంచే కకావికలవుతున్నది. పెద్దవా డయాక ఎలా పరిణమిస్తాడు?

రౌడీ, మోసగాడు, తాగుబోతు, జూదరి, సోమరి కావచ్చు. లేదా నావలెనే ఏందుకూ కొరగాని బండ జీవితం ఎక్కడో నిశబ్దంగా, నీరసంగా, ఏకాకిగా ఈడ్వవచ్చు.

మరునాడు మళ్ళీ వచ్చాడు రాము.

నిన్నటికంటె చొరవగా హుషారుగా వున్నాడు. వచ్చీ రావడమే తనుకూడా గుట్టానికి మాలిష్ చేయబోయాడు. అది తల విసిరింది. సకిలించింది.

వింటున్నానా! వినడంలేదా అనికూడా చూడకుండా అతను ఆ కబురు ఈ కబురు వసపిట్టలా వాగేస్తున్నాడు.

తన మాటలకు తనే మురిసిపోతూ మధ్య మధ్య కేరింతలుకొడుతున్నాడు.

ఒక్క రోజు పరిచయంతోనే ఇంత చొరవ తీసుకున్నందుకు మనసులోనే అయినా రామును అభినందించకుండా వుండలేకపోయాను.

ఇంత కలుపుగోలు రామును, ఇంత హుషారయిన పిల్లడిని ఆ కరోక్కటకుడికి ఎలా అప్పగించను?

రింగ్ మాస్టర్, అతని ఆజ్ఞ జ్ఞాపకం రాగానే రామును గురించి భయపడినాను.

రాముకు విధించే శిక్షను తలచుకొని వణికిపోయాను.

పసివాడు అనయినా తలచకుండా ఎంత కఠినాతి కఠినంగా అయినా, ఎంత ఘోరంగా అయినా హింసించవచ్చు....!

'రామూ ! వెళ్ళిపో, వెంటనే వెళ్ళిపో ! రింగ్‌మాస్టర్ చూశాడంటే బొమిక లిరగ్గొట్టేస్తాడు. చెమడా లొలిచేస్తాడు' అన్నాను, నిదానంగ.

వాడికి నా మాట ఆశ్చర్యంగా తోచింది. "ఎందుకు ? నేనేం తప్పుచేశాను ? నన్నేమీ చేయడు మీ రింగ్ మాస్టర్. ఆయన చాల మంచివాడు. నిన్న పారిపోతూ చూశానుగా! ఇంత లావు బొజ్జ, ఇంతింత మీసాలు, బోడిగుండు_ భలేగా వున్నాడులే' అంటూ అభినయిస్తూ నవ్వేశాడు.

అతని అమాయకతకు, ధైర్యానికి జాలివేస్తున్నది, సంతోషంగానూ వున్నది.

అయినా, తక్షణమే ఇక్కడినుంచి పంపివేయకుంటె, వాడి చావు మూడడం ఖాయం. రింగ్ మాస్టర్ కబంధ హస్తాలనుంచి, కసాయి గుండెనుంచి ఈ చెలికానిని కాపాడక తప్పదు.

'రామూ! వెడతావా, వెళ్ళవా?' గుడ్లురుమేస్తూ కసురుకున్నాను.

రాము నా కఠిన స్వరం విని బిక్కముఖం వేశాడు. ఒక్క గద్దింపుతోనే బెంబేలుపడిపోయాడు.

'ఎందుకమ్మా కసురుకుంటావ్? నిన్నేగా మనం జత కలిసింది? నా స్నేహం పనికిరాదా? డబ్బులడుగుతా ననుకున్నావా? అడగన్లే. సర్కస్ చూడనిక. ఇంకెందుకు సర్కస్ చూడ్డం? రోజూ నీ గుట్టపు స్వారీ చూడ్డానికేగా వచ్చేది! మరి నువ్వే నా స్నేహితుడి వయ్యావయ్యే! పొమ్మంటావేం?

నా స్నేహం పనిరాలేదా? నేను పనికి రాలేదా?

నే నెవ్వరికి పనికిరాను. ఇంట్లో అమ్మకీ పనికిరాను, ఇక్కడ నీకూ పనికి రాను. ఎవ్వరికీ పనికిరాను....'

రాము నేత్రాలు అశ్రుపూరితా లయాయి. గొంతు బొంగురువోయింది.

ఈ చిన్నవాడు నా మిత్రత్వాన్ని అభిలషిస్తున్నాడు.

నిజమే, నేనూ వాడిని మనసారా ప్రేమిస్తున్నాను. ముక్కూ ముఖం తెలీని ఈ బాలుడు ఒక్కరోజులోనే నా హృదయ పీఠాన్నధిష్ఠించాడు.

ఏదో ఆత్మీయత....

వేనంటె వాడిలో ఆత్మీయత ఏర్పడింది.

తనెవరికీ పనికిరాని వాడనని పరితపిస్తున్నాడు. ఎంత బరువుగా అన్నాడు!

ఇటు ప్రపంచానికి పనికిమాలిన వాడయినా అటు తల్లికికూడా కొరగాని వాడవాలా ?

ఇంత లేత మనసులో ఎంత కరడు గట్టిన విషాదం!

నేను చేయగలిగిందిమాత్రం ఏమున్నది? కేవలం ఒక నౌకరిని, అందునా బానిసవంటి నౌకరిని. రింగ్ మాస్టర్ నా యజమాని

యజమానికి ఇష్టం లేని పనిని నౌకరు చేయడం ఏం భావ్యం?

నా మనస్సు విషయం నా కెందుకు, యజమాని మనస్సే నా మనస్సు.

ఎలా అయినా సరే, రామును పంపించివేయకపోతే, అతని వల్ల హానం కాక తప్పదు,రింగ్ మాస్టర్ ఇటు వచ్చే వేళకూడా అయింది.

జేబులో చేయి పెట్టాను. అందిన చిల్లర డబ్బులన్నీ తీశాను. వాడి గుప్పిడి విప్పి పెట్టివేశాను.

'రామూ ! నా మాట విను ! వెంటనే వెళ్ళిపో. నువ్వంటె నాకు చాల ప్రేమ. ఇవిగో– డబ్బులు. రోజూ టికెట్ కొనుక్కొని వచ్చి సర్కస్‌లోనే నన్ను చూస్తూ వుండు. నువ్వంటె నాకేం కోపం లేదు. రాము ! రింగ్‌మాస్టర్ మంచివాడు కాదు. నువ్వు కనిపిస్తే కొట్టి కొరత వేస్తాడు. వెళ్ళిపో, మళ్లీ ఎపుడయినా కలసుకుందాం. మంచివాడివి కదూ....!'

వాడు నా డబ్బులవైపు అసహ్యంగా, ఏహ్యంగా, కోపంగా చూశాడు.

వాడి చూపుకు తట్టుకోలేకపోయాను.

నొసలు చిట్లించుకున్నాడు.

డబ్బులు మనిషి మమతను చంపలేవని, డబ్బులకంటె స్నేహ జీవితం ఎంతో విలువైనదని ఆ క్షణానే– తూటులవంటి వాడి వాడిచూపులతోనే– తెలిసివచ్చింది.

అయితే, ఒక మనిషి మరొక మనిషికి అందించే మమత ఎలాంటిదో ఎరుగను. అట్టి ఆత్మీయతను పంచుకోవడానికి నేను నోచుకోలేదు.

రాము ఏమనుకున్నాడో అర్థం కాలేదు. చటుక్కున వెనక్కు తిరిగి చకచకా వెళ్ళిపోతున్నాడు.

వాడు కన్నీటిని తుడుచుకొంటున్నాడు!

'ఆగు !' అంటూ ప్రత్యక్ష మయాడు రింగ్‌మాస్టర్.

భయపడినంతా అయింది. రామును ఏం చేస్తాడో తెలియదు.

వాడిని పట్టి తనకు వప్పజెప్పనందుకు నన్నేం చేస్తాడో తెలియదు. రాము పారిపోలేదు. అక్కడే నిలచి చూస్తున్నాడు.

పారిపోతే ఎంత బావుణ్ణు!

'ఇలారా!' అరిచాడు రింగ్ మాసర్.

రింగ్ మాస్టర్ కేక నా గుండెమీద పిడుగుపాటయింది.

వాడు మరెంత తల్లడిలిపోతున్నాడో!

వాడు అనుభవించబోయే శిక్షను తలచుకొంటె వళ్ళు జలదరిస్తున్నది.

వెనక్కు తిరిగి, నిదానంగా నడచి వస్తున్నాడు రాము. రింగ్ మాస్టర్ ముఖంలోకే చూస్తూ వస్తున్నాడు.

రింగ్‌మాస్టర్ చేతిలోని కమ్చీని సర్దుకొంటున్నాడు.

'రాము! వెళ్ళిపో! పారిపో! పరుగెత్తు! కంచెలోంచి గబుక్కున దూకు!' అని అరుద్దామనుకున్నాను. గొంతు పెకలడం లేదు.

రింగ్‌మాస్టర్ ఎదుటకు వచ్చి నిలిచాడు రాము. తీవ్రంగా నిలిచాడు.

మృత్యు గహ్వరంలోకి వచ్చినా వణికిపోవడం లేదేమి?

మృత్యువు ఎంత బలవంతమైనదో, క్రూరమైనదో, భయంకరమయినదో ఈ పసివాడికి తెలియదేమో!

వాడిని ఆ కిరాతకుడు కొట్టే దెబ్బలను చూడలేను. అందుచేత అక్కడినించి తప్పుకోబోయాను.

కాని, నన్ను నేనే నమ్మలేనంతగా ఆశ్చర్యపోయాను. అడుగు ముందుకు పడలేదు.

రింగ్‌మాస్టర్ మార్దవమైన కంఠం విని స్తంభీభూతుడనయాను.

'రాము! కంచెలోంచి దూరి రాకు! ఇహనించి మెయిన్ గేటులోనుంచే రా! విన్నావరు ఏమీ అనర్లే. ఊఁ...!' అని చకచకా బొజ్జ నిమిరుకుంటూ, మీసాలను మెలుపుకొంటూ వెళ్ళిపోయాడు రింగ్‌మాస్టర్.

* * * *

అవును! కొందరి తత్వాలు అలాంటివి!

ఎంత కరోకటకు లయినా వారి జీవిత కాలంలో ఎప్పుడో, ఎక్కడో, ఎందుకో ఒక్కసారయినా కరుణను వర్షించకపోరు!

మా రింగ్‌మాస్టర్‌లో- నే నెరిగిన దశాబ్ది కాలంనుంచి- నిలువెల్ల విషాన్నే చూశాను.

మనిషిలో నిలువెల్ల విషమేకాక, ఏ మారుమూలనో ఒక్క-బొట్టు అమృతం కూడా వుంటుందని ఇప్పుడే తెలిసింది.

మనుషులను అర్థం చేసికోవడం ఎంత కష్టం!

జీవితాంతం పరిశీలించినా ఒక మనిషి అసలు ఏ కొంచెము అర్థం కాడు. ఒక్కొక్క-సారి అర్థం అయినట్టు కనిపించినా మరునిమేషమే పొరపాటని తేలిపోతుంది.

మా రింగ్‌మాస్టరు విషయంలో ఇదే జరిగిందనుకొంటాను.

రాము రోజూ వస్తున్నాడు. ఏ భోజనపు వేళో అటు ఇంటివైపుకు వెళ్ళి రావడం మినహాయిస్తే, ఇక్కడే వుంటున్నాడు.

నాకు అతనికి మధ్య దోస్తి జాస్తి అయింది. రోజూ కబుర్లు అనేకం చెబుతుండేవాడు- అవసరమయినవి అనవసరమైనవి అనేకం చెప్పేవాడు.

ఉబుసుపోని పోసుకోలు కబుర్లే అధికంగా వున్నా, అతనిలోని విజ్ఞాన తృష్ణ ప్రతి పలుకులోను పెల్లుబుకుతుండేది.

తనకు చదువుకోవాలని ఉన్నదట. చెప్పించేవారు మాత్రం లేరట, చెప్పే వారూ లేరట.

వీధి బడిలోని పంతుళ్ళు ఎప్పుడు తనను చులకనగా చూస్తూ కొడుతూ తనను పలకరించడానికే అసహ్యించుకొంటారట. తనకు నచ్చినదీ కావలసినదీ ఒక్కరూ చెప్పరట.

తనకేమో పెద్దవాడయి, బాగా చదివి, విమానాలను నడపాలని వున్నదట.

తన తల్లి చదువుకు, పుస్తకాలు కొనడానికి డబ్బు లివ్వదట.

తన పేరుతో తనను మనసారా పిలవనుకూడా పిలవదట తల్లి. పైగా, తిడుతుందట. బండబూతులట.

ఆమె పాలిటి శనిలా దాపురించా డంటుందట.

ఇవన్నీ చెప్పుకొంటూ వెక్కి-వెక్కి ఏడ్చేవాడు రాము.

ఒక్కొక్క రాత్రి సర్కస్ అయాక నాతోపాటే నిద్రపోయేవాడు.

మా రింగ్‌మాస్టరు ఒకటి రెండుసార్లు తమ ఇంటివద్ద కూడా కనుపించాడట. ఆయనతో మాట్లాడేటప్పుడు తనను దగ్గరగా రానిచ్చేదే కాదట వాళ్ళ అమ్మ. చేతిలో పది పైసల కాసును పడవేసి, వీధిలోకి పోయి ఆడుకోమనేదట.

ఇప్పుడు తెలిసింది మా రింగ్‌మాస్టరులోని మంచితనం ఎలాంటిదో.

రాము తల్లి ఒక వెలయాలి అనికూడా స్పష్టమయింది.

వరుసగా రెండు రోజులు రాలేదు రాము.

అతను రాకపోవడంతో నా కార్యక్రమంలో ఏదో వెలితి కనిపించింది.

ఎందుకు రాలేదో తెలియనుకూడా తెలియడం లేదు.

రాముతో నా పరిచయం కొన్ని రోజులదే అయినా, అతనికీ నాకు అవినాభావ సంబంధం ఏర్పడింది.

అతను రాని ఈ రెండు రోజులలోను ఆత్మీయత అనేది ఎంత తీయటిదో అర్థమయింది నాకు.

నాది శిఖండి జీవితం.

నన్ను ఆదరించేవాళ్ళు, ఆలించేవారు, ఆప్యాయంగా పలకరించేవారు ఒక్కరూ లేరు.

ఇన్నేళ్ళ నా జీవితంలో కించిత్తు అయినా అనురాగాన్ని అలవడ చేసింది, మనస్సు విప్పి హృదయపూర్వకంగా మాట్లాడింది ఒక్క రామాయే.

ఈ చిన్న రాము నా ఎడారి జీవితంలో ఒయాసిసు.

నాలోని మానవతా ఫలకంపై ప్రేమాక్షరాలను లిఖించింది రాము ఒక్కడే.

రాము రాకపోవడం నాకు ఆందోళనదాయక మయింది.

ఎందుచేత రావడం లేదు? జబ్బు పడినాడా? ప్రమాదం ఏదయినా జరిగిందా?

వాడికి కీడును శంకించేటప్పటికే నా హృదయం తామరాకుమీది నీటి బిందు వయింది. జీవితంలోనే ప్రధమంగా అనురాగాన్ని రేపి ఆనందాన్ని కలిగించిన రాము ఏమయ్యాడు?

ఏమి జరిగింది? ఎందుకు రాలేదు....?

మూడవనాడు వచ్చాడు రాము. నవ్వుతూ పేలుతూ తూలుతూ రాలేదు. ప్రపంచంలోని విషాదాన్నంతటిని తనలోనే మూర్తిమంతం చేసికొని శోకదేవతవలె వచ్చాడు. ఎచ్చి రావడమే, నన్ను చూచి చూడడమే బావురు మన్నాడు.

రాము తల్లి- నీలవేణి- చావు బ్రతుకులలో వున్నదట. ఏదో పెద్ద జబ్బు చేసిందట.

తనకు నాతో కలిగిన పరిచయాన్ని యాదృచ్ఛికంగానే రాము వాళ్ళ అమ్మకు చెప్పాట్ట. ఆమె నన్ను వెంటపెట్టుకొని తీసుకు రమ్మన్నదట.

మా స్నేహం గురించి రాము తన తల్లితో ఏ సందర్భంలో ఎప్పుడు చెప్పడో అర్థం కాలేదు.

ఆమె నన్ను పిలవ నంపడంకూడా విచిత్రంగా జరిగిపోయి వుంటుంది.

రోగిష్టి ఆ తల్లి నన్ను ఎందుకు తీసుకురమ్మన్నట్టు ?

రాము బలవంతంతో, రామును ఉత్సహించడానికి, అతని సంతృప్తికొరకు వెళ్ళవలెననే అనుకొన్నాను.

వేళకు వచ్చివేస్తానని చెప్పి బయటకు వెళ్ళడం కోసం అనుమతిని కోరడానికి మా మేనేజరు లేడు. ప్రోగ్రాం ఖాయం చేసుకు రావడానికి మరొక పట్టణానికి వెళ్లాడు. మేనేజరు వుం టే అనుమతించేవాడో లేదో!

రింగ్‌మాస్టరును అడిగి బయలుదేరి వెళ్ళాను.

రాము చెప్పినట్టె అనేకానేక సందులు గొందులు తిరిగిన పిదప మారుమూల ఎక్కడో వున్న నీలవేణి ఇంటికి చేరుకోగలిగాము.

మేము వెళ్ళేప్పటికి ఆమె లేదు.

చనిపోయింది.

నీలవేణి చచ్చిపోయింది....

* *

ప్రతి మనిషికి ఒకొక్క రహస్యం వుంటుం దనుకుంటాను.

నాకూ భయంకరమయిన జీవిత రహస్యం వున్నది.

పదిహేనేళ్ళవాటి మాట.

పదిహేనేళ్ళు కాదుకదా, పదిహేను శతాబ్దా లయినా ఆ రహస్యం మరొకరికి చెప్పుకో నలవి కానిది.

గత పదునై దేండ్లుగా ఆ రహస్యం నా మనస్సును ఛేదిస్తూ, కోసివేస్తూ, నన్ను తినివేస్తూనే వున్నది.

ఆ రోజులలో విమల అని ఒక భార్య వుండేది నాకు.

విమల నా భార్యగా వున్నపుడు నేను ఏకపత్ని వ్రతుడనే!



ఆమె చాలా చాలా అందగత్తె. ఆ అందం అంతింతనరానిది. కవులు వర్ణించదగినది.

పడుచుదనపు పచ్చదనంలోనో, పిచ్చిదనంలోనో, ప్రేమించుకొనో, కామించుకొనో ఉభయులం పెళ్ళి చేసుకొన్నాం.

పెళ్ళి అయిన ఆరు నెలలపాటు పైలాపచ్చీస్‌గా పెనవైచుకొని దొర్లి పోయాయి రేయింబవళ్ళు.

ఒక రోజున– ఆ రోజు తిరిగి జ్ఞప్తికి వస్తే మనసు కంపిస్తున్నది– పట్టపగలు ఒక చిన్న సంఘటన జరిగింది.

ఆ సంఘటన.... నే నెమని చెప్పుకోను?

ఆ సంఘటన.... దుస్సంఘటన....

నేను ఇంటికి వచ్చేప్పటికి విమల– నా భార్య– మరెవరో మగరాయనికి మేను వప్పగించి....

నేనేదో మాట్లాడబోయాను.

నా అక్కర్లు పట్టివేస్తున్నట్టు ఆమె గ్రహించినట్టు వున్నది. అన్నది:

'నే నతనితో వెళ్ళిపోతాను.'

ఒకందుకు సంతోషించాను. ముసుగులో గుద్దులాటలు వుండకుండా, దాగుడు మూతలు, దొంగాటకాలు లేకుండా, రంకు బొంకు కాకుండా స్పష్టంగా చెప్పింది విమల. తెగవేసి చెప్పింది విమల.

'నీ ఇష్టం....' అన్నాను.

ఆమె వెళ్ళిపోయింది.

అదీ జరిగింది.

అది జరిగిన పిదప పదేళ్ళపాటు నా మనస్సు మనసులో లేదు.

హృదయం కకావిక లవగా, ఉన్న ఊరును విడిచి ఒక వూరని, ఒక పల్లె అని కాక దేశం పట్టుకు తిరిగాను. ఇల్లు లేదు, వాకిలి లేదు.

ఎక్కడెక్కడో ఎందుకెందుకో తిరిగాను. చావలేక, జీవచ్ఛవంగా మిగిలాను.

అయిదేళ్ళక్రితం ఈ సర్కస్ కంపెనీలో చేరాను.


ఈ వూరు వచ్చి, పదిహేను సంవత్సరాల పిదప మరల మొదటిసారిగా ఒక స్త్రీని పలకరించడానికి, పరామర్శించడానికి రాముతో వెళ్ళాను.

నేను వెళ్ళేటప్పటికే ఆమె తనువు చాలించినది.

ఆమె జీవితంలో మొదటిసారిగా ఒకే ఒక్క మంచిపని చేసింది– మరణించింది.

మంచి పని జరిగింది.

ప్రతికిష్టంలె ఆమెను పలుకరించవలసి వచ్చేది. పరామర్శించవలసి వచ్చేది.
అది నాకు ఇష్టం లేదు. ఏ మాత్రం ఇష్టంలేదు.
ఎందుచేతనంలె –
ఆ విమలే ఈ నీలవేణి....
అంలె, రాము నా పుత్రుడు ; నా భార్య పుత్రుడు ;
కాదు, ఒక వేశ్య కొడుకు.
ఎవరికి పుట్టిన బిడ్డడో.... ;
రామును ఆ దృష్టితో నేను చూడ దలచుకోలేదు.
నే నొక దౌర్భాగ్యుణ్ణి ... వాడొక అభాగ్యుడు.
ఉభయులం నిర్భాగ్యులం.
అదే మా అనుబంధం.
పదునైదు సంవత్సరాల నాటి పుండు మరల రేగింది.
ఇప్పుడు రాము కనిపించినప్పుడల్లా ఆ గాయం కలకవేస్తున్నది.
అయినా అనుభవించాలి, తప్పదు.
నాలో నేనే కుళ్ళి చావాలి.
నా మానసిక వ్యధను రాముమీద వడనీయకూడదు.
నా ప్రభావాన్నికూడా రాముమీద ఏ విధంగానూ పడనీయరాదు.
నా నీడకూడా....



మరునాడు మరల వచ్చాడు రాము.

అతనిలో లోగడి చైతన్యం లేదు. ఆ కళాకాంతులు లేవు.

నిజమే. నాలోనూ లేవు.

రాము ఇప్పుడు పూర్తిగా నిరాశ్రయుడు. నిరాధారుడు.

ఇదివరలో 'అమ్మ అనే ఆకారం అయినా కనిపిస్తూండేది. ఇప్పుడు అందుకూ అతను నోచుకోలేదు.

రేయింబవళ్ళు నా కూడానే వుంటున్నాడు రాము. నాతోనే తింటున్నాడు.

మా కంపెనీలోని అందరు రామును ఆదరపూర్వకంగానే చూస్తున్నారు. అనాథగా జాలిపడుతున్నారు.

రాము జీవితం ఒక సర్కస్ అని వారు గ్రహించే వుంటారు.

నాలుగు రోజులు గడిచాయి, ఉన్నట్టుండి ఒకనాటి ఉదయం మా రింగ్‌మాస్టర్ 'ఎల్లుండి ఉదయమే మనం మకాం మార్చేది' అన్నాడు.

ఆ మాట వింటూనే తల్లడిలిపోయాడు రాము

నేనూ గాభరా పడినాను.

రామును ఏం చేయాలి?

'నన్నేం చేస్తావ్....?' ఎక్కి ఎక్కి ఏడుస్తూ, నా కాళ్ళకు లుంగలుపడుతూ అడిగాడు రాము.

వాడిని ఊరడించడం నా తలకు మించిన భారం అయింది.

'నన్ను వంటరిగా వదలి వెళ్ళకు- నాకిక్కడ ఎవ్వరూ లేరు. అన్నంకూడా దొరకదు. నీ గుట్టానికి నీళ్ళు పెడతాను. నీకు కాళ్ళు పడతాను. అందరికీ అన్ని పనులు చేసి పెడతాను. నాకు ఇంత అన్నం పెడితే చాలు! మీతోపాటే వుంటాను. పోట్లాడను. దొంగతనం చేయను. ఎవరు ఎన్ని కొట్టినా పడతాను.

పని లేనప్పుడు నీ దగ్గరే కూర్చొని చదువుకుంటాను.

నన్ను కూడా తీసుకెళ్లు. తీసుకెళ్ళవూ....?'

జాలిగా, దెబ్బతిన్న దుప్పిపిల్లగా నా కనులలోకి చూస్తూ అడిగి, ఒక్క పెట్టున ఉక్కిరి బిక్కిరి అయేట్టు రోదించాడు రాము!

రాత్రి నిద్రలోకూడా అదే కలవరింత.

కలవరింతలోనే కన్నీరు....

ఈ ఊరు వచ్చాను. ఇతను పరిచయం అయ్యాడు-

ఇతనిద్వారా భయంకరమైన జీవనసత్యం బయటపడింది.

చూస్తూనే ఈ భయంకరమైన నగ్న నైత్యానికి చిహ్నమైన రామును నా గుండెలమీద ఎలా మోయను?

గుండెమీద కుంపటి వంటి ఇతగాడిని నా వెంట ఎందుకు తీసుకువెళ్లాలి?

ఇతనిని చూచిన క్షణం ఆ నీలవేణి- విమల- గుర్తుకు వస్తుంది.

ఒకరి తప్పుకు మరొకరిని శిక్షార్హులుగా చేయడం మాత్రం ఏమి భావ్యం?

పెద్దల పాప పుణ్యాలు ఈ పిన్నవాని కేం తెలుసు?

రాము కేవలం అమాయకుడు.

తండ్రి ఎవరో తెలియని, తల్లి పతిత అని తెలియని, మాత్రు ప్రేమకు నోచుకోని నిర్భాగ్యుడు.

ఈ జంఝూటాన్ని మరల ఎందుకు తగిలించుకోవాలి ?

ఈ కొండ గుర్తును చూస్తూ రోజూ ఎక్కడ చచ్చేది ?

రాము జీవితంలోకి వచ్చాను, పోతున్నాను.

అలాగే రాము పక్షం రాజుల పాటు నాతో వున్నాడు, పోతాడు.

బ్రతికి వుంటే మరల ఎక్కడో ఎన్నడో కలుసుకుంటాము. పరామర్శించు కొంటాము....రాము బ్రతికి బట్టకట్ట గలడని ఏమిటి నమ్మకం ? అతని బ్రతుకుతెరవు ?

రేపు ప్రొద్దుటే పట్టెడన్నం పెట్టేది ఎవరు ? ఎలా దొరుకుతుంది ?

నేను మాత్రం ఏం చేయగలుగుతాను ? ఒకరికి జరిగిన అన్యాయానికి నే నెందుకు దుఃఖించాలి ? నాకు జరిగిన అన్యాయానికి ననె్నవరు ఓదార్చారు ?

రాము నిద్రలో పలవరిస్తున్నాడు. అవే కలవరింతలు.

ఎంత కలవరపడిపోయాడు !

ఈ చిన్న హృదయానకి ఎన్ని ఘాతాలు ? ఎన్ని ఆఘాతాలు ?

అంధకార బంధురంగా వున్న ఈ కుర్రని భవిష్యం ఏమిటి ?

అతని పాలిపోయిన చెక్కలమీద, ఆరిపోయిన కన్నీటి జాలులమీద నెమ్మదిగా ముద్దిడుకొన్నాను. సిరసంగా ముద్దిడుకున్నాను.

ఏదో అవాంఛనీయమైన- ఇదీ అని స్పష్టీకరించలేని- మధురమైన బాధ....

నాకు మాత్రం ఈ జీవితంలో 'నా' అనేవాళ్ళు ఎవ రున్నారు ?

ఈ పక్షం రోజులుగా రాము నా కెంతో సన్నిహితు డయాడు. అనుభూతులను అందించాడు. మధురిమలను చవి చూపాడు.

రాము ఏకాకి. నేనూ అంతే. ఉభయులం ఒకటయ్యాం.

మనసులు అలా కలిశాయి. మనుషులు మాత్రం ఎందుకు కలిసిపోకూడదు ?

రాముని కావలించుకొని, గుండె బరువు అంతా తగ్గేట్టు నిశ్శబ్దంగా రోదించాను.

తరువాత నిశ్చింతగా నిద్రపోయాను.

రామును చదివిస్తే!

రాము, నేను ఈ మహా నగరం విడచి వెళ్ళిపోతాము. చాలా దూరం వెళ్ళిపోతాము. అక్కడ రామును చిదివిస్తాను. అక్కడే ఎక్కడయినా పేరే ఏదైనా నౌకరీ చూసుకొని, స్థిరంగా ఒకేచోట వుండిపోతాను.

రాముతో కలిసి హాయిగా జీవిస్తాను.

ఒకరి కొకరం దొరికాం. ఒకరి కొకరం ....



'విజయవాడ ఇంజినీరు'

'భక్తా ! నీ భక్తికి మెచ్చి నా అంతట నేనే ప్రత్యక్షమయ్యాను'

'వెంటనే ఎందుకని ప్రత్యక్షం కాలేదు దేవా?'

'తీరిక లేక'

'ఎందుకని తీరిక లేదు?'

'తరువాత మరొకసారి తీరిగ్గా చెబుతాగాని, నేను త్వరగా వెళ్ళాలి, నీ కేం కావాలో ముందు కోరుకో'

'నేను కోరింది నిజంగా, అచ్చితంగా ఇస్తావా?'

'వరాలివ్వడానికే నేను వచ్చాను'



'నిజంగానా?'

'నిజంగానే. నీ సాక్షిగా'

'ప్రాణికి పునర్జన్మ వున్నదా?'

'ఉన్నది.'


'మనిషికి?'

'ఉన్నది.'

'దేవునికి?'

'ఉన్నది.'

'అయితే, వచ్చే జన్మలో నీవు ఇంజినీరువై విజయవాడకు రా. నేను కంట్రాక్టరుగా పుడతాను.'



విలేకరులు

భగవాన్ శ్రీశ్రీశ్రీ బ్రహ్మానంద పరమహంస పరివ్రాజకాచార్య స్వాములవారి ఆధ్యాత్మికోపన్యాసం మైక్రోఫోన్‌లలో గంభీరంగా వినిపిస్తున్నది.

భక్త రేణువుల కరతాళ ధ్వనులుకూడా మధ్య మధ్య పుణ్యమంత శబ్దంగాను ప్రతిధ్వనిస్తున్నాయి.

పురప్రముఖులు అందరు నాడు అచ్చోటనే శ్రద్ధాళువులై వున్నారు. తదేక దీక్షగా స్వాములవారిని గుచ్చి గుచ్చి చూస్తూ మనస్సు- కోతివంటి మనస్సు- చంచల మనస్సు- ఒక్కక్షణం ఉపన్యాసంనుంచి మరొక పైపుకు మళ్ళితే చేజిక్కుతున్న స్వర్గం కాస్తా ఎక్కడ తొలగిపోతుందో అనే భయంతో మనస్సునే నేత్రాలుగా చేసి కొని స్వాములవారి కటాక్ష వీక్షణాలనే గమనిస్తున్నారు.

ఆ క్షణంలో వారి వీపులమీద బాంబులు పడితే, పోతే వీపులే పోతాయి కాని వారి నేత్రాలు, మనసు మాత్రం చలించవు. అవి ముందుకే- మున్ముందుకే- చూస్తూ వుంటాయి, స్వాములవారినే వీక్షిస్తూ వుంటాయి.

అంత గంభీరంగానూ చెబుతున్నారు స్వాములవారు. నిలువెత్తు వేదికమీద మఖ్‌మల్ తివాసీపై కుషన్ కుర్చీలో పట్టుదిండుమీది పులిచర్మంపై సుఖాసీనులైన స్వాములవారు ప్రస్తుతం ఏకధాటిగా ఉపన్యసించేది స్వర్గం గురించి.

నరకాన్ని చవి చూపి, స్వర్గానికి పెళ్ళమని కాదు వారు చెప్పేది. సరాసరి స్వర్గానికి చేరే అడ్డదారులు– దగ్గరి దారులు– గురించే వారిప్పుడు ముచ్చటించడం.

స్వాములవారు మరెవరో మరెవరో కాదు, సామాన్యులు అసలే కాదు. వారికి ఫలానా ఫలనా బిరుదావళులు వున్నాయి. ఫలానా ఫలానా దేశాలలో శ్రీవారు ధంకా భజాయించి వచ్చారు. ఫలానా ఫలానా ప్రపంచ మతాల వారు వారిని సమ్మానించి సత్కరించారు. ఫలానా మాజీ రాజావారు పట్టపు ఏనుగుపై పురవీథులలో ఊరేగించారు. ఫలానా కొండ కోనలకు ఆవల చీమలు దూరని చిట్టడవి, కాకులు దూరని కారడవికి ఈవల వారి ఆశ్రమం వున్నది. అందు ఇన్నూరుమంది శిష్య ప్రశిష్యులు శ్రీవారి చరణ సన్నిధిన, వారి కనుసన్నలలో పునీతు లవుతూ వుంటారు.

ఈ మహానగరానికి శ్రీవారిని విజయం చేయించిన ఆహ్వాన సంఘంవారు సయితం అంతంతమాత్రులు కారు. ఆవలించండి, పేగుల్లెక్కిస్తా మనేవారు. స్థానికంగా ఎవరి పేరును వారు ఇళ్ళముందు బోర్డులు వ్రాయించుకున్నవారే, వాటి ప్రక్కనే 'కుక్కలు వున్నాయి జాగ్రత్త' అనే బోర్డులనుకూడా తగిలింపించినవారే, 'ఈ గోడల మీద ఏ విధమైన కాగితములను అంటించరాదు' అని శాసించినవారే.

అసలు స్వాములవారు నగరానికి దయచేయడానికి అంగీకరించడమే ఒక పుణ్యం. కనుక, బ్రహ్మాండమైన ఏర్పాట్లన్నింటిని స్వయంగా గావించి, పట్టణ ప్రముఖులను కదల్చి పెద్దపెట్టున బహిరంగోపన్యాసాన్ని ఏర్పాటు చేశారు. ప్రజలందరికీ ఓ మహదావకాశాన్ని కలిగించారు.

తమ భారీ ఏర్పాట్లలో భాగంగానే స్థానిక పత్రికా విలేకరులను, స్టేఫ్ ఫొటో గ్రాఫర్లను కూడా ఆహ్వానించారు– దేశానికి తెలియడానికి.

ఆహ్వాన సంఘం అతిరథ మహారథులు పత్రికా విలేకరులను, వారితోపాటు ఫోటోగ్రాఫర్లను అరగంట ముందుగానే గుర్తించి, వారి కొరకు ముందు పథకం ప్రకారమే చిన్న ఎత్తున పెద్ద నీటి విందును ఏర్పాటు చేసి, అందు స్వాములవారిని ఎరుకపరచారు. పిదప, వారిని సగౌరవంగా, సన్నిహితంగా తోడ్కొని వచ్చి జన సందోహానికి ముందు, స్వాములవారి సన్నిధిన కూర్చోబెట్టి, వారి వెనుక మరెవ్వరూ వేరకుండా తాడును అడ్డుగా గట్టిగా కట్టివేశారు.

స్వాములవారు తమ గంభీరోపన్యాసాన్ని కొనసాగిస్తూ ఆ తన్మయత్వంలోనే ఉన్నట్టువుండి ఒక్కసారిగా "…. గనుక, అట్టి స్వర్గధామానికి చేరుకో దలచినవారు ఒక్కసారి చేతు లెత్తండి!" అన్నారు.

చటీ చప్పుడు లేకుండానే కొన్ని వేల చేతులు పైకి లేచాయి. లేచిన చేతులను చూస్తూ ఆనంద పరవశు లయారు స్వాములవారు. కానీ….

ముందు వరసలో కూర్చున్న ఏకైక వ్యక్తి మాత్రం ఇసుమంతైనా చేతులు ఎత్త లేదు. సరికదా ఒకడు వెనక్కు తిరిగి చూస్తున్నాడు!


స్వాములవారు క్షణ కాలంపాటు స్తబ్ధులయారు. వెంటనే సర్దుకొని, వెనక్కు తిరిగి చూస్తున్నవారితో, మంద్ర స్వరంతో, "వత్సా! అటు తిరిగి కూర్చుంటి వేమి?" అని ప్రశ్నించారు నిదానంగ.


"చిత్తం స్వామీ! నేను స్టేజ్ ఫొటోగ్రాఫర్‌ని. స్వర్గానికి చేరుకున్నవారి ముఖాల భంగిమలను పరిశీలిస్తున్నాను- బొమ్మ తీయడానికి!"

స్వాములవారు చిరునగవు లొలికించి, "చిరంజీవీ! నీ వేల నయ్యా ఎత్త లేదు చేయి....:" అని పృచ్ఛించారు.

అందుకు ఆ విలేకరి జవాబు:

"చిత్తం! అందరూ స్వర్గానికే వెళ్ళిపోతుంటే ఎన్ని సమస్యలు రావు! అదీకాక, మరి.... తమరు మా నగరానికి విచ్చేసినట్టు, ఇంత మందిని స్వర్గానికి నరాసరి పంపనున్నట్టు ప్రపంచానికి తెలిపేందుకు...."





ఘటనా ఘటనలు

ఆకాశం నిర్మలంగా వున్నది.

పగలు రెండు ఝాములవేళ భానుడు తన చండప్రచండ కాంతులతో ప్రజ్వరిల్లుతున్నాడు.

కొత్త నీరు రాగానే లేతాకుతో ఊడ్చిన వరి చేలు ఆకుపచ్చగా, ముసురుగా వున్నాయి.

కొన్నిచోట్ల తుమ్మెగ పాటలు శ్రావ్యంగా వినిపిస్తున్నాయి.

'దమ్మ' తొక్కే దున్నలను, గిత్తలను తోలలేక, మల్లేయ లేక మరొక చోట విసిగిపోతున్నారు నౌకర్లు.

అది షావుకారు సూరయ్య మెరఁమడి. సూరయ్యకు పర్యాయ పదం 'రసికుడు' అనుకోవచ్చు. అలాగని పేరు మోశాడు, ఆ వూళ్ళోనే కాక చుట్టుప్రక్కల పల్లెలలో, దగ్గరలోని పట్టణంలో కూడా!

సూరయ్య గట్టుమీద కూర్చుని రాముడిచేత చేలోని పల్లాలను, గుంటలను పూడ్పిస్తూ గట్లు కట్టిస్తున్నాడు.

ఆ మడి దమ్ము అంతక్రితమే చేయవలె ననుకున్నాడు కాని, ముందు 'ఒడు జెరువ'పొలం తొక్కించవలసి వచ్చింది. దానిని తొక్కిస్తూ పని చూసి పోదామని రాముడి దగ్గరకు వచ్చాడు సూరయ్య.

రాముడు, సన్నగా నీటిలో మునిగిపోయిన 'అడ్డగట్టు'ను నరికివేస్తున్నాడు.

సూర్యకిరణాలు తీక్షణంగా అతని శరీరంలోని ప్రతి రక్తాణువును చూస్తున్నాయి.

రాముడు ఒంపులు తిరిగిన శరీర కండరాలతో బలిష్ఠంగా, 'మాలకాకి' నలుపులోనే అందంగా వుంటాడు.

రాముడు పదవ సంవత్సరంలో వుండగా అతని తండ్రి ఒకసారి సూరయ్య వద్దకు అతనిని తీసుకవచ్చాడు. అదే సూరయ్యకు, రాముడుకు ప్రథమ పరిచయం.

ఆ మరునాటినుంచే రాముడు సూరయ్య పాలేరయ్యాడు.

సూరయ్య యువకుడే!

సూరయ్య పనిలోకి ప్రవేశించిన ఏణ్ణర్ధానికే తండ్రిని పోగొట్టుకున్నాడు రాముడు. అప్పటినుంచి రాముడి కూడూ గుడ్డా సూరయ్య ఇంటివద్దే.

ఇప్పుడు రాముడు 25 ఏండ్ల యువకుడు.

నిరుడే రత్తి మెళ్లో పుస్తె కట్టాడు.

తస్సాదియ్యా! రాముడికి ప్రత్యేకం గుడిశ!

సూరయ్య చేను గట్టుమీద అలా కూర్చుని తన పని చూస్తున్నాడంటే రాముడి కళ్ళకవాలసిందేమున్నది! పాటనుకూడా చూడకుండా గట్టు గురే చూస్తూ కొట్టు కెళ్ళిపోతున్నాడు.

నీరు మురికిగా కదలిపోతున్నది. కొత్త నీటిలో చిన్న పీత పిల్లలు, జలగలు, కాళ్ళజెర్లు నీటి కెదురీదబోతున్నాయి.

మిడతలవంటి చిన్న చిన్న పురుగులు గట్టుమీదకు, రాముడిమీదకు ఎగురుతూ క్రిందా మీదా పడుతూ తల్లక్రిందు లవుతున్నాయి.

గొరువంకలకు, కాకులకు కావలసినంత ఆహారం.

హఠాత్తుగా చెక్కుడు పాట రాముడి కాలి బొటన వ్రేలిమీద పడింది. అదసలే చెక్కు చెక్కు పదును తేలి వున్న పార.

రాముడు దానిని గమనించనే లేదు. చెక్కుతూనే వున్నాడు.

ఎట్టివారిన నీరు అతని కంటపడిన తరువాతికాని కాలు చురుక్కు మనలేదు!

కాలు ఎత్తి చూశాడు. దిట్టమైన జలగ ఒకటి గట్టిగా కాలికి పట్టి వున్నది. అసలది కాలికి పట్టి ఎంతసేపయిందో!

బొటన వ్రేలు కనుపించనే లేదు- గోటి పైభాగం వరకు రక్తం 'జల'లా ఉబుకుతున్నది.

రాముడలా నుంచోవడం చూసిన సూరయ్య అన్నాడు: "ఎంట్రా...! బురద కొయ్యా! పారెట్టి నడింకి తెగెయ్యొస్!"

రాముడు గట్టుమీదకు వచ్చాడు.

అర్థంకాకుండా రాముడివి ఆపాదమస్తకం చూస్తూ, సూరయ్య "అరెరె.... గుడ్డచించి కట్టు కట్టు- ఏంటది?" అంటూ కొంచెం పైగా వున్న జలగను చూసి బెదురుతో "అరేయ్, ముందా జలగన్లాగేయ్" అని పైనున్న సిల్క్- కండువాతో ముఖం తుడుచుకున్నాడు.

చక చక తలకు చుట్టి వున్న తువాలును చించి రక్తప్రవాహానికి అనకట్టకట్టాడు.

రక్తాన్ని చూడగానే రాముడి ఆలోచనలు పరిపరి విధాలపోయాయి, రాముడు తను చదివిన అయిదు తరగతుల చదువూ మరచిపోయి, మామూలు 'మాలపల్లి' భాషలో పడినాడు కాని, మంచి జ్ఞాపకశక్తి కలవాడు, తెలివైనవాడు.

రాముడి ఆలోచనలు మూడు రోజులక్రితం డాక్టరు వాళ్ళ గూడెం వచ్చి, సభ జరిపి, ఇచ్చిన ఉపన్యాసం వైపుకు మళ్ళాయి. ఆ మహాసభకు అధ్యక్షుడు సూరయ్యగారే.

"మీరంతా యువతీ యువకులు. మీ రక్తం పవిత్రమైనది. ఉట్టికలెత్తే మీ యువక రక్తాన్ని ఊరికే వృధా చేయకండి. దేశంలో లక్షలాది ప్రజలు రక్తం చాలక ప్రాణాలను కోల్పోతున్నారు. ముఖ్యంగా మన రాష్ట్రంలో బాలింతలు, పసిపిల్లలు, యువతీ యువకులు అనేకమంది రక్తం చాలక చనిపోయినట్టు ప్రభుత్వం లెక్కలు తెలుపుతున్నాయి.

"మీ పవిత్రమైన రక్తంలో మీకు ఇష్టం వచ్చినంత- ఎంత తక్కువగా అయినా సరే- మాకు ఇచ్చి ప్రభుత్వానికి సహాయం చేయండి. అది ప్రతి పౌరుని కనీస ధర్మం. మేము పరీక్షించి మీ రక్తాన్ని తీసుకుంటాం.

"వృధాగా మీ రక్తాన్ని పాడుచేయకండి!"

ఈ ఘోరణిలో ముగిసింది డాక్టరుగారి ఉపన్యాసం. రాముడి చెవులలో ఆ ఉపన్యాసం ప్రతిధ్వనించినది. కాలివేలి వైపుకు చూశాడు. ఇంకా సన్నగా రక్తం కారుతూనేవున్నది. వెంటనే ఒంగి దాన్ని ఘట్టిగా బిగించి కట్టివేశాడు.

"అట్టా చూస్తావేరా, జలగనుకూడా లాగేయి!" అంటూ చుట్ట ముట్టించాడు సూరయ్య.

అప్పుడు కాని రాముడి దృష్టి జలగమీదకు పోలేదు. లాగబోయాడు, కాని ఆ జలగ అంతంత మాత్రాన వస్తుందా? సూరయ్య చుట్ట నమిలి దానిమీద ఊస్తేనేకాని అది రాలి, చావలేదు.

తటుక్కున రాముడికి అతని బావమరది జ్ఞాపకం వచ్చాడు. రక్తం లేకనే తన బావమరది చనిపోయాడని ఈ డాక్టరే అప్పుడు చెప్పాడు.

జలగ పోయినా రక్తం కారుతూనే వున్నది. చక్కన చేలో కోరిగి కొత్త బురద తీసి గాయానికి గట్టిగా, మందంగా పులిమివేశాడు. రక్త ప్రసారం కట్టింది.

రాముడు పాఱి ముఖాన్ని, పొగమేఘాలవైపు చూశాడు నిట్టూరుస్తూ.

* * * *

"ఏంట్రో.... దిగక ! ఈ పూటే ఈ కుంట మడి అవ్వాలి ! ఆ పెద్ద బోదికి అడ్డీవేసి పల్లపుకుంటనుకూడా పూర్తిగా తడపాలింక...."

"..... ...."

"ఏంట్రా అట్టా సూస్తావ్.... దిగూ...."

"ఇకీ పూట చెయ్యలే న్దొరా. ఇంటికెల్లి కాసిని గంజి తాగి పట్నం పోవాలి"

"పట్న మెందుకురా ?"

"నెత్తు రియ్యాలండి!"

"ఆ ! రక్తమా.... ఎవరికీ ?"

"ఆయనే దొరా ! మొన్న మీముందు పెద్ద మీటింగు సెప్పాడే....డాకటేరు! ఆయనకి."

"అయితే ఇప్పుడు నీ రక్తం ఇస్తానంటావ్ ?"

"మరే దొరా....!"

"ఒద్దురా పిచ్చోడా...."

"ఆ....? మీరేగా దొరా సెప్పారు మొన్న !"

"చెప్పాల్రా అలా! నీకు తెలియదులే అదంతా. ఉరేయ్! నాకు తెలియక అడుగుతాను- ఎవరికోసమో నీ రక్తాన్ని ఇవ్వమంటే ఇస్తావట్రా!"

"లేద్దొరా ! తప్పకుండా ఇస్తా. అందుకే పట్నం పోతా! పోనీ.... ఈయాల నాగా యేసుకోండి. లేకపోతే అదో సంది..."

అదీ- 'అది'!

సూర్యయ్య మనోదృష్టి 'అది' వైపుకు పరుగు తీసింది.

అది- రత్తి !

రత్తి ఎంత అందంగా వుంటుంది! ఆ గూడెంలో అదే 'బంగారు బొమ్మ !'

ఆనాడు- పెళ్ళిరోజున- రాముడు, రత్తి వంగి తన కాళ్ళకు మొక్కుతుంటే- రత్తి తొడిగిన నలభయ్యో నెంబరు రైకలోంచి....

అంతే-అదే చూట్టం- మళ్లీ చూడలా అ రసికుడు!

షాక్ కొట్టింది సూరయ్య బుఱ్ఱలో. క్షణంసేపు ఆలోజించాడు.

సూరయ్య మంచి రసికుడే కాదు, అందగాడుకూడా!

సూరయ్య భార్య ప్రస్తుతం తొలిచూలి పురిటికి కన్నవా రింటి కెళ్ళింది.

"ఒరే.... మీ దొరసాని పుట్టింటి కెళ్ళిందిరా మొన్నే. నువ్ కాస్త పెందరాళే వచ్చి వంట సాయం చేస్తావనుకున్నా"

"నేనా....?"

"ఏరా...!"

"మా....ఛ! నేనేంటన్డీ ..."

"చాఛ! అదంతా పూర్వకాలపు వాళ్ళకిరా! ఇప్పుడైనా మీ దొరసానికే కాని, మన కదేం లేదు. ఏడూళ్ళు తిరిగే వాళ్ళకు మనకుక్కలంతో పనేంట్రా....!"

"అయినా...."

"అబ్బే! అసలు కులం పట్టింపు వుంటే, నిన్నెంచుకు అడుగుతారా!"

"మరీ— ఈయాల్టికి నేను పట్నం పోవాలండి! పొద్దున్నే రకతం ఇయ్యాల!"

"ఛ! ఏదో, నీకు ఇంటివద్ద రత్తి చేస్తుంది కదా అని నోరు తెరచుకు విన్నడిగితే..."

పట్నం వెళ్ళవలెననే పట్టుదల రాముడికి హెచ్చుతున్నది. సాధారణంగా పట్టినపట్టు విడువని మంకు రాముడు.

"పోనీ.... రత్తినే పంపిస్తాలెండి, కాసేపుడకే సొత్తది!"

"తప్ప కెళతా నంటావ్?"

"తమరి శలవ. కాదుగూడదంటే ఆగిపోతా....!"

"సరే! ఎవరైతే యేంలే! నువ్వయితే ఏదో కాసేపు మాటా మంతీ మాట్టాడ వచ్చనుకున్నా.... పోన్లే— దాన్నే పంపు!"

"ఓ! మీకు బెరుకు లేకుండా ఉండాలేకాని, అదే కాసేపు వుండి వొండి పెట్టి పోద్ది"

"ఆఁ, మన కెంతరా! తవ్వెడు బియ్యం ఉడకేస్తే పొద్దున్నే సద్దన్నం మీకే మిగులుతుంది. నా కెంతరా- కాఫీ లవీ తాగేవాడికి.... నాలుగు మెతుకులు! నీ ఆదదాని కష్టం ఊరికే- ఉంచుకోన్లేరోయ్!"

"ఎంత మాట దొరగోరూ.... మేం తినే కూడంతా మీది కాదా!"

"అహా! ఎందుకూ! ఏ అరవయ్యో నెంబరు రవికముక్కో పెడితేపోయె నువ్ వెళ్ళక తప్పదంటావ్....?"

"ఊహూఁ, కాస్త కాయితమ్ముక్క రాసియ్యండి డాక్టరోరికి...."

సూరయ్య పార్కర్ పెన్నుతో తన డైరీలోని చిన్న తెల్ల కాగితాన్ని నలుష చేసి మడిచి చేతికి ఇచ్చాడు.

"సరే పెందరాడే పోయిరా.... ఆఁ— అన్నట్టు రత్తిని తన పని చూసుకునె రమ్మను, మళ్లీ పోయేటప్పటికి పొద్దుగూకుతుండేమో—"

మరునాటి ప్రొద్దుటే రాముడి ముఖ్యమిత్రుడు శేషుగాడు హాస్పిటల్లో వున్న రాముడి వద్దకు పరుగెత్తుక వచ్చాడు.

రాముడు తన రక్తాన్ని ఇచ్చి, తన కోరిక ఈడేరిందనే ఉత్సాహంతో పడుకుని వున్నాడు.


అంతలోనే ఉబుములా శేషుగాడు వచ్చి పిడుగులాంటి వార్త చెప్పాడు :

"రాత్రి సూరయ్యదొర రత్తిని చెరచబోయాడు. కత్తి పుచ్చుకొని బెదిరిస్తూ బలవంతపెట్టబోతే, మెలితిరిగి అదే పొడిచేసిందంట. సూరయ్యదొర చచ్చాడు.

పోలీసు ల్లారీల్లో వొచ్చి అందర్నీ అరెస్టు చేసి, సూరయ్యదొర శవాన్ని రత్తినికూడా ఈ పట్నమే తీసుకొచ్చారు. నేనుమట్టు కెట్టాగో తప్పుకున్నా. లేక పోతేనా...."

రాముడు ఉద్రేకాన్ని ఆపుకోలేక అప్పుడే ఆ హాస్పిటల్ గేటు దాటాడు.

అప్పుడే వచ్చి అంతా వినిన డాక్టర్ అలాగే తెల్లబోయి చూస్తున్నాడు. ....





ఆకలి

తల్లి కొగిలిలో తల దూర్చుకుని కుములుతూ, వెక్కి వెక్కి ఏడుస్తూ,
అడిగాడు రాము :

"అమ్మా.... ఆకలే...."

"....."

"అమ్మా.... అన్నం పెట్టు.... ఆకలే...."

"....."

"అమ్మా...."

"అన్న యెస్తున్నాడేమో చూడు బాబూ...."

"నాకేం...? నువ్వే చూడు.... ఆకలే"

"పోనీ.... అక్కా యొస్తుందేమో చూడు...."

"నాకే ఆకలే... ఓ.... ఓఁ...."

చిలునవ్వును తనలోనే నవ్వుకొంది- పైకి నవ్వే తడి లేక తల్లి.

"అమ్మా ... ఆకలే.... హమ్మాఁ...."

"అన్న యొస్తున్నాడేమో చూడమంటల్లా...."

'అమ్మకు కోప మొచ్చింది' అనుకున్నాడు బుడుతడు రాము. ఇక గత్యంతరం లేక ముక్కుతూ మూల్గుతూ, గొంతులో వెక్కి వెక్కి ఏడ్చుకుంటూ అమ్మ దగ్గర నుంచి లేచి, తలుపులు లేని దర్వాజాలోనుంచి బయటకు వచ్చి దార్లు చూశాడు.

అతనికి ఆ దారికి అడ్డుగా పొడుగాటి తాటి చెట్ల నీడలు మాత్రమే కనుపించాయి.

నిస్పృహతో వెనక్కు తిరిగాడు- అక్కకోసం దొడ్డి దారిని చూస్తూ. ఇంటి ధడి ప్రక్కనే దాలిగుంట చేసుకుని ముట్టి వెల్లకిలవేసి పడుకున్నకుక్క కనిపించింది,

రాముకు ఎక్కడినుంచో.... బహుశః నిరాశామయ నీలి నయనాల నుంచేనేమో ఉత్సాహం పుట్టుకొచ్చినది.

పిల్లి కాళ్ళతో చకచకా దాని ముందుకు నడుస్తున్నాడు రాము.

కుక్క దానిని కనిపెట్టినది కాబోలు, 'భౌ' మని మొరిగి, అక్కడినించి లేచి ఆవలకు వెళ్ళి వళ్లు దులుపుకున్నది.

రాముకు భయంతోపాటు కోపము, ఆశ్చర్యంకూడా ఆవరించాయి. ప్రతిరోజు గుట్టిమని ఆ కుక్కనే పట్టుకుని స్వారీ చేసేవాడు. అదికూడా ఎంతో ఆప్యాయంగా అతనిని ఆడించేది.

రాము ఏడుస్తుంటే అదికూడా ముఖమ్ము పెకెత్తి ఏడ్చి యేడ్చి. ఏమీ తోచక, వచ్చి రాము ముందు ముంగాళ్ళమీద కూర్చునేది రాము ఏడ్పును మానివేసి దాని వీపుమీదకు ఎక్కబోయేవాడు.

ఆ కుక్కే ఇప్పుడు రాముని భయపెట్టింది.

దానికి అసలు కారణం లేకపోలేదు.

మనుషులకంటే ఏమంత మించిపోయినవి కాదు కుక్కలు.

దానికి మూడు రోజులనుంచి కనీసం గంజినీళ్ళుకూడా పోయడం లేదు

కారణం.... వాళ్ళు పస్తే!

రాము అన్నకు మూడు రోజులనుంచి కూలి రావడం లేదు. గింజలూ కొల్లవ లేదు!

రాము దిగులుగా బిక్క ముఖంతో కుక్కవైపుకే చూస్తున్నాడు.

కుక్కకు రాము గొడవలేదు. అది అటూ ఇటు బిత్తర చూపులు చూస్తున్నది. ఆకలితో.

అంతలోనే ఒక కోడి అటువైపుకు వచ్చింది.

కుక్క కడుపులోని మాడిన ప్రేవులు క్రక్ క్రక్ మన్నాయి. ఒక్క గంతు వేసింది. కోడి మెడను పట్టుకు కూర్చుంది ముంగాళ్ళమీద.

కుక్క కోడి ఈకలను చీరాడుతున్నది. అంతలోనే కోడి రక్తంమీద ఈగ వాలింది. దానిని చూస్తున్న కుక్కకు కోపం వచ్చింది. ఈగను గుటుక్‌మని మింగింది.

రాముకు ఆకలి మరల జ్ఞప్తికి వచ్చింది.

ఎదురుగా కుక్క కాళ్ళలో కోడి తన్నుకుంటున్నది.

రాముకు ఏమీ తోచడంలేదు.

అతని కాళ్ళవద్ద రాయివంటి పాటిమట్టి గడ్డ కనిపించింది.

మెల్లిగా కూర్చుని దానిని తీసి, ఆ చేతిని వీపు వెనుక వుంచి కుక్కవైపుకు రెండు మూడు బుల్లి బుల్లి అడుగులు ముందుకు వేశాడు.

కుక్క పండ్లికిలించింది. ఎట్టి రక్తపు దంతాలు రాముకు కొరివి దయ్యాల్లా కనిపించాయి. దాని ఎట్టి కళ్ళను చూస్తేనే భయం వేసింది. చేతిలోని గెడ్డ జారి క్రిందపడింది.

రాము తెల్లముఖంవేసి అటు ఇటు ఖంగారుగా చూశాడు.

క్రిందకు చూస్తునే. కాళ్ళు ఈడ్చుకుంటూ, నేలను తన్నుకుంటు వచ్చే అక్కను చూశాడు రాము. అతనికి పోయిన ప్రాణం మరల వచ్చిందా అన్నట్టయింది.

దగ్గరకు రానిచ్చి చేతితో చూపిస్తూ అక్కకు ఏమేమో సంజ్ఞలు చేశాడు. రాము చేతివైపుగా కుక్క కాళ్ళలో తన్నుకుంటున్న కోడిని చూసింది అక్క.

అక్క కమలను ఆకలి ఒక్క తన్ను తన్నింది!

అటూ ఇటూ చూసి క్రింది గడ్డను తీసికొని కుక్కమీదకు విసిరింది.

ఈ సారి కుక్కే ఝడుసుకున్నది. కోడిని అక్కడే వదలి మొరుక్కుంటూ పారిపోయింది.

అక్క, గిలగిలా తన్నుకునే కోడిని పట్టుకుంది- ఘట్టిగా....అంతే....!

అక్కా తమ్ము లిద్దరినీ మూడు రోజులనుంచి తిష్ఠ వేసుకూర్చున్న ఆకలి కదలించివేసింది.

అక్క చీర నిండా కోడి రక్త....

మరి అయిదు నిమిషాలలోనే కోడిని తయారుచేసి కాలవడానికి లోపలికి సుళుపోతువాళ్ళరు.

అంతలోనే, అప్పుడే, వెనక్కు వెనక్కు తిరిగి చూసుకుంటూ, తొప్పుతూ ఇంట్లోకి ప్రవేశించే అన్నకు గుమ్మంలో అప్పుడే బయటకు వచ్చే చెల్లెలు కనిపించ లేదు.

చెల్లెలికి పొరుగింటావిడిమీది కోపంతో అన్న గుమ్మంలోకి వస్తున్నాడనే ధ్యాసే లేదు.

గుమ్మంలో ఇద్దరూ గుద్దుకున్నారు.

ఆ దెబ్బతో అన్న స్పృహ తప్పి పడిపోయాడు.

అన్న పడేటప్పుడు చేతిలోని అన్నపు బుట్ట అమ్మ ఒడిలోవున్న రాము వీపు మీద పడింది.

రాముకు చలనం లేదు. తల్లి లేపింది. లేవలేదు. అలిగి పడుకున్నాడనుకుంది. పెద్ద కొడుకు వైపు చూసింది.

అన్నయ్య పడిపోయేటప్పుడు జేబులోంచి కొన్ని చిల్లర డబ్బులు రాలి గల్ గల్ మన్నాయి.

చెల్లికి ఎక్కడ లేని సంతోషం కలిగింది.

అన్నకు జీతం వచ్చింది కాబోలు అనుకున్నది. మోకాళ్ళమీద కూర్చుని చకచకా చిల్లర డబ్బులను ఏరుకున్నది.

వాళ్ళకేం తెలుసు– ఆ అన్నం కోసం, ఆ చిల్లర డబ్బులకోసం–అన్న ఎన్ని వీధులు తిరిగాడో, ఎన్ని గడపలెక్కే-డో, ఎంతమందిని ముష్టడిగాడో, మోసాలు....

కార్మికుల వీలువ మూడు రోజులపాటు మిల్లులను మూసివేస్తే ముష్టి!

అమ్మ రామును మళ్ళీ చరిచింది. రాము కదల్లేదు, మెదల్లేదు. అమ్మ రామునే వెల్లకిలా తీసింది. ఒక్కసారిగా గుండెలు పగిలిపోయాయి. రాము కాదు,– రాము శవం– అదీ!

"బా... బూ...." అంటూ రాముమీద కూలిపోయింది తల్లి.



అంతలోనే....

అదే దొడ్డి గుమ్మంనుంచి 'గయ్' మంటు ప్రేక్షకావిడ పడుతూ లేస్తూ వచ్చింది. ఆమె మొదటినుంచి, జిల్లేడు చెట్ల చాటునుంచి అంతా చూస్తూనే వున్నది:

"అయ్యో దేవుడా....బంగారంలాంటి కోడిని నీ పొట్టను పెట్టుకున్నావేమే! మొన్ననే మా అన్నయ్య బతిమాలి వద్దన్నా మరీ యిచ్చాడే.... ఇక రేపో మాపో గుడ్లు పెడ్తుంది, కేరతాం దనుకుంటున్నామె! అయ్యో రాతా....! బంగారంవంటి బూడిద వన్నె కోడి పెట్టను నీ పొట్టన పెట్టుకున్నావేమే....! సోలెడు బియ్యం మడిగితే ఇయ్యలేదని ఈ పాపాని కొడిగట్టావంటే....!! నా కోడే దొరికిందంటే నీకూ....! ఆ వారకు పోయి పోగేసుకు తినరాదంటే.... ఆశ్ రంకుదానా! లంజకానా! ఎంత పని చేశావే...."

ఈ విధంగా నోటికి వచ్చిన పల్లె భారతాన్ని ఒలికిస్తూనే ఒక్క గుంజున కోడిని తీసికొని ఆ దొడ్డి దారంటే చకచకా చక్కా వెళ్ళిపోయింది.

అక్కా తమ్ముళ్ళిద్దరూ నిలువు గుడ్లతో ఒకరి ముఖా లొకరు చూసుకున్నారు.

రాముడు తలకాయె త్తి, కమల తల దించుకుని అలాగే కొంతసేపు మూచి, కళ్ళీడ్చుకుంటూ లోపలకు వెళ్ళారు.

రాము తల్లి ఒడిలో పడిపోయాడు.

కమల జరిగినదంతా తల్లితో చెప్పింది.

అంతా విన్న అమ్మ అన్నది: "పిచ్చి తల్లి! అసలు వాళ్ళకోళ్ళేలేవే! అసలు వాళ్ళ అన్న యిస్తానికీ-మూడేళ్ళనుండి కన్నారింటికే ఇది పోవడంలేదుగా!"

ఈ మాట వినగానే కమలకు పౌరుషం ముంచుక వచ్చింది.

"దొంగముండ! ఎంత పని చేసిందీ....! ఉండు-దాని పని చెప్తా" అంటూ లేవబోయింది.

తల్లి ఆపింది- అన్నది:

"పోనీలేవే పాపం! వాళ్ళాయనకూ నాలుగు రోజులనుంచి కూలి డబ్బు పంచడం లేదు. వాళ్ళూ మనకంటే ఎక్కువే చచ్చిపోతున్నారు. అకలి బాధకు ఆగలేక పాపం ఆ సుశీల నిన్నలా కూసింది. అసలు కోడి ఎవరిదో పాపం! పోనీలే- వాళ్ళకయినా అకలి తీరతంది...."

కాని, కమలను 'అనవసరంగా తిట్టింది' అనే బాధ వేడిపించింది.

తల్లి ఎంత చెప్పినా వినకుండా పోట్లాటకు బయటకు వెళ్ళబోయింది.

Blank Page

శ్రీ అడ్డుమిల్లి పూర్ణచంద్రరావు రాసిన ఈ కథల్లో జీవం వుంది. జీవితం వుంది. అది ఈ కథల ప్రత్యేకత. వీటిని చిత్రించడానికి కావలసిన [illegible]నైన భాష శ్రీ పూర్ణచంద్రరావుకు వుంది. సన్నివేశానికి కుదిరే శైలి, చేవ, వాడి ఈ ప్రత్యేకతలు. ఈ కథలకు అలంకారాలు. అందుకనే అన్ని జీవం వుందని. చదవండి-మీకే తెలుస్తుంది.

—వుల సాంబశివ [illegible]

ఈ రచయిత మీద పూర్వ, వర్తమాన కథకుల ప్రభావం ఏమాత్రమూ వున్నట్టు నాకు తోచలేదు. కథల ఇతివృత్తాలుగా, కథనమూ కూడా రచయిత సొంతంగా కనిపిస్తాయి. ఒక్కటి దాదాపు అన్ని కథలలోనూ కనిపిస్తుంది. ఈ కథకుడు కేవల వాస్తవికతకూ, కథలలోని భావాలు విశ్వసనీయంగా వుండేటట్టు చూడటానికీ శ్రమ పడలేదు. దాదాపు ప్రతి కథలోనూ సమ్మోహకమ్యంగాని మలుపు ఒకటి కనిపిస్తుంది. రచనా విధానం రేఖా చిత్రాలను స్ఫురింపజేస్తుంది.

—కొడవటిగంటి కుటుంబరావు



hori **PODDU**
hori **PODICHINDI**
hori *Short Stories*

hori **Adusumilli**
tive **Purnachandra Rao**

Five Rupe

పొ ది చి ం
చిన్న క
అ డ్డు మి
పూ ర్ణచం ద్ర
ఐదు రూపా